# ఆంధ్రపత్రిక
## సచిత్రవారపత్రిక




వెల 4 అణాలు
సంచిక 6 సంపుటము 42
అక్టోబరు 5 1949

## ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



# ఆంధ్రదేశంలో, తుపాను బీభత్సము





విజయవాడలో వరదలవల్ల గృహాలులేని ప్రజలు శివశంకర్ రోడ్డు మీదుగా వస్తున్న దృశ్యం.







వరదలలో కొట్టుకువచ్చిన పాములను పోగుచేసి చూస్తున్న పిల్లల దృశ్యం.

ఈ నెల 21-వ తేదీన పడిన 28 దుక్కులవర్షం ఫలితంగా ఒంగోలు - అమ్మనబ్రోలు మధ్యను మద్రాస్ - కలకత్తా రైలుమార్గానికి దాదాపు 6 మైళ్ల పొడవున గండి పడింది. రైలుమార్గాన్ని సరిచేయడానికి వారం రోజులు పట్టింది. ఈ దిగువ చిత్రాలు రైలుమార్గం ఎంత ఛిన్నాభిన్నమైపోయిందీ తెలుపుతూ ఉన్నవి.

(ఫోటోలు: సి. ఎస్. శాస్త్రి,

# ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును


ఒరు లేయవి యొనరించిన నరవర, యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 42

సంచిక 6

**Founder : K. NAGESWARA RAO**

విరోధి సంవత్సర ఆశ్వయుజ శుద్ధ చతుర్దశి బుధవారము

మహాత్మాగాంధీ

జయంతి : అక్టోబరు 2—

వర్ధంతి : జనవరి 30—



ఆంధ్రపత్రిక

1949–వ సం॥ అక్టోబరునెల 5–వ తేది బుధవారము

# గాంధిజయంతి

"మహాపురుషుడు గాంధీజీ. వారిని మనము ఏవిధముగ కీర్తించగలము? వారి మహత్తును ఏవిధముగ విలువ కట్టగలము? గాంధిమహాత్ముడు పుడమిపై యవతరించి, దీర్ఘకాలము సంచరించి అస్తమించెను. ప్రపంచచరిత్రలో ఏమానవునకు లేని గొప్ప ఖ్యాతిని పొందిన ఆ మహితాత్ముని మనము ప్రశంసింప జాలము." అని భారతప్రధానమంత్రి పండిట్ నెహ్రూ, 1948 ఫిబ్రవరి 2 వ తేదీన అధినివేశ శాసనసభయందు ప్రకటించిరి. "గాంధిజీ ఋషిపుంగవులలో రాజనీతిజ్ఞుడు. రాజనీతిజ్ఞులలో ఋషి పుంగవుడు. ఆయనలో ప్రతిభ, సాధుత్వము నిరుపమాన ఔన్నత్యమును అందుకొనినవి. మహాత్ముని చిత్తప్రవృత్తిని, వారి తత్వమును అవగాహనచేసుకొనుటకు భారతీయులే గాక, అనేక మంది పాశ్చాత్యులు సైతము శక్తికొలది ప్రయత్నించిరి" అని సుప్రసిద్ధ అమెరికన్ రచయిత జాన్‌గంథర్ వర్ణించెను. మానవకోటి ఇంకను అట్టి ప్రయత్నావస్థయందే యున్నది. మహాత్ముని తత్వము ఇంకను మన రాజకీయవేత్తలు అవగతముచేసుకొనవలసియున్నది.

ప్రపంచమును అణ్వాస్త్రములవల్లనే జయింపగలమనే, ఇప్పటికి అగ్రరాజ్యములు భావించుచున్నవి. సోవియెట్ రష్యా అణుబాంబునిర్మాణరహస్యమును గ్రహించినదని తెలిసినవెంటనే అమెరికా తన అణ్వాస్త్రముల నధికము చేసుకొనుటకు ఉపక్రమించెను. దౌర్జన్యమును ప్రతిదౌర్జన్యమువలన, యుద్ధసన్నాహములను యుద్ధముద్వారాను జయింపగల మను భావమే ప్రపంచ మండలి అన్నిరాజ్యముల దేశాంగ, విదేశాంగనీతికి మూలమగుచున్నది. కాని ఏ క్షణమునకు ఆ క్షణము యుద్ధమును శాంతివలననే జయింపగలమని, దౌర్జన్యమును సాత్వికపద్ధతులవలనను జయింపగలమని స్పష్టమగుచునే యున్నది. మన రాజకీయవేత్తలు మాత్రము ఈ సత్యమును గ్రహించినను, ఆ మార్గమును అనుసరింప సంసిద్ధులగుటలేదు.

"మహాత్ముని ప్రబోధమే ప్రపంచ శాంతికి శరణ్యము" అని సర్వత్ర అంగీకరింపబడినది. గతసంవత్సరం ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ ఐక్యరాజ్యసమితిసర్వసభ్య సమావేశమున గాంధి మహాత్ముని దివ్యసందేశమును విశదీకరించినపుడు అన్ని రాజ్యముల ప్రతినిధులు హర్షధ్వానములు చేసిరి. అయినను ప్రపంచశాంతి ఇంకను సాధింపతగిన పరమపవిత్రలక్ష్యముగనే యున్నది. ఆ లక్ష్యము సిద్ధింపవలెనన్న ప్రపంచప్రజలు యావన్మంది మహాత్ముని శాంతిసాధనవాదమును అవగాహన చేసుకొనవలసియున్నది. "యుద్ధము వచ్చినపుడు దానిలో చేరకుండుట మాత్రమే శాంతి ప్రియత్వమని కొందరు శాంతివాదులు పల్కుచుండిరి. యుద్ధముల నివారించుటకు యత్నించుటే సత్యమైన శాంతిప్రియత్వము. యుద్ధకారణములను తొలగించుటద్వారానే యుద్ధనివారణ సాధ్యము. ఇందుకు పట్టుదలగ పోరాడవలెను. ఆ పోరాటము దౌర్జన్యరహితముగ సాగవలెను. ఇదే మహాత్ముని శాంతిసాధనావాదము." అని శాంతినికేతనములో దీనబంధు భవనము అధ్యాపకులుగ నుండిన యస్. కె. జార్జిగారు వివరించిరి. "భగవంతునియందు నిశ్చలవిశ్వాసమే; తాను భగవంతుని సాధనమే అను నమ్మకము; భగవంతుని సాన్నిధ్యము చేరుటకు, భూలోకమున శాంతి సౌఖ్యములు లభింపచేయుటకు 'అహింస' అన్నది ఒక్కటేమార్గము అను విశ్వాసము; గాంధిమతము యావత్తు ఈ మూలసూత్రములలో ఇమిడియున్నది." అని లూయిస్‌ఫిషర్ వివరించెను. గాంధిమతావలంబులై, మహాత్ముని శాంతి సాధనావాదమును అంగీకరించిన అసాధ్యము, దుర్ఘటము అనునదేదియు ఉండజాలదు.

ఈ సంవత్సరము శాంతినికేతనమునందు ప్రపంచశాంతివాదులు సమావేశమగుచుండిరి. వారి ప్రయత్నములు, ఆ సమావేశము ఫలించుట పూర్తిగ భారతప్రభుత్వము, ప్రజలు అనుసరించు మార్గముపైననే ఆధారపడియుండును. నేడు మహాత్ముని 81 వ జయంతి. గత వారమురోజులుగ దేశమంతటను మహాత్ముని జయంతి ఉత్సవములు జరుగుచున్నవి. మహాత్ముని మార్గమును అనుసరించుటకు ప్రమాణములు గైకొనబడెను. 1948 జనవరి 30 న మహాత్ముడు అంతర్ధానమైనతరువాత భారతీయులు జరిపిన గాంధిజయంతులలో నిది రెండవది. అప్పటికి ఇప్పటికి దేశపరిస్థితులలోగాని, ప్రజల మనఃప్రవృత్తిలోగాని విశేషమైన మార్పు వచ్చినట్లు కన్పింపదు.

భారతదేశముననే హింసావాదము తలయెత్తి ప్రజాశాంతికే భంగము కల్గించుచున్నది. హింసాపూరితమైన కమ్యూనిజముగాక, శాంతి, సత్యము, ప్రేమ ప్రధానమైన 'గాంధిజము' మానవ సమస్యలను పరిష్కరించి సుస్థిర ప్రపంచ శాంతిని సాధించి సంరక్షింపగలదని ఋజువు చేయవలసిన బాధ్యత భారతీయులపైననే గలదు. 1948 జనవరి 30 నుండి గాంధిజయంతులు, గాంధివర్ధంతులు మనకు పవిత్రదినములైనవి. నాడు మహాత్ముని సంస్మరించుటతోబాటు, మహాత్ము డేర్పరచిన మార్గమున రెండడుగులు ముందుకు సాగుటకు ప్రయత్నింపవలెను. అపుడే జనవరి 30 న మనము పొందిన పరితాపమునకు, నాడు చేసిన ప్రమాణములకు అర్థముండును. గాంధిమతమే అవలంబనీయమని, గాంధి సిద్ధాంతమే సంక్షుభితప్రపంచమునకు తరణోపాయమని భారతదేశము ఇతర దేశములకు బోధింపగలదు. అపుడే గౌతమబుద్ధునివలె గాంధిమహాత్ముడును మానవకోటినంతను ఐక్యముచేసి, నేటి రాజకీయతత్వముల సంఘర్షణలలో అంతరించిపోనున్న 'వ్యక్తి'ని, తద్ద్వారా ప్రపంచమును సంరక్షించుటకు సాధనకాగలదు.

—

## కాశ్మీర్ జాతీయమహాసభ హెచ్చరిక

పాకిస్థాన్ సేనలు తన సంస్థానముపై దురాక్రమణ జరిపినపుడు కాశ్మీరు మహారాజా, ఆ దండయాత్రను ఎదుర్కొనుటకు భారతప్రభుత్వ సైనిక సహాయమును అర్థింపగా, సంస్థానము భారతదేశములో చేరినగాని ఈ విజ్ఞాపనవిషయమై ఒక నిర్ణయమునకు వచ్చుట సాధ్యము గాదని నెహ్రూ ప్రభృతులు షరతుపెట్టుట వివేకమైనది గాదని గత రెండు సంవత్సరముల సంఘటనలైనను ఋజువు చేయుటలేదు. 1947 అక్టోబరులో భారత ప్రభుత్వము మరొక మార్గమును అనుసరింపలేకుండెను. 1947 ఆగస్టు 15 కు పూర్వము అనంతరము రెండు మాసములవరకూ కాశ్మీరుమహారాజా అనుసరించిన ద్వంద్వవిధానమే అందుకు కారణము. కాశ్మీరుసమస్య ఇంత క్లిష్టమగుటకును, కాశ్మీరుప్రభుత్వ మిప్పుడు అనుసరించిన విధానమే ముఖ్యకారణము.

అయితే మహారాజా తన అధికారమును భారతప్రభుత్వమునకు దఖలుపరచి, తన సంస్థానము భారతదేశముతో చేరిపోయినట్లు ప్రకటించిన తరువాత కాశ్మీరుసంరక్షణ పూర్తిగ భారతప్రభుత్వ బాధ్యత మైనది. మహారాజా అతః పూర్వము పాకిస్తాన్‌తో కుదుర్చుకొనిన యథాతథపు ఒడంబడిక, భారత ప్రభుత్వమునకు అధికారము దఖలుచేయుటతో పూర్తిగ రద్దయినది. దురాక్రమణ జరుపుట ద్వారా పాకిస్తాన్ ఈ ఒడంబడికను ఉల్లంఘించెను. కనుక కాశ్మీరుసంస్థానముతో వుండిన కొద్దిసంబంధము తొలగిపోయెను. కాశ్మీరులో ఇంతకాలము జరుగుచున్న యుద్ధము భారత పాకిస్తాన్ దేశములకే. కాశ్మీర్ ఈ సంఘర్షణలో నిమిత్తమాత్రమైనది. ఈ విధముగ కాశ్మీరుసమస్యాపరిష్కారమునకును, భారత-పాకిస్తాన్ 'యుద్ధము'నకును ఎట్టి సంబంధము లేదు. కాశ్మీరసమస్య పరిష్కారమైనను, భారత-పాకిస్థాన్‌ల సంఘర్షణ సాగుచునే యుండవచ్చును. ఈ విషయమును పాకిస్థాన్‌మంత్రులే అనేక పర్యాయములు స్పష్టముచేసిరి. భద్రతామండలి నియమించిన "సమాధాన సంఘము" ఒక్క కాశ్మీరుసమస్యనే గాక, భారత-పాకిస్తాన్ ప్రభుత్వములకు వివాదహేతువులైన సమస్తవిషయములను పరిశీలింపవలసియున్నది. ఈ సమాధాన సంఘము దాదాపు సంవత్సరము పర్యంతము కృషిచేసినను కాశ్మీరుసమస్యా పరిష్కారము సన్నిహితము కాలేదు. తుట్టతుదకు ఈ సమస్య సమాధాన మార్గమున గాక, పరిష్కర్తవలననే పరిష్కారము కావలెనని ఈ సంఘము అభిప్రాయపడినది.

భారతప్రభుత్వము ప్రారంభదశలో కాశ్మీరుసమస్యకు పాకిస్తాన్ కూడ కక్షిదారని పరోక్షముగనైనను అంగీకరించియుండుటవలన ఇంతకాలము ఈ సమస్య అపరిష్కారముగనే యుండెను. సంస్థానప్రజల యభిమతము ప్రకారమే, భారతప్రభుత్వము వ్యవహరించిన, ఈ సమస్య ఎన్నడో పరిష్కారమైయుండెడిది. సంస్థానప్రజల యభిమతమును కాశ్మీరుజాతీయ మహాసభ వ్యక్తము చేసినంతగ మరే ఇతర సంస్థగాని, 'నాయకులు'గాని వ్యక్తము చేయలేదు. ఈ మధ్య శ్రీనగర్‌లో జరిగిన మహాసభతీర్మానములు కాశ్మీరువిషయములో గల సందేహముల నన్నింటిని నివృత్తి చేసినవి. భారతప్రభుత్వ మింతవరకు అనుసరించిన విధానమును ఆమోదించుచు కాశ్మీరుకమిషను ప్రతిపాదించిన పరిష్కర్త, నియామకసూచనను అఖిల జమ్మూ-కాశ్మీరు జాతీయమహాసభ అసందిగ్ధముగ తిరస్కరించెను. భారతప్రభుత్వము తన ఫిర్యాదును ఉపసంహరించుకొని సమితిప్రమేయములేక

నవల

# నాతోబలి

వి.డి. ప్రసాదరావు

౧౫

వాళ్ళిద్దరూ నిద్రలేచేటప్పటికి కొంత ప్రొద్దెక్కింది. ప్రభావతి ఫలహారము కాఫీ ఎదురుసండా పెట్టి ఉంచి నవ్వుతూ "పెళ్ళివారు నిద్రలు లేవండీ, కాఫీ ఫలహారాలు తయారయాయి" అంది.

ఇద్దరూ కళ్లు నలుముకొంటూ పూర్తిగా మెళకువ తెచ్చుకొన్నారు. శీను అడావుడిగా లేచాడు.

"అన్నయ్యా, నే వెళ్ళివస్తా" నన్నాడు. రాఘవరావు మాట్లాడలేదు. మొగం కడుక్కోవాని కని దొడ్లోకి వెళ్ళాడు.

ప్రభావతీ శీనూ ఇద్దరే అక్కడ మిగిలారు.

ప్రభావతి చిరునవ్వుతో "శీనూ! అన్నయ్యని తీసికెళ్ళవా?" అని అడిగింది.

శీను తలవాల్చి "అన్నయ్య రాడు" అన్నాడు. ప్రభావతి నవ్వుతూనే "మీ అమ్మగారికి సుస్తీగా ఉందన్నా రావటంలేదా?" అని అడిగింది.

శీను తల వంచుకొనే జవాబు చెప్పకుండా కూర్చున్నాడు.

"మీ అమ్మగార్కి చాలా సుస్తీగా ఉందా?"

"చాలా కాదు. బెంగతోటే సుస్తీగా ఉంటోంది."

ఆమె కాసేపు మాట్లాడలేదు.

"శీనూ! ఇవాళ ఆగి రేపు అన్నయ్యతో కలిసి వెళ్తావా?" - ఆమెకంఠంలోని బాధో ఆ మాట అక్కడినుంచి వినటానికి ఆశ్చర్యమో గుండెల నొక్కసారి కదలించిన ట్లయి తల ఎత్తి చూశాడు. ఆ నవ్వు ముగంలో ఆ కంఠస్వరంలో అతన్ని కదిలించిన విషాదపుజీర ప్రస్ఫుటం కావటం లేదు.

అతను ఏమీ అనేలోపలే రాఘవరావు లోపలికి వస్తున్న సవ్వడి అయింది.

"శీనూ! ఫలహారం పుచ్చుకోవా?" అని అడిగాడు రాఘవరావు. శీను కాలకృత్యాలు త్వరగా ముగించుకొనివచ్చి అన్నతో ఫలహారానికి కూర్చున్నాడు.

"నువ్వేమీ తీసుకోవా?" అని ప్రభావతిని రాఘవరావు అడిగాడు.

"ఇవాళ నేను కనక దుర్గగుడికి వెళ్లివస్తాను. శీను నాకు సాయంవస్తా నన్నాడు." అంటూ నవ్వుతూ, శీనువంక తిరిగి "ఏమోయ్ శీనూ! మరివస్తావా?" అని అడిగింది.

శీను ముభావంగానే ఊకొన్నాడు.

ఒక సంచిలో తువ్వాళ్ళూ, అవీ పుచ్చుకొని, "రావోయ్ శీనూ, వెళ్లివద్దాం!" అంది.

"తువ్వాళ్లెందుకు?"

"కృష్ణాస్నానంకూడా చేసుకొనివస్తాం."

రాఘవరావుకూడా బయలు దేరబోయాడు.

"నువ్వు వద్దు. మేం వెళ్లివస్తాం." రాఘవరావుకు ఏదో కలత ఛాయగా మనస్సులో ప్రవేశించిన ట్లయింది. మొరాయించిరాబోయాడు.

శీనుకు వినబడకుండా నిమ్మదిగా రాఘవరావుతో అంది—"పగలుపూట మనిద్దరం కలిసి కనబడవద్దు."

రాఘవరావుకు కొరడాదెబ్బ తిన్నట్టే అయింది. ఆ నొప్పిని తీసివేసేందు కన్నట్లుగా జాలిగా చూసింది.

రాఘవరావు ఆగిపోయాడు.

త్రోవపొడుగునా శీనును పలకరిస్తోంది. శీనుకు ఈవిధంగా ఈవిడ తనను ఎల్లా ప్రయాణంచేయించిందో అర్థం కావటంలేదు. ఆ చిరుచిరాకుతోనూ, ఆమెను చూడక ముందంతా ఆ స్త్రీఅంటే, ఆ అన్న, తమ్ముడికుండే వ్యగ్రభావం, ఇంకా పూర్తిగా మనసులోనుంచి అంతరించకపోవటంవల్లాననూ, చాల ముక్తసరిగా జవాబులు చెప్పసాగాడు. కాని ఆమె ఆ చిరునిరసనానికి అదీగ కాలేదు. మంత్రం వేసి మార్చి వేసినట్లుగా, అతనిచేత ఇంటివాళ్ళ సంగతులన్నీ విపులంగా చెప్పించగల్గింది. శీను, మౌనంవిడిచి వేసినట్లు ఆమె అడగని సంగతులు కూడా, ఉత్సాహంతో చెప్తున్నాడు. రాఘవరావుకు ఆ సంబంధం తప్పిపోయింది కాని, రాఘవరావు కనబడితే చాలును, మూడువేల కట్నంతో వెంటనే పెండ్లి చేసేందుకు సంబంధం వాళ్ళ ఊళ్ళోనే తయారుగా ఉంది. ఈ విషయం సగంచెప్పాక కాని శీనులో జాగృతి రాలేదు. అరాత్తుగా మళ్ళీ అతని వాక్ప్రవాహం ఆగిపోయింది. ఆమె ఆ సున్నితం గ్రహించింది. మనస్సులో ఆ పసిమనస్సుకు ధన్యవాదం అర్పించుకొంది. చిరునవ్వుతో సంభాషణ మార్చి, మళ్ళీ వాచాలుణ్ణి చేయగల్గింది.

గ్రిడ్డిదిగువను ఇసుకరేవుగా ఉండే రేవుకు వచ్చారు. శీనుకూడా స్నానం చేస్తున్నాడు. ఆమె మగవాళ్లకు కొంచెం దూరంగా, స్నానం చేస్తోంది.

శీను అటు చూడకుండా కృష్ణలో ఈతలాడే సంతోషంలో మునిగిఉన్నాడు. ఒకసారి ఈతవాలులో అటు తిరిగాడు. ఆమె ఇందాక టికంటెలోతుకు వచ్చి తలారా మునుగుతోంది. అంత లోతుకు రావద్దని చెప్దా మనుకొంటున్నాడు.

ఆమె వెంటనే తేలలేదు. అతనికి భయం వేసింది. అటు ఈదుకొంటూ పోయాడు. ఆమె మునిగిన చోటికి రెండు గజాల ఇవతల ఆమె నీటిపైకి తేలబోతోంది. నీటిలోపలిచేమునిగి ఉన్న ఆమెదేహాన్ని బలంగా ఒడ్డువైపుకు తోశాడు. ఎక్కువ ప్రయత్నం ఏమీ అక్కరలేకపోయింది.

ఆమె నిలబడి కంగారుగా నీళ్లు ఉమ్మేస్తూ చేతులతో మొగం కప్పుకొంటూ, నీళ్లు తుడుచుకొంటూంది.

అతనివంక చూసి చిరునవ్వు నవ్వింది. ఆత్రంతో అతనిగుండెలు కొంచెం దడదడ కొట్టుకొంటున్నాయి.

"కొద్దిగా కాలు జారింది శీనూ, నేనూ కాస్త కాలు నిలతొక్కుకోటానికి ప్రయత్నిస్తున్నాను. ఇంతలోనే నువ్వొచ్చి రక్షించావ్!"—అని మందహాసంతోనే అంటూంది. కంటిచివరలనుంచి కారుతూన్న నీరు, నదీజలాలలో, ఉక్కిరిబిక్కిరి అయినందువల్ల వస్తూన్న కంటినీరో, విషాదాశ్రువులో అతనికి తెలియటం లేదు.

ఇటూ అటూ చూచాడు. స్నానాలు చేస్తున్నవారి గమనికలోకి రానంత స్వల్పంగానూ క్షణికంగానూ, ఆఘట్టం గడిచిపోయింది. ఆమె మునిగిపోదామని ప్రయత్నించిందో లేక నిజంగా కాలుజారి కొద్దిగా తబ్బిబ్బైందో అతనికి తెలియటంలేదు.

"ముందు పైకి పదండి" అన్నాడు.

ఒడ్డుకు వచ్చి బట్టలుమార్చుకునేలోగానే, రాఘవరావు వస్తూ కనబడ్డాడు.

"శీనూ! మీ అన్నయ్యతో కాలు జారినట్లు చెప్పొద్దు. నామీద ఒట్టే" అని ఆత్రంతో అంది.

"చెప్పను" అని సమాధానపరిచాడు.

రాఘవరావు దగ్గరకు వచ్చాడు. ఏదో మహాభయం తరిమితరిమి కొట్టినమీదట, భయకారణం కేవలం భ్రమ అని బుజువైనప్పుడు, మొగంలో రాగల తేటతనం అతని మొగంలో ప్రస్ఫురిస్తోంది.

నవ్వుతూ అతనివంక తిరిగి "నిన్ను రావద్దన్నాను కాదా" అంది ప్రభావతి.

"నేను కూడా కృష్ణలో స్నానం చేద్దామని అనిపించి వచ్చాను. మీరుగుడికి వెళ్ళి ఇంటికి పదండి. నేను ఈ లోగా ఇంటికివస్తాను." అని అనగల్గాడు.

కొండదిగువకు చేరగానే, "శీనూ నువ్వు హోటలులో భోంచేసివస్తావా. ఈలోగా, నేను పూజ ముగించుకొనివస్తాను." అంది.

"నిన్ను ఈమాటు ఒంటరిగా వదిలి వెళ్లను" అన్నాడు శీను.

ప్రభావతి నవ్వుకొంది.

"అదికాదయ్యా! ఒట్టేసుకొని చెపుతున్నాగా! నాకేమీ ఫరవాలేదు. జాగ్రత్తగా వస్తానుగా! బాబువుకాదు భోంచేసిరా! మళ్ళీ అక్కడ తినవు."

శీను తలవంచుకునే "తింటాను" అన్నాడు.

ఆమెమొగం ఒక్కక్షణం వికసించింది. కాని ఇంతలో ఏదో మెళుకువ తెచ్చుకొన్నట్లు తేరుకొని, "కాదులే బాబూ! వెళ్ళి హోటలులో భోంచేసిరా, నాచేతి తిండి వద్దు!" అంటూ బలవంతపెట్టూ అతని చేతిలో డబ్బు ఇస్తోంది.

శీనుకు అర్థం కాలేదు. రాత్రి ఫలహారము చెయ్యమని బలవంతపెట్టిన మనిషి ఈ పూట భోజనం హోటలులో చెయ్యమని ఎందుకు నిరోధిస్తోందో అర్థం కాలేదు. అక్కడ జనంమధ్య అల్లరిగా తయారయ్యేట్టుందని, ఆ డబ్బుమాత్రం పుచ్చుకోకుండా, "సరే ఇక్కడే వచ్చి నువ్వుని ఉండండి, నేను యిప్పుడే వచ్చేస్తా" అని వెళ్ళాడు.

అతను భోజనం ముగించుకొని వచ్చేటప్పటికి అప్పుడే ఆమెకొండమెట్లు దిగి వస్తూంది. మందహాసంతో "జాగ్రత్తగానే వచ్చానుకదా" అంటూ అతన్ని కలుసుకుంది. ఆమెను ఇంటికి అన్నదగ్గిరకు చేర్చాక శీను అమ్మయ్యా! అనుకుని నిట్టూర్చాడు.

తమ్ముడు ఆపూట బయలుదేరకపోవటానికి రాఘవరావుకు ఆశ్చర్యమేవేసింది. రాఘవరావు మర్నాడు వస్తాడని తాను ఇచ్చిన హామీ, స్నానఘట్టంలో తన చర్యా, ఏదీ అన్నకు చెప్పవద్దని ఎప్పటికప్పుడు ఒట్లు వేసి బతిమాలింది. "ఒట్టు"ను జవదాటని పసితనం, శీనులో ఇంకా పోలేదు. అన్నయ్యతో ఏమీ సరిగ్గా చెప్పలేకుండా తప్పించి మరేదో విషయం మాట్లాడుతున్నాడు. తమ్ముడు బయలుదేరకపోవటాన్ని గురించి ప్రశ్నించేందుకు, తమ్మునితో ఇంకా కాసేపు కలిసిఉండాలన్న వాంఛే, రాఘవరావును ఆ ప్రమేయం తేనీయకుండా చేసింది.

అవేవీ కాకుండా, మరొక నూతనవిషయం రాఘవరావు మనస్సు అంతా అలుముకొని, అతనికి కొంత ఉత్సాహాన్ని నింపుతూఉంది. శీను దగ్గర లేనప్పుడు, ప్రభావతితో, ఒకమాదిరి మనస్సును నించిన సంతోషంతో, చెప్పుకొన్నాడు.

"ప్రభా! ఇవాళ నాకొక ఉద్యోగం దొరికింది. ఇందాక దోవను వస్తూ ఒక డాక్టరు కాంపౌండరు కావాలెనని వీధిలో బోర్డు కట్టగాచూశాను. ఊరికేనే లోపలికి వెళ్ళి అడిగాను. ముప్ఫైరూపాయల జీతంమీద రేపు ఒకటోతారీఖునుంచి పనిచేయటానికి కుదిరాను."

అతని ముఖంలో సంతోషం చూసేటప్పటికి ప్రభావతికి జాలితో కన్నులు చెమరించాయి. ఇన్నాళ్ళూ తన ధనంతో గడుపుకొని రావటానికి అతని పురుషకారం ఎంత దెబ్బతిని కుమిలిపోయిందో, ఈ కాస్తగడ్డిపరకా అందేటప్పటికి, ఎంత అల్పసంతోషానికి తృప్తిపడే స్థాయికి మనస్సును కుంచించుకొన్నాడో అవగాహనచేసుకొని, ఆమె హృదయం కుతకుతలాడిపోయింది. ఇందాక శీను చెప్పిన మాటల్లో, ఎంత పెద్ద హోదాలుగల ఉద్యోగాలు సమకూడాలని కుమారునిమీద ఆశలు పెట్టుకొని తండ్రి కాశీ పంపించాడో, అతని భవిష్యత్తునుగూర్చి, ఆ తల్లి ఎన్ని కలలు కంటూందో, ఆ కుటుంబం, అతన్ని ఆధారంగా చేసుకొని తేరుకొనేందుకు ఎంతగా అటమటిస్తోందో, అవన్నీ ప్రవచితంగా కాకుండా, అంతర్లీనమైఉన్న ధ్వనిగా ఆమెకు గోచరించాయి.

కళ్ళు చెమరిమొగం ప్రక్కకు తిప్పుకొంది. కాని అతని ఉత్సాహానికి అకస్మాత్తుగా భంగం కలిగించాలని లేదు. కల్గించి తను చెప్పగల్గిందేమీ లేదు.

"ఏం! ప్రభా! చేరటం ఇష్టంలేదా?"

"అబ్బె! చేరు! అందుకు కాదు" - మొగం ప్రఫుల్లం మొనర్చుకొని అతన్ని మైమరపించగల్గింది. కాని ఆమెకు అసంతృప్తి కల్గిందన్న విధానంలో మాత్రమే ఊహించగల్గాడు.

భోజనానికి లేచాడు. "శీను భోంచేయడా!" అని అడిగాడు. శీను మాట్లాడేలోపలే ఆమె అందుకొంది. "అన్నీ తిరిగి వచ్చేటప్పటికి ఆలస్య మౌతుందని నేనే అతన్ని హోటల్లో భోంచేయమని బలవంతపెట్టాను" అంది.

రాఘవరావుకు ఒకవిధమైన చిరాకూ, కోపమే వచ్చాయి. కాని సంబాళించుకొంటున్నాడు.

ఆమె ఎన్నడూ లేనంత ఉత్సాహమూ, సంతోషమూ ప్రకటిస్తోంది. అతను కూడా ఇట్టే తేరుకొని అన్నీ మరచిపోయి మళ్లీ శాంతంగా ఉండగల్గుతున్నాడు. ఆ పగలంతా శీనుతోనూ, రాఘవరావుతోనూ అతిసంతోషంగానే కబుర్లు చెపుతూంది. రాఘవరావుకు ఆ సంతోషం చూస్తే, ఒక్కక్షణం ఏదో వింతగా గుబులు వచ్చినట్లు మనస్సులో భయం కల్గింది. కానిఆమె ముఖంవంక చూస్తూంటే, నిత్యప్రసన్నత్వంతో నిత్యసంతోషిత్వంతో ఎప్పుడూ ఆమె అల్లాగా ఉంటున్నట్లుగా అనిపించి ఆ భయం అంతలోనే కరిగిపోయింది.

రాత్రి శీను మొరాయించి అక్కడే భోంచేశాడు. ఆ మొరాయింపు, ఆమెమనస్సుకు ఎంత శాంతం కూర్చిందో, రాఘవరావుకు అవగాహనమౌతూనే ఉంది. ఒక్క నిముషం అతను సంతోషంతో నిట్టూర్చాడు. శీను పెందలకడే నిద్రపోయాడు.

(20-వ పేజీ చూడుడు)

---

కాశ్మీరు సమస్యను పరిష్కరించవలెనను సవరణ ఉపసంహరించుకొనబడుట సమంజసముగనే యున్నది. భారత ప్రభుత్వము కాశ్మీరుప్రజల శ్రేయస్సే ప్రధానముగ నెంచి, తన నిర్ణీతవిధానమును అమలుజరుపుకొనిన, హైదరాబాద్, జునాఘడ్ సమస్యల వలెనే కాశ్మీరుసమస్యకూడ ఎవరి ప్రమేయములేక పరిష్కారమైపోగలదు.

కాశ్మీర ప్రజలు భారతప్రభుత్వమునందు సంపూర్ణవిశ్వాసమును ప్రకటించియున్నందున, తమ భవిష్యత్తు ఎట్లుండవలెనో విస్పష్టముగ తెలిసియున్నందున భారతప్రభుత్వము ఇంకమీదనైనను సమితి, సమాధాన సంఘము, పాకిస్తాన్‌లను, దృష్టియందుంచుకొనిగాక, కాశ్మీరుప్రజల యభిమతముప్రకారము వ్యవహరింపవలసియుండును. సమితి సామర్థ్యము వెల్లడియైనదిగనుక, భారతప్రభుత్వము తమ సిద్ధాంతములప్రకారమె ఈ సమస్యాపరిష్కారమునకు ఉపక్రమింపవలెను.

రామరాజ్యం:

# ప్రస్తుతసమస్యలకు గాంధీజీ పరిష్కారవిధానం

[గతసంచిక తరువాయి]

శ్రీ కె. సత్యనారాయణ

ఆరోగ్యసమస్య

ఎట్టి ప్రత్యేకపరిస్థితులు, శాస్త్రీయపద్ధతిని కర్మాగారాలు కట్టినా భారీయంత్రాగారాల్లో అందులోను ముఖ్యంగా కాయకష్టంచేసేవారుండే స్థలాలలో జనసమ్మర్దం, దుమ్ము, ప్రాణవాయువు తగినంత లేక బొగ్గుపులుసుగాలితోను ఇతర విషవాయువులతోను నిండిన గాలితోకూడి అనారోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతున్న విషయములు అందరికీ విదితమే. పెద్దపెద్ద ఫ్యాక్టరీలలో పనిచేసేవారి ఆరోగ్యము భంగమగుచున్న సంగతి కూడ వెల్లడియగుచున్నది. గృహపరిశ్రమల (వికేంద్ర పరిశ్రమలు) సందర్భములలో ఇట్టి అనారోగ్య పరిస్థితు లుండవు సరికదా, విశాలమైన బహిరంగప్రదేశాలు, కావలసినంత మంచిగాలి, నిర్మల వాతావరణాలు కలిగి ఆరోగ్యాన్ని వృద్ధిచేసే పరిస్థితులే ఉంటాయి. భారీయంత్రాలలోని పనివారల ఆరోగ్యంకొరకు ప్రత్యేక శ్రద్ధలు అవసరమవుతూ ఉంటాయి. ఇట్టి ఇబ్బందులు గ్రామపరిశ్రమలలో బహు తక్కువ.

అవసరం—ఉత్పత్తి

(*demand and production*)

ప్రకృతిలో అవసరం ఏర్పడిన తరువాత అందుకు అనువైన ఉత్పత్తి ప్రయత్నం జరుగుతుంది. ఇది సహజమైన పద్ధతి. కొనుగోలుదారుడు తనకు అవసరం కలిగినపుడు, ఆ అవసరాన్ని, ఉత్పత్తిదారునికి తెలియచేస్తాడు. తన ఉద్దేశాలను, తన అభిరుచులను, తన ఆర్థికశక్తిని చెప్తాడు. వీటిని అనుసరించి, ఉత్పత్తిదారుడు వస్తువును తయారుచేసి ఇస్తాడు. తయారుచేసినవానికి, కొనుక్కున్నవానికి కూడా తృప్తికలుగుతుంది. ఒక చొక్కా కావాలంటే, సంసారి, తనకు నచ్చినగుడ్డను తీసికొని, దర్జీ దగ్గరకు పోయి తన కొలతను, తనకు ఇష్టమువచ్చిన రీతిని కుట్టించుకుంటాడు. అదే ఒక రెడిమేడ్ (***Readymade***) కొట్టులోకి వెళ్లి చొక్కా కావాలంటే కొన్ని వందలు నిర్లక్ష్యంగా ఎదుటికి విసరేస్తాడు — కొట్టులోని విక్రేత. ఇంకా తనవంటి కొనుగోలుదార్లు చాలామంది ఆ సమీపంలో, అదేస్థితిలో ఉంటారు. విక్రేతలుకూడా చాలామంది ఉంటారు. ఆ పడేసిన చొక్కాలలోది ఏఒకటీకూడా తన కొలతకుగాని, తన రుచికిగాని కుట్టబడ్డది కాదు. ఇవన్నీ ధరించి పరీక్షచేయడానికి వీలుగాని, అవకాశంగాని కనబడదు. ఒకటి తొడుక్కోగానే ఆ పక్కనే ఉన్న దలారీ: "ఎంతబాగుంది, సరిగ్గా మీకోసమే తయారయినట్లుంది" అంటూ శ్లాఘావాక్యాలు ప్రారంభిస్తాడు. అసలు అన్నిమూర్తులు చూచినపుడే సఖంపోయిన మతి ఈ నినాదాలతో పూర్తిగా పోయి, కాదంటే ప్రక్కవారు ఏమనుకుంటారోఅని సిగ్గుపడి, సరిపడినా సరిపడకపోయినా ఏదో ఒకటి కొని, తన శరీరానికి తగిన చొక్కాను కుట్టించుకోడానికి బదులుగా తాను కొన్న చొక్కాకు తన శరీరాన్ని సరిపెట్టుకొని, మనస్సును సమాధానపరచుకొని మరియ వలసివస్తుంది. అవసరానికి ముందు ఉత్పత్తిప్రకృతి విరుద్ధం. కాని కేంద్రపరిశ్రమలలో జరిగేది అదే.

"గృహం"

స్త్రీ, పురుషజాతుల సంబంధంలో ఇతర జంతువులు అనుసరించే విధానాన్ని మార్చి, మానవుడు ఒక మెట్టు పైకి లేచినట్లు భావిస్తున్నాడు. అట్టి ఔన్నత్యం వివాహసంబంధం వల్లనే నని నమ్ముతూవచ్చేడు. ఆ వివాహంవల్ల 'గృహం' ఒక కేంద్రం అయింది. మానవ సంఘజీవన విధానంలో. ఈ నాటి కేంద్రపరిశ్రమలలోని కార్మికవర్గంలో ఈ 'గృహం' విచ్ఛిన్నం అయిపోతూంది. వివాహసంబంధంలోని పవిత్రత — ప్రేమ, సంతానవాత్సల్యం ఇవన్నీ నశించి తిరిగి మునుపటి పశుత్వ సంబంధంలోకి — దిగిపోతూంది. భార్యాభర్తలిద్దరూ పరిశ్రమలలో కార్మికులే. సూర్యోదయంమొదలు సూర్యాస్తమయం వరకు వారిద్దరు చేరి ఒకచోట, చేరి ఒక సంపులోను కలిసి పనిచేస్తూఉంటారు. ఇంక వారి జీవితంలో అన్యోన్యసంబంధపు అవసరం లేదు. ఇద్దరు ఆర్జనాపరులే. ఒకరి ఆశ్రయంగాని, ఒకరి ఆధారంగాని ఇంకొకరికి అక్కరలేదు. కామతృష్ణ ఒకటి మిగిలిఉన్నది. అందుకుమాత్రం కొంతకాలం కలియవలసివస్తుంది. అది కూడా "తుపాను సమయంలో ఏదో ఒక రేవు" అనే స్థితికివచ్చి సాహచర్య (*Companionate marriages*) వివాహాలకు దారితీసింది. ఇదంతా 'స్త్రీ సమానత్వం' అనే శీర్షికతో ప్రచారంచేయబడుతుంది.

జాతిని పెంపొందించే ఉద్దేశంతో ప్రకృతి ఈ కామవాంఛను అన్ని జీవులలోను కలిగించింది. దీని ఫలితం సంతానం. కాని ఈనాడు అన్యోన్య ఆధారం, అవసరం లేని స్త్రీపురుష సమానత్వసంఘంలో ఈ'సమానత్వానికి' సంతానం ఒక ఆటంకం అవుతున్నదని సంతాననిరోధకసాధనాలు ప్రచారం చేయబడుతున్నాయి. ఇక "గృహం" అవసరం ఏమున్నది! పక్షులు సహితం గూళ్లుకట్టుకుంటాయి. మానవుడికి ఆ అవసరంకూడా లేక పోతున్నది. కామవాంఛ తీర్చుకోడానికి హోటలులోని గది అయినా చాలు "గృహం" యొక్క అవసరం లేదు.

అథవా, సంతానం కలిగినా ఆ సంతానాన్ని పోషించే సావకాశం లేదు. కర్మాగారంలో రోజలా తలితండ్రు లనిపించు కున్నవారు ప్రస్తుతూ ఏరాత్రికో పిల్లలు నిద్రపోయినప్పటికి వారు (అద్దైనా బుద్ధిపుడితే) ఇల్లు చేరుతూఉంటే, ఆ సంతానానికి, తలిదండ్రులకు మధ్య ప్రేమ సంబంధం ఏర్పడేదెప్పుడు? ఈ పిల్లను పోషించే భారం ఏ ఇతరసంస్థలకో ఇవ్వవలసివస్తున్నది. చివరికి పిల్లలకు తల్లులకు ఉండే సహజసంబంధంకూడా నశించిపోతూంది. మాతృప్రేమ ఎరగని అపిల్లలో ప్రేమతత్వం అబ్బక-కర్కశత్వం అలవడుతోంది. మానవత్వం నశించి కేవల మృగత్వం మిగులుతూఉంది.

గృహ (వికేంద్ర) పరిశ్రమలలో ఇట్టి 'గృహ' విచ్ఛిన్నం జరగదు సరేకదా, 'గృహ' సౌభాగ్యం, ప్రేమ మరింత పెంపొందుతాయి. కేవలం కామానికే కాక, జీవితంలో అన్ని విషయాలకు భార్యాభర్తలు అన్యోన్యం సహకరిస్తారు. గృహకార్యాలలో పురుషుడు తోడ్పడతాడు. పరిశ్రమలో స్త్రీ చేయూత నిస్తుంది. ఇద్దరికి పిల్లలు సహాయంచేస్తూ ఉంటారు. వారిలో ఎడబాటు సమయాలు చాలా తక్కువ. అన్యోన్యత, ప్రేమల సమతుణం పెంపొందుతూ "గృహం" అభివృద్ధి పొందుతూ ఉంటుంది. తల్లిప్రేమను అనుభవించిన పిల్లలు తల్లి సేవాతత్వాన్ని అనుభవించిన పిల్లలు, తమ జీవితంలో ఆప్రేమ, సేవాతత్వాలు అలవర్చుకోడానికి సాధ్యం అవుతుంది. అట్టి పిల్లలు మృగత్వంలోంచి మానవత్వంలోకి, ఇంకా దైవత్వంలోకి పైకి లేవడానికి వీలుంటుంది. ప్రేమ-సేవాతత్వాలే భారతభూమి, కొన్ని వేల సంవత్సరాలక్రిందటినుండి పాశ్చాత్య దేశాలకుఅందచేస్తూ వచ్చిన అమూల్యసందేశాలు. వాటి స్థానే వ్యాపారతత్వం దానిని అనుసరించే వ్యక్తితత్వం దిగుమతి అయినందుకల్లనే ఈ నాటి భారతీయ దుస్థితి యేర్పడింది.

భౌగోళిక పరిస్థితులు

ఇంగ్లండులో పండించగల పంట ఆ దేశంలోని ప్రజలు తినడానికి పద్దెనిమిది రోజులకు మాత్రం సరిపోతుందని శాస్త్రజ్ఞులు లెక్కలు తేల్చేరు. మిగతా 347 రోజులూ తమ తిండికోసం వీరు ఇతరులపై ఆధారపడనైనా పడాలి, లేదా తిండిలేక చావాలి. ఆ దేశంలో ఎక్కువగా లభించేవి నేలబొగ్గు, ఇనుమే. ఈ రెండింటిని ఉపయోగించి పరిశ్రమలు నెలకొల్పి, వస్తువులను, తయారుచేసి అమ్ముకుంటేగాని వీరికి తిండిలేదు కనుక ఆ దేశం కేవలం పరిశ్రమలదేశం కావలసివచ్చింది. ఇంగ్లాండులో తయారవుతున్న ఉక్కు చలామణి కావడంకొరకే మన దేశంలో రైళ్లు వేయాలని తూర్పువర్తకసంఘం నిర్ణయించింది. దీనితోపాటు ఇంకో ప్రయోజనంకూడా వారికి కనబడ్డది. ఈ రైళ్లవల్ల తమ ఉత్పత్తికి అవసరమయే ముడిపదార్థాలను తమ దేశానికి చేరవేసుకోడానికికూడా అనుకూలం ఏర్పడ్డది. ఇదంతా మనలను "నాగరకులను" చేయడానికి ప్రయత్నమని మనలకు నమ్మకం పుట్టేటట్టు విద్యావిధానం సవరించి, అధికంగా భోగ్యవస్తువులు కలిగిఉండడమే నాగరికలక్షణం అనే భావం మన నెత్తుటిలోకి, ఎముకల్లోకి కూడా దూర్చి, పరిశ్రమలను ఇక్కడ నశింపజేసి శారీరక, మానసికదాస్యంలో మనలనుంచి, కేవలం కొనుగోలుదార్లుగా మనలను వినియోగించుకొని తమ ఆహారకొరత తీర్చుకుంటూ వచ్చేది బ్రిటిషు రాజతంత్రవిధానం. వారు పోయినా వారు నాటిన భావాలు ఇంకా మన మనస్సులలోనుంచి పోలేదు, పోవడానికి కొంత కాలం పడుతుంది. మోటారుకారు పోయినా ధూళి ఇంకా కొంతసేపటిదాకా మనలను ఆవరించుకునే ఉంటుంది. కనుక ఎక్కువగా భోగవస్తువులు కలిగిఉండడమే నాగరిక చిహ్నమని, వాంఛలను తగ్గించుకోవడం నాగరికతలో వెనక్కిపోవడం అనే భావాలు పెద్దపెద్ద చదువులు చదువుకున్నవారిలోను, వారిని అనుకరిస్తూన్న చదువు లేనివారిలోనుకూడా ఇంకా ఇల్లు కట్టుకొని నివాసంచేస్తూ వారి మనస్సులమీద అధికారం చలాయిస్తున్నాయి.

మతకలహాలవల్ల ఇంగ్లాండులో నిలవలేక అమెరికాకు వలసపోయినవారికి అనంతమైన ప్రదేశాలు, బీడులు దొరికేయి. జనమేమో కొద్ది. స్థలమేమో బహుళం — అబీడులను స్వాధీనంలోకి తేవడానికి తమకున్న మానవశక్తి ఏమాత్రం సరిపోలేదు. స్వప్రయోజనమే ప్రధానలక్ష్యంగా కల వీరికి, ఇతరులను కలుపుకోడానికిగాని, వీలయినంతమాత్రమే స్వాధీనపరచుకొని తృప్తిపడడానికిగాని ఇష్టం లేదు. కనుక వారు యంత్రసాహాయం కల్పించుకోవలసిన అవసరం కలిగింది. వారిజీవితమే యంత్రజీవితం అయిపోయింది.

కాని పాశ్చాత్య ప్రపంచం ఇంకా పాతశిలాయుగదశకైనా చేరక పూర్వమే భారతదేశంలో వ్యవసాయనాగరికత అత్యున్నతస్థానం పొందింది. ఇక్కడ ఉండే, సూర్యరశ్మి వాతావరణస్థితి, మహానదులు సారవంతమైన లోయలు, అనుకూలమైన వర్షాలు ఋతువులు, వ్యవసాయానికి వీలయిన పరిస్థితులు కలిగించేయి. ఆహారానికి కొరత లేదు. కావలసినంత పండుతుంది. (అప్పటి జనసంఖ్యకు ఏటాసరిపోయింది. పైగా అమ్మకపు పంటలు ఆనాడు లేవు) పండినదానితో వారు తృప్తిపడ్డారు. కడుపునిండా కూడు, సరిపడే బట్ట ఉంటే చాలనుకున్నారు. ఈ రెండుజీవితావసరాలు సమకూడిన పైని తమ జీవితం పరశ్రేయదృష్టితో గడిపేరు. జనసంపద, పశుసంపద సమృద్ధిగా ఉన్నది. ఉన్నదాన్ని వినియోగించేరు. ఎవరికి కొరతలేకుండా కాలం గడిపేరు. యంత్రాల అవసరం వారికి లేకపోయింది.

మానవశక్తి—పశుశక్తి

ఈనాడు భారతదేశంలో 40 కోట్లజనం 7 కోట్లపశువులు ఈ రెండుశక్తులను ముందు పూర్తిగా వినియోగించుకోకుండా యంత్రశక్తికొరకు ప్రాకులాడడం అంత మంచిపని కాదు. ఈశక్తులకు మించిన కార్యాలకు యంత్రం సాయం తప్పక అవసరం. ఇచటి, పరిస్థితులు ఆలోచనలోకి తీసికోకుండా పొరగింటి ఆవిడ సరిగ పెట్టుకుంటే ఇంటిఆవిడ ఉరిపెట్టుకున్నట్లు "ఇతర దేశాలలో భారీపరిశ్రమలు నెలకొల్పేరు గనుక మనంకూడా నెలకొల్పాలి. లేకపోతే మనలో నాగరికత లేదు పురోభివృద్ధిలేదు" అని తలచడం సమంజసం కాదు.

విశ్రాంతి

ఈ సందర్భంలో సామ్యవాదులు నమ్ముతూ ప్రచారం చేస్తూన్న సిద్ధాంతాలని కొంత పరిశీలించాలి. వీరి దృష్టిలోకూడా అధిక భోగవస్తు సముదాయం కలిగి ఉండడమే నాగరికలక్షణం. భారీపరిశ్రమలలోని లోపాలను సవరించడానికి వారి ప్రణాళిక ఇది: "భారీపరిశ్రమలు నెలకొల్పాలి, ఇవి జాతీయం కావాలి. అప్పుడు ఉత్పత్తి అధికం అవుతుంది. లాభం అంతా ప్రభుత్వానికే — అంటే ప్రజలకే — ఉంటుంది. కనుక ధనవంతుల పీడ తీరుతుంది. మన సరకులను మనకు అవసరం అయినంతవరకే ఉత్పత్తి చేయాలి. అధికంగా ఉత్పత్తిచేసి పై బజారుల కోసం పాకులాడవలసిన అవసరం ఉండదు. అలా అయితే ప్రజలకు వస్తుసమృద్ధితోపాటు విరామకాలం హెచ్చుగా దొరుకుతుంది. మన పురాతన, అనాగరిక, భైతుక పరిస్థితులు విడిచి, ఇతరదేశాలలో వలె మనం 'నాగరిక'తా ప్రపంచంలో తలెత్తుకొని తిరగగలం."

భారీపరిశ్రమలు పెట్టి ఉత్పత్తిసరకుల సంఖ్య తగ్గిస్తే ఆ సంస్థ ఆర్థికంగా లాభదాయకం కాదని ఇంతకుముందు నిరూపించబడ్డది. కనుక ఆ నష్టాన్ని భర్తీ చెయ్యడంకోసం ప్రభుత్వం అధికపన్నులు వెయ్యాలి. కొద్దిగా ఉత్పత్తిఅయే సరకుల ధర హెచ్చుగా ఉంటే తీరుతుంది. ఇవి పొందడానికి హెచ్చు వేతనాలివ్వాలి. హెచ్చువేతనాలకోసం హెచ్చు పన్నులు వెయ్యాలి. ఇలా ప్రభుత్వం, ప్రజలూ కూడా విషచక్రంలో గిరగిర తిరుగుతూ ఉండాలి. ఇది నిజమైన సౌఖ్యం కాదు; భ్రమ. అమ్మటకు సంతకు తోలేముందు బర్రెలకు పొంగ పెట్టి పూరింపజేసి బజారులో చూపే మాదిరిది.

ఇక అధికవిశ్రాంతి అనే పదం ఒకటి చాలా ఆకర్షణీయంగా ఉంటూంది. మానవుడు ఏపనీ చేయకుండా ఊరికే ఉండలేడు. ఏదోఒకపని చెయ్యాలి. కొందరి భావంలో క్లబ్బులలో చేరి డబ్బువేసి చీటాడడం "విశ్రాంతి" దీనిని నిజమైన పేరుతో చెప్పాలంటే "జూదం ఆడడం" క్లబ్బులలో ఆడినా జూదం జూదమే. ఇంకొకటి కాలేదు. అది గౌరవంగా భావించబడుతూంది. ఈనాటి సంఘంలో ఈజాతిలోనివే గుఱ్ఱపు పందేలు. ఇదేనా ఆశపెడుతున్న విశ్రాంతి? మానవుని ప్రవృత్తిలో రెండే లక్షణా లున్నాయి. ఉత్పత్తైనా చెయ్యాలి. లేదా విధ్వంసం అయినా చెయ్యాలి. తటస్థప్రవృత్తి మానవునికి అసాధ్యం. అథవా అతి కష్టసాధ్యం. "పనిలేనివాని మెదడులో పిశాచాలు నాట్యం చేస్తాయి" మానవుని కాలం ప్రజోపయోగమైనకార్యాలలో వినియోగించలేకపోతే, అవినీతికరమైన మార్గాలు పడుతుంది. తగవులు, వ్యాజ్యాలు జూదాలు నేరాలు, కోర్టులు- శిక్షలు ఇలా ఇలా పెడదారులు తొక్కుతుంది.

పెట్టుబడిదారీవిధానానికి ఇవన్నీ అవసరమే. ఇలాంటివారు కొందరుంటేనే, ప్లీడర్లు, వర్తకులు, ఉద్యోగులు, వారి నెత్తురుపీల్చి, ఉత్పత్తిచేయక బదనికకై, బిలియర్డ్సు గదులలోను, టెన్నిసు కోర్టులలోను, మేజాపేకాటలలోను, కాలం వెళ్లబుచ్చగలుగుతారు.

(22-వ పేజీ చూడుడు)

# రూపాయి విదేశవిలువ తగ్గింపు

శ్రీ నందివాడ కృష్ణమూర్తి

గత 18 సంవత్సరములలోనూ ఇంగ్లండు తన పౌండు విలువను రెండుమారులు తగ్గించింది. ఈసారి తగ్గుదల రేటు ప్రపంచంలోని ఆర్థిక కేంద్రాలన్నిటినీ హడలుగొట్టింది. ఆర్థిక ప్రపంచానికి అమెరికా సామ్రాట్టుగానూ, ద్రవ్య ప్రపంచానికి డాలరు అధినేతగాను ప్రపంచమంతా అంగీకరించింది. అనేక సంవత్సరాల నుండి గర్వంతో నిలబెట్టుకున్న ఆర్థిక ఆధిపత్యాన్నీ విధంగా బ్రిటన్ పోగొట్టుకోవడానికి కారణమేమిటని అడుగవలసిఉంటుంది.

ఇంగ్లాండు తన కరెన్సీవిలువను రెండు మారులు తగ్గించుకుంది. మొదటిసారి 1931 లో ఈ చర్య తీసుకోడానికి 1914-18 యుద్ధమువలన కలిగిన నష్టాలే కారణమన్నారు. మళ్లా ఇప్పటి తగ్గింపులకు కూడ మహా సంగ్రామమే కారణమయింది.

రెండవ మహా సంగ్రామంతో బ్రిటన్ పూర్తిగా కుంటుపడింది. ఉత్పత్తిసాధనాలన్నీ వెనుకబడ్డాయి.

ఉత్పత్తులు కూడ అందువలన తగ్గిపోయాయి. కొని వస్తువుల కొరకు ఆతృత ఎక్కువైంది. తత్కారణంగా బ్రిటన్‌లో అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయాయి. దీనికి తోడు అత్యవసరములైన చాలా వస్తువుల దిగుమతికై ఇంగ్లాండు అమెరికాపై ఆధారపడవలసి వచ్చింది. కాని ఆ వస్తువులను దిగుమతి చేసుకొంటే, వాని కగు ఖర్చులు మరల మన వస్తువులను వారి కెగుమతి చేసియో లేక మనవద్దనున్న డాలరు నిల్వల ద్వారానో తీర్చుకొనవలసి ఉంటుంది. కాని ఉత్పత్తులు ముందుగనే పడిపోవుటచే దిగుమతులకు తగిన ఎగుమతులు పంపుటకు వీలులేకపోయినది. ఎగుమతులు లేనిచో డాలర్లు సంపాదించుటకు వీలులేదు. ఒక ప్రక్క ఉత్పత్తు లధికము చేసికొనలేక, రెండవ ప్రక్క దిగుమతులకు కావలసిన డాలర్లులేక ఇంగ్లాండు చాల క్లిష్ట పరిస్థితులలో చిక్కుకొనినది.

దీనికి తోడు యుద్ధకాలమందు మనకు అప్పపడిన స్టర్లింగ్ నిల్వల దీర్చుకొనవలసి వచ్చింది. అందులో కొన్నిటిని డాలర్లరూపమునగూడ విడుదలచేయవలసి వచ్చింది. ఇది వారికి మరియొకసమస్యగా పరిణమించినది. ఇవన్నియు గాక రష్యాప్రాబల్యంలోంచి పశ్చిమయూరపు రాజ్యాలను రక్షించుకోడం కొరకై మరికొంత ఖర్చు చేయవలసివచ్చింది. వీటన్నిటికి తగిన ఆదాయాల్లుమాత్రము స్వదేశములో పెంపొందక పోవుటయేగాక వస్తువులధరలు మిన్నుముట్టుచున్నవి. ఇదివరకే తగ్గించబడ్డ జీవితప్రమాణము లింక తగ్గించుటకు వీలులేదు.

ఇట్టి పరిస్థితులలో ఇంగ్లాండు 1946 లో అమెరికానుండి ఒక అప్పు సంపాదించియుండెను. మరల గతసంవత్సరములో మార్షల్ ప్రణాళికవల్ల గూడ విశేషలాభము పొందగలిగెను వాని షరతులవల్ల కొన్ని ఇబ్బందులుగూడ పడవలసివచ్చెను. ఈగ్రాంటువల్ల మనకు సమకూడిన డాలర్ నిల్వలను బ్రిటన్ స్వయంపోషకానికి, స్వదేశాభివృద్ధికే వాడుకోవాలిగాని, ఇతరదేశాలతో తమకున్న అప్పులు దీర్చుకొనుటకు వాడకూడదనే నిషేధాజ్ఞలు ఇంగ్లాండుకు తీరని సమస్యలు కలిగించాయి. దీనికి తోడు స్పెక్యులేషన్ అధికమైంది.

అలాంటిపరిస్థితులలో ఏదేశపు వ్యాపారమైనను దెబ్బతినక మానదు. బ్రిటన్‌కు అమెరికాతోనూ, ఇతర దేశాలతోనూ, విశేషముగు ప్రతికూల వ్యాపారశేషము లేర్పడ్డాయి. అవి అట్లు పెరుగుతూవచ్చినా, వాటిని ఆపుదల చేయక పోయినా దేశమున కనర్థమే అగును. ప్రతికూల వ్యాపారశేషాలు లేకుండా చేసికొనవలెననిన అనుకూలమగు పరిస్థితులను ఏర్పాటుచేసికోవాలి.

దిగుమతులకన్న ఎగుమతులు వెనుకబడినప్పుడే ప్రతికూలపరిస్థితు లేర్పడును కనక మున్ముందు ఎగుమతుల నభివృద్ధిచేసికొనవలసి వచ్చింది ఇంగ్లాండుకు.

కాని ఈ మార్పు తీసికొనివచ్చుట అంత సులభం కాదు. ఆదిలో ఇంగ్లాండువస్తువులు అమెరికా వాసులకు లాభదాయకముగా ఉండునట్లు చెయ్యాలి. అంటే ఇతరదేశాలలోకన్న ఇంగ్లాండులో ధరలు తక్కువగా ఉండాలన్నమాట. అప్పుడుగాని అమెరికా పెట్టుబడిదారులకు బ్రిటిష్ వస్తువులు లాభదాయకం కాజాలవు. ఈ పరిస్థితులకొరకే ఇంగ్లాండు తన పౌండు యొక్క విదేశవిలువ తగ్గించివేసింది. అంటే ఇదివరకుకన్న ఇప్పుడు డాలరుకు ఎక్కువగా బ్రిటిష్ వస్తువులు రాగలవన్నమాట. డాలరు కిదివరకుకన్న ఎక్కువ పౌను లివ్వవలసిఉంటుంది. మొన్నటివరకు ఒక డాలరుకు 280 పౌనులు లభ్యమయ్యేవి. కాని నేటినుండి 1 డాలరు 4.03 పౌనులకు సమానమన్నమాట. అంటే పౌను విలువ నాటికి 30.5 వంతులు తగ్గింపబడినదన్నమాట.

ఈ విలువల మార్పు విదేశీయులకేకాని స్వదేశీయులకు లభించదు. విలువ తగ్గింపబడుటచే ఇంగ్లీషు సరకులు విదేశీయులకు చవుక కాగలవు. కాని స్వదేశీయులకు ఖరీదు కావలసియుండును. అందువలననే కొందరు అభిజ్ఞులు ప్రభుత్వము తన చర్యద్వారా పౌండువిలువ మార్చుట అసహజమనియు, మార్కెట్ బలాలకే వదిలివేస్తే పౌను తన విలువ తనంతట తానే పొందగలదని వాదించుచున్నారు. (*Leave the Pound to find its own level*) వీరి వాదనకు కారణము లేకపోలేదు. ఇట్లు ప్రభుత్వము తమంతటతామే విలువ తగ్గించినచో స్వదేశంలోని ధరలు, అధికమగుననియు, అందువలన పాటకజనుల కీయవలసిన వేతనము లధికము చేయవలసియుండుననియు, తత్కారణముగా ఉత్పత్తిఖర్చు లధికమగుటచే ఉత్పత్తులుగూడ పడిపోవుననియు అట్లు జరిగినచో ఎగుమతులకు చాలినట్లు ఉత్పత్తులు పెరుగకపోవుటచే ప్రభుత్వము మరల పౌనువిలువను కొంచెము తగ్గించవలసియుండుననియు, ఈ క్రమమున కంతుండదనియు భయపడుచున్నారు.

కాని పౌండును మార్కెట్టు బలాలకు వదలి తన విలువ తానే నిర్ధారణచేసికొనేటట్టు చేయడం చాలా హానికరమైన పద్ధతి. అదిగాక గత రెండు సంగ్రామములకు మధ్యకాలములో నిర్ధారణమైన ఎక్స్చేంజి (*exchange rate*) రేట్లు లేకపోవుటచే కలిగిన నష్ట మింతింత గాదు. ఈ పద్ధతిని దైనికజీవితంలో పాటించడానికి కష్టము. అట్టి పద్ధతి అవలంబిస్తే చాలా అసాధారణ పరిస్థితు లేర్పడుటయేగాక అంతర్జాతీయ వ్యాపారముగూడ దెబ్బ తినగలదు. నిర్ధారణమగు రేట్లు లేకపోవుటచే పాటకజనం, ఎగుమతులకై పనిచేయు పరిశ్రమలకు, ఇతర పరిశ్రమలకు మధ్య తిరుగాడుచుండుటచే తీరని నష్టము రాగలదు. తుదకు విశేషమగు నిరుద్యోగసమస్యకు కూడ దారితీయగలదు. అదిగాక, ఈ పద్ధతులవల్ల వ్యక్తి రేక శేషములను మార్చుకొనుటకు వీలుండదు. సహజమార్గముల ననుసరించి జరుగుచున్న ఇట్టి వ్యాపారములు స్పెక్యులేటివ్ మూలధన ప్రవాహములవల్ల దెబ్బ తినగలవు. దీనికి తార్కాణంగా 1924-26 ఫ్రెంచి ఫ్రాంకు చరిత్రను తీసికొనవచ్చును. తమంతట తాముగా వదలివేయబడక ఒక నిశ్చితమైన రేటుప్రకారమే విలువలు మార్చుటవలన అనేకములగు లాభములు కలుగగలవు. స్వదేశంలోను, అంతర్జాతీయ పరిస్థితులలోను అనుకూలపరిస్థితు లేర్పాటు కావలెనన్నచో నిశ్చితమైన ఎక్స్చేంజిరేట్లవసరము. అందువలననే 1931 లోను ఇప్పుడుగూడ బ్రిటిష్ పౌండువిలువ తగ్గింపబడినది. దీని విలువ ముందుగా స్వదేశవస్తువుల ధరలు తగ్గుటచే, విదేశీయులకు లాభకారి యగుటచే ఇదివరకు కన్న మన ఎగుమతు లధికమవగలవు. అనగా తమ కరెన్సీవిలువ తగ్గింపబడిన దేశాలకు ఇదివరకు కన్న డాలర్లు లభ్యమవగలవు. హార్డు కరెన్సీప్రాంతాలనుండి సాధ్యమైనంతవరకు దిగుమతుల నాపుచేసి కొనుటచే డాలర్ నిల్వల మరింత ఖర్చు కాకుండ రక్షించుకొనవచ్చును. ఈ పద్ధతివలన ఇదివరకు పెరిగియున్న ప్రతికూలశేషాలను చాలవరకు తగ్గించుకొనవచ్చును.

ఇంగ్లాండునకు ఈ చర్య లాభకారి కాగలదు. ఈ లాభములు కాలము గడచినకొద్దీ తగ్గిపోయినను, ప్రస్తుత పరిస్థితులలో మాత్రము చాల సదుపాయకరముగా నుండును. బ్రిటన్ స్టర్లింగు ప్రాంతాలకు ముఖ్యదేశం. స్టర్లింగ్ దేశాలన్నిటితో బ్రిటన్‌కు ముఖ్యమగు వ్యాపారసంబంధాలు ఏర్పాటయిఉన్నాయి. అందుచేతనే బ్రిటన్ తోబాటు స్టర్లింగ్ ప్రాంతాలన్నీ తమ కరెన్సీల విదేశీయవిలువలు తగ్గించుకొనవలసి వచ్చింది.

పాకీస్తాను తప్ప కామన్‌వెల్తురాజ్యాలన్నీ బ్రిటన్‌తో సమానంగా తమతమ కరెన్సీల విదేశ విలువలుగూడ తగ్గించుకొన్నాయి. ఈ విధంగా విదేశాలు తమతమ కరెన్సీల విలువలు తగ్గించుకున్నాక ఏర్పడిన ఎక్స్చేంజిరేట్ల నీ దిగువ గమనించవచ్చును.

| వివిధదేశాలు | పాతరేటు | కొత్తరేటు |
|---|---|---|
| బ్రిటన్ (పౌండుకు డాలరుకు) | 4.03 | 2.80 |
| ఇండియా (పౌండుకు రూపాయకు) | 4.76 | 3.309 |
| బర్మా | 4.76 | 3.309 |
| న్యూజిలండు | 4.03 | 2.80 |
| ఐర్ | 4 03 | 2 80 |
| ఇస్రెయిల్ | 4.03 | 2 80 |
| ఉత్తర ఆఫ్రికా | 4 03 | 2.80 |
| ఆస్ట్రేలియా | 3.22 | 2.24 |
| ఈజిప్టు | 4.05 | 2 87 |
| నార్వే | 7.94 | 4.96 |
| డెన్‌మార్కు | 6.92 | 4 81 |

కామన్‌వెల్తు సభ్యురాలైనందుకు భారతదేశం తనకరెన్సీ విలువగూడ తగ్గించుకోక తప్పింది కాదంటున్నారు మన ఆర్థికమంత్రి. ఎందుకంటే ముందుగా మన ఎగుమతులన్నీ ముఖ్యంగా స్టర్లింగుప్రాంతాలకు సాఫ్ట్‌కరెన్సీ దేశాలకే పంపబడుతున్నాయి. కాబట్టి ఆదేశాలన్నీ తమతమ కరెన్సీ విలువలు తగ్గించుకొన్నప్పుడు ఒక్క ఇండియామాత్రము తగ్గించుకొనక పోతే తాత్కాలికంగా లాభం పొందగలిగినా కాలాంతరమున నష్టం రాకమానదు. అందుచేతనే భారతదేశం గూడ ఈచర్య తీసికొనక తప్పింది గాదు. కాని ఈచర్యవలన లాభనష్టములు గ్రహించుటకుముందు ప్రస్తుతపరిస్థితి నొక్కసారి అవగాహనచేసికొనుట అవసరం.

రెండవ సంగ్రామము తర్వాత హిందూదేశం చాల గడ్డుదినాల్లోపడిపోయింది. శతాబ్దాలనించీ ఉత్పత్తిసాధనా లభివృద్ధి చేయబడియుండలేదు. వానివిషయంలో నవీన నాగరికప్రపంచానికి తెలిసిన విషయా లింకా భారతదేశాని కందుబాటులో లేవు. దానికి తోడు నేటి ఆహార సమస్య - ఈవిధమైన క్లిష్టసమయంలో మిన్నుముట్టుతున్న ధరలు, ఉత్పత్తి నిరోధకశక్తుల నరికట్టవలసిన అవసరం, క్షణక్షణం క్షీణించుచున్న జీవితప్రమాణాల నుద్ధరించు ఆవశ్యకత, విషజీవివలె అంతులేకుండా పెరిగిపోతోన్న ద్రవ్యోల్బణం, - వీటినుండి దేశాన్ని రక్షించవలసి ఉంటుంది. ఆహారసమస్యను తీర్చుటానికై బహుప్రయోజనకారులగు నదీ ప్రాజక్టులు కట్టవలసిఉండును. పరిశ్రమ లభివృద్ధిపొందాలన్నా, ఉత్పత్తు లభివృద్ధి కావాలన్నా విశేషముగా యంత్రసామగ్రి కావలసిఉంటుంది. పెద్దపెద్ద మెషీనులు, వ్యవసాయపు సాధనాలు, ట్రాక్టర్లు, కొన్ని ముఖ్యమగు ఆరోగ్యసాధనాలు మొదలగునవి ఎన్నో మనం అమెరికానుండి దిగుమతిచేసికొనవలసిఉంది. కాని దానికి కావలసిన ఎగుమతులు మనదేశం పంపలేకపోతోంది. వేరు డాలర్లు సంపాదించలేకపోయింది. అందుచే దేశాభివృద్ధికరమగు కార్యములన్నియు వెనుకబడవలసివచ్చింది. ద్రవ్యోల్బణము నరికట్టుటకు వీలు లేకపోయింది.

ఈ పరిస్థితులలో భారతదేశం కూడ తన కరెన్సీల విలువ తగ్గిస్తే దేశానికి లాభమా నష్టమా అన్న ప్రశ్న రాకమానదు. ఈ విషయంలో మన దేశంలోని ఆర్థికవేత్తల అభిప్రాయాలు భేదించి ఉన్నాయికాని చాలమంది లాభకారిగానే ఎంచుతున్నారు. కాని ఎట్టి లాభాలయినా మన ఎగుమతులపై ఆధారపడిఉంటాయి. మన కరెన్సీ విలువ తగ్గింపబడుటచే బ్రిటన్‌లోవలెనే మన దేశంలోకూడ విదేశీయులకు చవుక అగుటచే అమెరికా మన వస్తువుల నెక్కువగా కొనవచ్చును. అందువల్ల మనదేశపు డాలర్ నిల్వ లధికము కావచ్చును. ప్రకృతిసౌందర్యానికి పుట్టినిల్లయిన భారతదేశమును చూడడానికి వచ్చు అమెరికను టూరిష్టులవికూడ మరికొన్ని డాలర్లు దేశానికి చెందగలవు. ఈ విధంగా చేకూరే డాలర్లకన్న, మరికొన్ని పద్ధతుల నవలంబించికూడ భారతదేశం తన డాలర్లు ఖర్చు తగ్గించుకోవాలి.

అత్యవసరం అయినా వేరొక గత్యంతరం లేకపోయినా, భారతదేశం తక్షణమే అమెరికా మొదలగు హార్డుకరెన్సీప్రాంతాలనుండి ఇదివరకు దిగుమతిచేసికొనుచున్న ఆహారదినుసుల నాపుచేసికోవాలి. వీలయినంతవరకు స్వదేశాన్నే స్వయంపోషకంగా చేసికోడానికి ప్రయత్నించాలి. తప్పనిసరయితే సాధ్యమైనంతవరకు స్టర్లింగు ప్రాంతాలనుండే దిగుమతి చేసికోవాలి. అత్యవసరమైన సామగ్రులను తప్ప అమెరికానుండి దిగు

(20 వ పేజీ చూడుడు)

# మహాత్ముని తత్వము

శ్రీ వెలిదండ శ్రీనివాసరావు

మహాత్ముని తత్వము మరియొకటి గాక యార్య ఋషు లనేక వేలయేండ్లక్రిందట బోధించిన వాటినే, కాలప్రభావమున మరచిపోయిన మానవులకు మరల జ్ఞాపకపరచుట యే. ఆయం దెక్కువగా ఒత్తిచెప్పుచుండిన, సత్య, అహింసలు 'సత్యమేవజయతే' అహింసాపరమోధర్మః' యను పురాతనవాక్యములనుబట్టి సనాతన శాశ్వతధర్మము లని బోధపడును. అట్టి శాశ్వత ధర్మములగు సత్య, అహింసలయొక్క యౌన్నత్యమును ప్రత్యేకమానవచర్యలవలన బోధించి, చూపరులను హర్షపులకాంకితులుగ జేసి, వారి సహజయనుకరణగుణమునకు సరియైన దారిని జూపు హరిశ్చంద్ర, ప్రహ్లాదనాటకములను మహాత్ముడు బాల్యమున వీక్షించినప్పుడే నాట బడిన యా శాశ్వతధర్మబీజములు యాయనపావన జీవితమునందు మొలకలెత్తి, క్రమేణ గొప్ప వృక్షములై, తన శాఖలు నలుదెసల విశాలముగా వ్యాపింపగలిగెను. ఆ శాఖల నీడల నను భవించువారి జీవితములు కడుధన్యములు.

2. సర్వాంతర్యామియైన భగవంతుని, మహాత్ముడు—

"అహింసా ప్రథమం పుష్పం,
పుష్ప మింద్రియనిగ్రహః
సర్వభూతదయా పుష్పం,
క్షమాపుష్పం విశేషతః,
శాంతిపుష్పం, తపఃపుష్పం,
ధ్యానపుష్పం తథైవచ,
సత్యమష్టవిధం పుష్పం,
విష్ణోః ప్రీతికరం భవేత్."

అను మన పూర్వుల యాదేశము ననుసరించి, యీ యష్టవిధపుష్పములతోనే, సర్వకాలసర్వావస్థలయందును యారాధించుచుండెడివాడు.

3. కాలగతినిబట్టి సనాతనధర్మములు నశించి నపుడెల్ల భగవంతుడు మానవుల నుద్ధరించుటకై వారిలో నొకడుగానే పుట్టి, మానవస్వభావమున కనుగుణముగనే ప్రవర్తించి, తోడి మానవులకు తన ప్రవర్తనలవలనను, బోధనలవలనను, మార్గదర్శకుడై చరించుచు నన్న దృఢవిశ్వాసము హిందువులలో నుండుటచే, నటు లవతరించిన మహానుభావులగు శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీబుద్ధత్రయము, భగవంతుని దశావతారములలో జేర్చబడెను. అయినను ఆ మువ్వురియెడల భక్తివిశ్వాసములుగల సవిమర్శకులు కొందరు ఆ ముగ్గురి చరిత్రలలోను ఆయా చరిత్రకారులు ఒక్కొక్క లోపమును చిత్రించిరని కనుగొనిరి. ఆ లోపములు; శ్రీరాముని చరిత్రలో, ఆయన చెట్టుచాటున నుండి వాలిని గూలనేయుట; శ్రీకృష్ణుని చరిత్రలో, ఆయన ధర్మరాజుకు ప్రాణరక్షణసమయమున అసత్యవచనదోషము లేదు అని చెప్పుట; శ్రీ బుద్ధుని చరిత్రలో ఆయన సృష్టికర్తయగు భగవంతునిగురించి యేమియు బోధించకుండుట. మహాత్ముడు బోధించిన, చాతుస్సమరనిరసన, అసత్యసర్వకాలదూషణ, నిరంతరభగవత్ప్రార్థనలు, ఆ మువ్వురి చరిత్రలలో జేర్చబడిన మూడు లోపములను సవరించుటయే యని కొందరు విజ్ఞుల యభిప్రాయము. మహాత్ముడు ఆ మువ్వురి యవతారముల బోధనలనే తిరుగ బోధించుట చేతను, వాటికితోడు, తన ప్రవర్తనచేగూడ నా మూడు లోపములనుసైతము దీర్చుటచేతను, ఆయనను ఇప్పటికి సంపూర్ణావతార మని చెప్పవచ్చును.

4. మరియు, తైత్తిరీయోపనిషత్తులో జెప్పినట్లు,—


"యతోవా ఇమాని భూతాని జాయన్తే,
యేన జాతాని జీవన్తి
యత్ ప్రయంతి, అభిసంవిశన్తి
తద్విజిజ్ఞాసస్వ. తద్బ్రహ్మ."

అనగా, సర్వభూతములతోబాటు మానవుడు బ్రహ్మనుండి వెడలి, బ్రహ్మలోనే జీవించి, తుదకు బ్రహ్మలోనే చేరుటయే మానవపరమావధి యగుటచే, అట్టి మానవజాత్యభివృద్ధికై, అప్పుడప్పుడు మానవచరిత్రయందు నూతనశకములను స్థాపించుటకు సృష్టికర్త పవిత్రమానవశరీరముల గుండా స్ఫుటముగా వ్యక్తీకరించుకొని, నూతన సందేశముల నిచ్చును. మానవుని పాతయనుభవముల ప్రతిపక్షికి పిరికిపందయై లొంగుటయో, లేక సాహసముతో వానిని ఎదురుగనో, చాటుగనో దెగటార్చుటలో తాను గూడ వానిచే దెగటార్చబడుటకు సంసిద్ధుడైయుండుటయో యను రెండు విధానములకు తోడుగా, నూతనముగా ప్రతిపక్షిని దెగటార్చక, తానెన్నడును తెగటార్చబడని శాశ్వతాత్మ యను దృఢవిశ్వాసముతో వానియెదుట ధైర్యము వహించి నిలిచి, అనిత్యమగు తన శరీరమును ఆహుతిజేసుకొనుటకు సంసిద్ధుడైయుండుట యను మూడవవిధానమును గూడ మానవులకు బోధించుట యొక నూతన సందేశము. మరియు, ఇంతవరకును మన నీతిశాస్త్రములలో దెలుపబడిన, సామ, దాన, భేద, దండ, యను చతుర్విధోపాయములకుదోడు, నూతనముగ, సత్యాగ్రహముతో అనగా సత్యమునందు పట్టిపట్టుదలతోగూడిన, అసహాయోద్యమోపాయమును పంచమోపాయమును గూడ మానవులకు బోధించుట మరియొక నూతనసందేశము. మహాత్ముడీ రెండు నూతనసందేశములను బోధించుటయేగాక, తన ప్రవర్తనవలన, ప్రపంచమున నెన్నడును ఇంతవరకు కని విని యెరుగని విధమున శత్రుప్రభుత్వమును, మిత్రరూపకముగ దొలగింపజేసి, భారతదేశమునకు సంపూర్ణస్వాతంత్ర్యము సమకూర్పగలిగెను. మహాత్ముడా కారణమున కారణజన్ముడు.

5. మహాత్ముడు మనలను విడనాడి చనిన దినమున అనగా 1948 జనవరి 30 తేది, రాత్రి ఆయనరాజకీయవారసుడైన భారతప్రధాని పండిత జవహరులాలు నెహ్రూ, మనల ... డించుచు చేసిన రేడియోప్రసంగములో, "మ... మందరమును కోరుతున్న మానవసంఘముయొక్క లేక ప్రత్యేకసంఘముయొక్క సంస్కరణమనగా, అందు గల వ్యక్తులయొక్క సంస్కరణమే యగుటచే, మహాత్ముడు వ్యక్తిసంస్కరణమే ప్రధానముగా దలచె"నని దెలిపెను. కావున దానిని మనలో ప్రతి వ్యక్తియు గ్రహించెదము గాక.

ఓం శాంతిః శాంతిః, శాంతిః.

---



బర్మా విదేశాంగమంత్రి యు. ఇ. మాంగ్ ఢిల్లీలో మహాత్ముని సమాధి సందర్శించి, గౌరవ సూచకంగా పుష్పగుచ్ఛమును ఉంచినప్పటి ఫోటో.

# మహాత్ముని దివ్య ప్రబోధసంస్మరణ

మృత్యువు జీవితంలో ఒక బ్రహ్మాండమైన పరివర్తనం మాత్రమే ననే ప్రవచనాన్ని నేను సర్వదా అంగీకరిస్తున్నాను. అందువల్ల ఎప్పుడు ఆసన్నమైనప్పటికీ మృత్యువుకు మనం హృదయపూర్వకంగా స్వాగతం చెప్పాలి. భయం అనే దానికి హృదయంలో ఏమాత్రం స్థానం లేకుండా చేయడానికి మహత్తరమైన కృషి చేశాను. మృత్యుభీతిని సైతం తరిమివేయగలిగాను. మృత్యువు సమీపిస్తున్న దని నేను గ్రహించినప్పుడు, చిరకాలంగా కానరాని ఆప్తమిత్రుని సమాగమం లభ్యం కాబోతున్నందుకు ఎవరైనా ఎంత సంబరపడతారో, అంత సంబరపడిన సమయాలు వున్నవి...

మృత్యునివారణార్థం మీరు కొన్నిరోజుల పాటు హిమాలయపర్వతాలకు పోరాదా అని ఎవరైనా నాకు సలహా ఇస్తే, ఆ సలహాను నేను ఏమాత్రం పాటించను. మానవుడు ముందుగా ఎంత జాగ్రతపడి, ఎంత శ్రద్ధ తీసుకున్నప్పటికీ, మృత్యువు అనివార్యమని నాకు తెలుసు. భారతదేశ ప్రజాహితజీవితంలో పాల్గొంటూ తమ ఆరోగ్యాన్ని అతిజాగ్రత్తగా కాపాడుకోవడం ఎలాగో తెలిసిన బహుకొద్దిమందిలో నేను ఒకడి నవే విషయం మీరు మరచిపోకూడదు. నాచేత ఏయే పనులు చేయించుకోవలసిందీ భగవంతుడికి తెలుసు. ఆ పరమాత్ముడు నా చేత తన పనులు చేయించుకోవడం పూర్తి అయిన తర్వాత ఒక క్షణంకూడా నన్ను వుండనివ్వడు."

* * *

"ఆరోగ్యవంతమైన దేహంలో, పరిశుద్ధమైన ఆత్మ వుండడం అవసరం. దేహారోగ్యం అంటే కండకుకండ ఎదురేసి బలిష్ఠమైన శరీరాన్ని పెంచడం కాదు. దుర్బలశరీరంలోకూడా ధైర్యసాహసాలతోకూడిన ఆత్మ వుండడంకూడా కద్దు. ఒకానొక పరిణామదశలో ఆత్మపరిపక్వత వృద్ధి చెందినకొద్దీ, దైహికపుష్టి క్షీణించడం సంభవిస్తుంది. సంపూర్ణారోగ్యంగల దేహంలో ఎక్కడా మాంసకండర మన్న మాటలేకపోవచ్చు. కండలు తిరిగిన శరీరం తరుచూ అనేక రుగ్మతలకు ఆలవాలమైవుంటుంది. శరీరంలో మాంసం లేకపోయినప్పటికీ నిర్మలమైన రక్తంతో సంపూర్ణారోగ్యాన్ని కలిగివున్న శరీరాన్ని ఇట్టి రుగ్మతలేవీ ఆశించవు...ఇట్టి పరిపూర్ణారోగ్యసాధన నా లక్ష్యాలలో ఒకటి. ఈ లక్ష్యసిద్ధికి పూర్వమే దేహయాత్ర చాలించవలసివచ్చినప్పటికీ నేను నిస్పృహ చెందను...పునర్జన్మసిద్ధాంతంలో విశ్వాసం వున్నది కాబట్టి, నా అల్పకృషి విఫలమైందని భావించను......

జీవాత్మ శాశ్వతమైనదని నా విశ్వాసం... ఇందుకు మహాగంభీరమైన సముద్రాన్నే మీరు ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. అపార సంఖ్యాబలంగల నీటికణాల సముదాయమే మహాసముద్రం. ఐతే ప్రతి నీటిబిందువుకు ప్రత్యేక వ్యక్తిత్వ స్వరూపా లున్నవి. ఐనప్పటికీ మహాసముద్రంలో అది ఒకభాగం. ఇదే విధంగా జీవితసాగరంలో మనం నీటికణాల లాంటివాళ్ళం."

* * *

పునర్జన్మ ఎత్తాలని నాకు లేదు. పునర్జన్మ ఎత్తడమే సంభవిస్తే- ఒక అస్పృశ్యుడనై జన్మించాలని నా వాంఛ. అప్పుడుగాని అస్పృశ్యుల కష్టాలలో, దుఃఖాలలో, అవమానాలలో భాగస్వామిగా సంచరించడానికి వీలు కాదు. నేను నా సాటివారుకూడా కష్టపరంపరనుంచి. దౌర్భాగ్య పరిస్థితులనుంచి తరించేటట్టు కృషి చేయడానికి సాధ్యపడుతుంది. కాబట్టి తిరిగి జన్మిస్తే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రజాతులలో కాక, 'అతిశూద్రుడు' (అస్పృశ్యుడు) గా జన్మించాలని నేను కోరుతున్నాను...

ఒక క్షుద్రవాడిని చూపించి "వాడిని నీవు తాకవద్దు రావాడు అస్పృశ్యుడు," అని మా అమ్మ ఒకప్పుడు చెప్పింది. "తాకితే ఏమి ?" అని నేను ఆమెను ప్రశ్నించాను. అస్పృశ్యతావిధానంపై నా తిరుగుబాటుకు అదే ప్రారంభం"

* * *

ఆత్మ పారిశుధ్యాన్ని సాధిస్తేనే గాని మనం ఏసమస్యతోనూ సంపూర్ణంగా ఐక్యం కాలేము.

(21 వ-పేజీ చూడుడు)

# మనరాష్ట్రం మనదేశం

## ★ గాంధిజయంతి, విజయదశమి
## ★ కమ్యూనిస్టుసంస్థల నిషేధం
## ★ కాశ్మీర్ సమస్య

నవభారత నిర్మాతఅయిన గాంధీ మహాత్ముని జన్మదినం అక్టోబరు 2 వ తేదీని భారత దేశంలో జయంత్యుత్సవం జరిగింది. విశ్వకళ్యాణానికై జీవితం ధారపోసి, మహత్కార్యాలు సాధించినవారి జన్మదినాన్ని కీర్తించడానికిగాను వారి జన్మదినాన "జయంత్యుత్సవం" జరపడం భారతీయులకు పరిపాటి. ప్రజల్లో సేవాధర్మాన్ని ప్రచారంచేసి వారికి త్యాగబలం ప్రసాదించి మహోద్యమంలో మహత్తర విజయం సాధించాడు మహాత్ముడు.

ఆదివారం గాంధి జయంతి. శనివారంనాడు విజయదశమి. ఆశ్వయుజ శు॥ దశమినాడు శక్తిస్వరూపిణి దుర్గామాత దుష్టదానవుడైన మహిషాసురుని మర్దించింది. అదే తిథినాడు శ్రీరామచంద్రుడు లంకాసురుని నిర్జించాడు. ఇదంతా దుష్టశక్తులపై దైవశక్తుల విజయాన్ని సూచిస్తుంది.

గాంధీమహాత్ముడు తన జీవితమంతా హింస, అసత్యం, అన్యాయాలను ప్రతిఘటించి, ప్రజల్లో అహింసనూ సత్యధర్మాలనూ ప్రచారం చేశారు. సమాజంలోని పీడితవర్గాలను సముద్ధరించడానికి సర్వవర్గాల మధ్యనూ కర్తవ్యబోధ చేశారు. అస్పృశ్యతానివారణలో గాంధీజీ సాధించగలిగిన కార్యాన్ని చూసి పాశ్చాత్య ప్రపంచం విభ్రమాశ్చర్యాలకు లోనయింది. పాశ్చాత్యుల "స్వాతంత్ర్య, సమత్వ, సౌభ్రాతృత్వ" సిద్ధాంతాలకు, సత్యం, న్యాయం, రహింస అనే సూత్రాలను చేర్చి ప్రాణంపోశా అని చెప్పవచ్చు. గాంధీజీ సూత్రత్రయసమన్వితంకాని పాశ్చాత్య ప్రజాస్వామ్య సిద్ధాంతాలు ఇంతవరకూ లోకంలో హింసకూ విషాదానికీ దారితీశాయి. సర్వన్యాయసిద్ధాంతాలకూ సత్యం పునాది గావాలని చెప్పారు. మానవసేవ, భూతదయ గాంధీజీసిద్ధాంతాలన్నిటికీ హృదయంవంటివి. లోకంలో తిరిగి మానవవాదం ప్రభవిల్లినగాని ముక్తి లేదని ఆచరణలో నిరూపించగలిగారు.

వ్యక్తిగత జీవనంలోగాని సమష్టిజీవనంలోగాని గాంధీజీ నైతికవాదమే శరణ్యమనే విషయం క్రమక్రమంగా ప్రపంచం అవగతం చేసుకుంటోంది. భీతిని జయించి హింసాప్రవృత్తిని ప్రతిఘటించాలనే గాంధిజీ ఆదేశమే నేడు ప్రపంచానికంతకూ ఏకైకశరణ్యం. ఈవిషయాన్ని జయంత్యుత్సవం జ్ఞప్తికి తెస్తున్నది.

### వరదలు:

గాలివానవచ్చి రెండురోజులు ఆంధ్రదేశాన్ని ముంచెత్తింది. ముఖ్యంగా గుంటూరు జిల్లాలోని ఒంగోలూ, తెనాలి, గుంటూరు, రేపల్లె, సత్తెనపల్లి తాలూకాల్లో అధికనష్టం సంభవించింది. 28 మంది మరణించారు. అనేక కేలపశువులు చనిపోయినాయి. కృష్ణాలంకల్లో అనేకగ్రామాలు వరదల్లో మునిగిపోయాయి. మొత్తం 25 వేల ఎకరాలు భూమి మునిగిపోయింది. పంటలకు నష్టంవాటిల్లింది. నూరు గ్రామాలకుపైగా మునిగిపోయాయి. అనేకవేల మంది ప్రజలు నిరాశ్రయులైనారు. కృష్ణానదిలో ఎన్నడూలేని ఎత్తున నీటిమట్టం లేచింది. ఒంగోలుతాలూకాలో గుండ్లకమ్మనది, ముదిగండివీరు, పోతురాజుకాలువ ఏకమై ప్రవహించాయి. పదిమైళ్ళమేర ముదిగండివీరు పొడుగునా నీటిలో మునిగిపోయింది.

వరదలవల్ల విపరీతనష్టం సంభవించింది. జిల్లాబోర్డు ఎన్నికల్లో రాష్ట్రికాంగ్రెస్ అభ్యర్థి ఓటమివిషయమై విచారించడానికి వచ్చిన శ్రీరంగాగారు వరదలవల్ల కలిగిన నష్టాన్ని స్వయంగా చూశారు. దాదాపు రు 2 లక్షల నష్టం సంభవించి ఉంటుందని అంచనావేశారు. కాని రెవిన్యూ అధికారులు ఒంగోలు తాలూకాలోనే రు 8 లక్షలుపైగా నష్టం కలిగిఉంటుందని చెప్తున్నారు. తాలూకావాసులు ఇంకా అధికంగా ఉంటుందంటున్నారు.

మద్రాసుప్రభుత్వం మొత్తం గుంటూరు కృష్ణాజిల్లాల్లో బాధానివారణకు చెరి ఒక జిల్లాకు ఒక లక్ష రూపాయల చొ॥ మంజూరు చేసింది. కర్నూలు మొదలైన మిగతా ప్రాంతాల్లో బాధానివారణకు మొత్తం ఒకటిన్నర లక్ష లివ్వడానికి నిశ్చయించారు.

### న్యాయపాలన:


గత సంవత్సరం గాంధీ జయంత్యుత్సవం సందర్భంలో రాష్ట్రిమంతటా మద్యనిషేధం అమలుజరిగింది. ఈ సంవత్సరం ప్రయోగపూర్వకంగా చెంగల్పట్టు, ఉత్తరార్కాడు జిల్లాల్లో న్యాయపరిపాలనాశాఖల విభజనవిధానం అమలుజరిపారు. బ్రిటిష్ పాలకు లున్నంతకాలం న్యాయశాఖను పరిపాలకశాఖనుంచి విడగొట్టాలని ఆందోళనచేసిన కాంగ్రెస్ పరిపాలనాధికారంలోకి రాగానే ఆ సూత్రాన్ని అమలు జరపలేదని అనేకమంది విమర్శచేస్తూ వచ్చారు. ముఖ్యంగా న్యాయవాదులు ఈ ఆందోళనలో ఎక్కువగా పాల్గొన్నారు. సోషలిస్టుపార్టీ, కమ్యూనిస్టుపార్టీ ఈ హేతువుపైన కాంగ్రెస్ సంస్థను తీవ్రంగా విమర్శించాయి. వీనికంతకీ ప్రభుత్వశాఖలపట్ల విశ్వాసం లేనివారే ఈ విమర్శలు చేస్తున్నారని మంత్రి మాధవమీనన్‌గారన్నారు. ఇందులో సత్యాసత్యా లెలా ఉన్నప్పటికీ న్యాయశాఖను విభజించవలసిన కర్తవ్యం కాంగ్రెస్‌పైన ఉన్నది. దాని అగత్యం అందరికీ తెలిసినదే. శాంతిరక్షణకు ఆర్డినెన్సులు శాంతిరక్షణ శాసనాలు అవసరమైన ఈ రోజుల్లో పై విమర్శలకు తావివ్వకుండా ముందుగానే జాగ్రత్త వహించడం కాంగ్రెస్ ప్రభుత్వాలకే మేలు. ఇకనుంచి ఈ రెండు జిల్లాల్లోనూ మేజిస్ట్రేట్లు విచారించే కేసు లన్నిటినీ జుడిషల్ మేజిస్ట్రేట్లు విచారిస్తారు. ఈ జుడిషల్ మేజిస్ట్రేట్లు హోంశాఖ అధికారంకిందకాక హైకోర్టు అధికారంకింద పనిచేస్తారు. న్యాయపరిపాలనా విధానంలో ఈ సంస్కరణ ఎంత వాంఛనీయమైనదీ. అన్యదేశాల చరిత్రలే నిరూపిస్తున్నవి.

### కమ్యూనిస్టుపార్టీ నిషేధం:

మద్రాసుప్రభుత్వం సెప్టెంబరు 29 వ తేదీ నుంచి కమ్యూనిస్టుపార్టీపై నిషేధం విధించింది. ఆంధ్ర, తమిళ్నాడు, కేరళ, కర్నాటకరాష్ట్రి కమ్యూనిస్టుపార్టీలు నాలుగింటికీకాక ఇంకా 19 కార్మిక సంఘాలకు ఈ నిషేధం వర్తింపచేశారు. వీనిలో అయిదుసంఘాలు ఆంధ్రదేశానికి సంబంధించినవి. మిగతావి తమిళ్నాడుకు సంబంధించినవి. ఇవి కమ్యూనిస్టుల నాయకత్వం కింద నడపబడుతున్నవని ప్రభుత్వం చెప్తున్నది. ఆంధ్రదేశంలో నిషేధించబడిన కార్మికసంఘాలు ౧. సింధియా నౌకానిర్మాణ కేంద్రకార్మిక సంఘం, (విశాఖపట్నం) 2. నారపరిశ్రమ కార్మికుల సంఘం (రాజమహేంద్రవరం) 3. ఆంధ్రరాష్ట్రి ముద్రణాలయ కార్మికసంఘం (విజయవాడ), జిల్లాలలోని వివిధశాఖలు. 4. ఆంధ్రరాష్ట్రి వ్యవసాయ కూలీ సంఘం (విజయవాడ), వివిధజిల్లా శాఖలు, 5. ఆంధ్రరాష్ట్రి రైతుసంఘం (విజయవాడ), వివిధజిల్లా శాఖలు, చెన్నపట్నానికి చెందిన ట్రాంవే, ఎలక్ట్రిక్ కార్పొరేషన్ల కార్మిక సంఘం, ఓడరేవు కూలీసంఘం, బిన్నీ బీచ్ ఇంజనీరింగు కార్మికసంఘం, సౌత్ ఇండియన్ రైల్వే లేబర్ యూనియన్ కూడా నిషేధించబడినాయి.

ఈ కమ్యూనిస్టు పార్టీలు, కార్మికసంఘాలు రాష్ట్రింలో శాంతిని భంగపరచడానికీ, పరిపాలనా విధానంలో నిరోధాలు కలిగించాలనీ యత్నిస్తున్నందువల్ల నిషేధం విధించవలసి వచ్చిందని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం ఎంతకాలం సహనం వహించినప్పటికీ కమ్యూనిస్టులు తమ దౌర్జన్య విధానాన్ని మానడంలేదనీ అందువల్ల వారి పార్టీని నిషేధించవలసిన సమయం వచ్చినట్లు తలిచారనీ ప్రభుత్వం ప్రకటనలో వివరించింది. కమ్యూనిస్టుల దౌర్జన్యం కృష్ణాజిల్లాలోనూ, మలబారు, తంజావూరు జిల్లాల్లోనూ ఉధృతంగా ఉందన్నారు. కమ్యూనిస్టుల దౌర్జన్యాలకు గురైనవారు పోలీసులకు సహాయపడేవారూ, కాంగ్రెస్‌వాదులూ నని ప్రభుత్వం చెప్తున్నది. నిజానికి పోలీసులుకూడా గురైనారని చెప్పాలి. కమ్యూనిస్టుల అరాచకవర్గాలవల్ల

(21-వ పేజీ చూడుడు)



మే. జ. ఆత్మసింగ దర్వాల్ లోయలో స్థానిక ముస్లిములతో పునరావాస సమస్యలగురించి చర్చిస్తున్నప్పటి దృశ్యం.

దుర్గాధిపతులు:

# నాదిండ్ల అప్పన మంత్రి:

శ్రీ కోన వెంకట్రాయ శర్మ

ఈ నాదిండ్లవారి వంశమునకు మూలపురుషుడు కౌశిక గోత్రమున నుదయించిన నామనమంత్రి. ఇతనికి సింగమాంబయందు మాదయ్య, గంగన్న, చిట్టిగంగన, యను మూవురు పుత్త్రులు జనించిరి. ఇందు చిట్టిగంగన యనంగసమానరూపరేఖా లలితాంగుడు. సాళువ నృసింహమనుజప్రభుకార్యకళా ధురంధరుడు. లవణాబ్ధివేష్టితధరాధిపదుర్మతమంత్రి మంత్రితుండాలవితానకేసరి. అట్లని మాదయగారి మల్లన రచించిన "రాజశేఖర చరిత్రము"న గల—

"సాళువ నారసింహ మను
జ ప్రభు కార్యకళాధురంధరుం
డై లవణాబ్ధివేష్టిత ధ
రాధిప దుర్మతమంత్రమంత్రితుం
డాలవితానకేసరి య
నంగ ననంగసమానరూపరే
ఖా లలితాంగు డట్టి చిటి
గంగన యొప్పు గుణానుషంగుడై."

అను (ప్ర. ఆ. 19.) పద్య మవగతి మొనర్చుచున్నది. ఇ మ్మువ్వురలో నగ్రేసరుడగు మాదయ్యకు నమలాంబయందు నన్నయ్య, లింగయ్య, వరదయ్య, మాధవయ్య, రామభద్రయ్య యను కొమాళ్లుదయించిరి. వీరి గుణవిశేషములు "రాజశేఖర చరిత్రము"న—

"ఆరూఢోన్నతి నన్నపార్యుడును లిం
గామాత్యుడు న్సర్వవి
ద్యా రాజీవభవాకృతి న్వరద దం
డాధీశుడు న్మంత్రి చూ
డా రత్నంబగు మాధవుండు నరరా
డ్గర్వచ్ఛిదాపాదన
శ్రీరామాపరమూర్తి యాత డనగా
శ్రీరామభద్రాఖ్యుడున్."

—అని (ప్ర. ఆ. 22 ప.) వర్ణింపబడినవి. వీరిలో వరదయ్యకు గోపమాంబయందు దిమ్మన, చినతిమ్మన, కొండయ్య యను మూవురు కొమాళ్లు పుట్టిరి. ఇందగ్రజుడగు తిమ్మన యవారిత శౌర్యుడు. అట్లని "రాజశేఖరచరిత్ర"మందలి (ప్ర. ఆ. 24 ప.)

"వారలలోన నగ్రజుడ
వారిత శౌర్యుడు తిమ్మమంత్రి మం
దారముదగ్రదోరసివి
దారితదారుణ వైరివీర కం
ఠీరవ కంఠశోణిత ధు
నీ ఘనఫేనవిభాసితత్వత
ద్భూరిసితాతపత్త్రి రణ
భూమియతం డొక మంత్రి మాత్రుడే!"

—అను పద్యము తెలియజేయుచున్నది. ఈ తిమ్మమంత్రి నాదిండ్లాన్వయవార్ధిశీతరుచి దానక్షాత్ర సంపన్నుడు. ఆశాదంతావళదంతకుంతపటలస్పర్ధాళు సత్కీర్తి. నానాదేశ క్షితిపాల మంత్రికులరత్నము. ఆశ్రితవ్రాత వీక్షాదాక్షిణ్యనివాసభూమి. అట్లని "రాజశేఖర చరిత్ర" (ప్ర. ఆ. 25 ప.) మందలి.

"నాదిండ్లాన్వయవార్ధి శీతరుచి దా
నక్షాత్త్రి సంపన్ను డా
శా దంతావళదంతకుంతపటల
స్పర్ధాళు సత్కీర్తి నా
నా దేశ క్షితిపాల మంత్రికుల ర
త్నం బాశ్రితవ్రాతవీ
క్షా దాక్షిణ్యనివాసభూమి యని లో
కఖ్యాతి మించె న్మహిన్."

—అను పద్యము స్పష్టపఱచుచున్నది. సత్యగుణశీలి యగు నిమ్మహాసచివమణికి కృష్ణమాంబయందు గోనమంత్రి, అప్పనప్రభుడు, గోపదండనాథుడు నను మువ్వురు పుత్రులు జనించిరి. అప్పనప్రభుడే యప్పనమంత్రి. గోపదండనాథుడే గోపనమంత్రి. వీ రిర్వురును అన్యోన్యప్రియులై రామలక్ష్మణాకృతులగుచు నలరి రని "రాజశేఖర చరిత్ర" (ప్ర. ఆ. 29 ప.) మందలి

"ఆ యనుగుం దమ్ముడు విన
యాయతమతి గొల్వ నప్పనార్యుడు నతడు
న్బాయక యన్యోన్యప్రియు
లై యలరిరి రామలక్ష్మణాకృతు లగుచున్."

—అను పద్య మవగతి మొనర్చుచున్నది.

సకలకర్ణాటరక్షావిచక్షణుండును, దీనసురశాఖియు, శ్రీకృష్ణదేవరాయసార్వభౌమునకు గుల్రక్రమాగత మహామాత్యుండును, నగు సాళ్వతిమ్మదండనాథునకు లక్ష్మాంబయందు జనించిన కొమార్త తిరుమలాంబను నాదిండ్ల అప్పనమంత్రి కొసగి వివాహ మొనర్చెను.

"ఆ యప్పమంత్రి గుణములు
వేయి తెఱంగుల జెలంగి వినుతి యొనర్ప
న్నాయగ నాకోదర కుల
నాయకునకు గాక కవిజనంబుల తరమే!"

"నిజకీర్తి జలధి కున్నిద్రగుణస్ఫూర్తి
నిత్యపూర్ణేందుగా నిలిపినాడు
కరహేతి పరశిరః క్రమ కిరీటాగ్ర
పీఠులపై వాడి బెట్టినాడు
ధరదాల్పు హరిదంతదంతిసంతానంబు
మూలకు ముట్టగా దోలినాడు
వాచానిరూఢిగర్వము నూపవచ్చిన
శేషాహి నాలుకల్ చీరినాడు
కపట రాజన్యమంత్రి దుర్గర్వ భార
తిమిర పటలంబు శేముషీతీవ్రభాను
భానుమాలికచే బటాపంచ జేసి
వెలసినాడన నప్పన వినుతి గాంచె."

"పలుమా అంబుధరంబు చూపు బహురూ
పం బంబరాసక్తి శీ
తలభానుండును బొట్ట బెంచుటకునై
తాల్చుం గళాప్రౌఢి ని
చ్చలు వారింప జరించువారినిధి యా
శాబద్ధుడై వీరల
న్దిలకింపం దఱనోటు దాతలని నా
దిండ్లప్పనిం జెప్పచోన్."

—అను 'రాజశేఖర చరిత్ర' మందలి (ప్ర. ఆ. 30, 31, 32 పద్యములు.) పద్యములిమ్మంత్రిచూడామణి గుణగణంబుల, రూపురేఖల,—దీర్చి దిద్దినట్టులవగతి మొనర్చుచున్నవి.

శ్రీకృష్ణదేవరాయలకు బితృతుల్యుడై, మహారాజ్య ప్రవర్తకుడై, యత్యధిక గౌరవముం బడసిన సాళువతిమ్మసచివాగ్రణిని, అతని యర్ధాంగి లక్ష్మాంబను,—మాదయగారి మల్లన మాటల వినుతించెనో ఈ క్రింది పద్యమును జూడుడు.

"ఏ మంత్రిమణి నిజ స్వామికార్య క్రియా
తత్పర మానసోత్సాహశాలి
ఏ మంత్రిమణి మిత్త్రహిత బాంధవాశ్రిత
ప్రకర రక్షణ కళాప్రౌఢ బుద్ధి
ఏ మంత్రిమణి వచోహేలాతినైర్మల్య
శీతలతాధూతశీతరోచి
ఏ మంత్రిమణి సుధాధామశాంభవధామ
ధాళధళ్యసుతుల్య ధవళకీర్తి
యట్టి మంత్రి కులోత్తంస మహిత నృపతి
పటల మకుటాగ్ర ఘటిత పత్పద్మయుగళి
సకల కర్ణాట రక్షావిచక్షణుండు
దీన సురశాఖి సాళువతిమ్మమంత్రి."

"అమ్మహామంత్రి కతని యర్ధాంగలక్ష్మి
సకలపుణ్యాంగనా జన శ్లాఘనీయ
లక్ష్మమాంబకు నుదయించి లలిని మెఱయు
తిరుమలాంబిక బెండ్లియై తేజరిల్లె."

అప్పన మంత్రి. ఇయ్యప్పనమంత్రి యువతీజనచిత్త వినూత్న దర్పకుడు. వివేకశాలి. ఆశ్రితవత్సలుడు. కావుననే యతని శుభ్రకీర్తు లమ్మతాంగనస్సింధు వీచీ ఘటా తా దాత త్ర్యం బు వహింపబోలు. కాబట్టియే మాదయగారి మల్లన

"శ్రీ పదాళి విధాతకు
సాళువ తిమ్మ ప్రధాన జామాతకు సు
ద్వే ప్సర్శన విజిత
త్రైలోక్య చరాచర ప్రదాతకు బ్రీతిన్."

—అభ్యుదయ పరంపరాభివృద్ధిగా 'రాజశేఖర చరిత్ర' ను రచించి కృతి యొసంగెను.

మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి యాలయమున కెక్కు మెట్ల చేరువ నున్న స్తంభమునకు నాల్గు ప్రక్కల శా. శ. 1443 (వృష సంవత్సరమున) క్రీ. శ. 1521 వ సంవత్సరమున శ్రీ కృష్ణదేవరాయమహామాత్యుండగు సాళువ తిమ్మదండనాథుడు చెక్కించిన శాసనముంబట్టి నాదిండ్ల అప్పనప్రభుని కొండవీటి దుర్గ పరిపాలకునిగా దిమ్మ దండనాథాగ్రణి నియమించినట్టు లగపడుచున్నది. అప్పన తన తమ్మునివలె కృతికర్త గాకున్నను కృతిపతియై 'రాజశేఖర చరిత్ర' ను కృతినందికొనుటవలన కవిజనపోషకుండని నిర్ధరింపవచ్చును. శా. శ. 1438 ధాతృ సంవత్సరమున నప్పప్రభుడు మంగళగిరి దేవాలయమునకు మండపప్రాకారముల గట్టించెననియు, శా. శ. 1439 ఈశ్వర సంవత్సరమున నప్పప్రభుడు చెక్కించిన రెండు శాసనములవలన గొండబ్రాహ్మణుల కతడు దానము లొసంగెననియు, కొండవీటియందొక స్తంభముమీద శా. శ. 1442 (క్రీ. శ. 1520) విక్రమ సంవత్సరమున నాదిండ్ల గోపన చెక్కించిన శాసనముం బట్టి యతడు కొండవీటి శ్రీరామస్వామికి ఆభరణాదుల నొసంగెననియు, విదితమగుచున్నది. మీది శాసనములలో దుది రెండు శాసనములలో మొదటి శాసనము గీర్వాణాంధ్రము లందును, రెండవది గీర్వాణమునను,—రచింపబడినవి. ఇవిగాక శా. శ. 1443 (వృష సంవత్సరమున) శ్రీకృష్ణదేవరాయలు సంస్కృతమున జెక్కించిన శాసన మొకటి గుంటూరు తాలూకాలోని 'కాజ' గ్రామమందలి శ్రీ కోదండరామస్వామి యాలయమున గలదు. ఇమ్మూడుశాసనములను మంత్రశాస్త్ర జ్యోతిశ్శాస్త్ర షడ్దర్శన ధర్మశాస్త్రములలో గ్రంథముల విరచించిన పండితాఖండలుండగు లొల్ల లక్ష్మీధరసూరి లిఖించినవి. ఇప్పండితాఖండలుడు తెనాలి కనతిదూరమున నున్న 'కొల్లూరు' నివాసి.

శా. శ. 1437 (యువ సంవత్సర ఆషాఢ శుక్లైకాదశి మందవాసరము) క్రీ. శ. 1519 దవ సంవత్సరము జూన్ 23 వ తేదీన శ్రీ కృష్ణదేవరాయలు కొండవీడుదుర్గమును గెలుపొందిన తర్వాత గోపప్రభుని కొండవీటిదుర్గమునకు బరిపాలకుని (*Governor*) గా సాళ్వతిమ్మ మహామంత్రీశ్వరుడు నియమించినట్లును, శా. శ. 1442 (విక్రమ సంవత్సరమున) క్రీ. శ. 1520 దవ సం॥రము మే నెల 2 వ తేదీన సత్తెనపల్లె తాలూకాయందలి 'పేరూరు' లో శివకేశవులకు భూదానము నతడొసర్చినట్లును, — గోపసచివుడు స్తంభముపై జెక్కించిన శాసనముం బట్టి తెలియం దగియున్నది. దీనిం బట్టి గోపదండనాథాగ్రణి యప్పటికి కొండవీడు దుర్గమున కధ్యక్షుడుగా నున్నయట్లు లవగత మగుచున్నది. సాళ్వతిమ్మ సచివాగ్రణి శా. శ. 1443 (వృష సంవత్సరమున) క్రీ. శ. 1521 వ సంవత్సరమున జెక్కించిన శాసనముం బట్టి యప్పప్రభుని దుర్గపరిపాలకునిగా నియమించినట్లు లగుపడుచున్నది. కాని

"నాదిండ్ల తిమ్మయామాత్య
కళత్రం కృష్ణమాంబికా,
తత్పుత్త్రా వప్పయామాత్య
గోపయామాత్య శేఖరౌ."

"శ్రీకృష్ణక్షితిపాలతిమ్మసచివా
త్పల్యంకికాచామరే,
ఛత్రం యో వినికొండను త్రికనక
క్ష్మాభృత్పురాగ్ర్యక్షతామ్
మత్తేభాశ్వపదాతిసంకులమహా
సేనాధిపత్యం మహా,
ద్రావైకత్వధురంధరత్వ మగమ
న్నాదిండ్లయప్పప్రభుః."

"శ్రీకృష్ణరాయనరనాథశిరః ప్రధాన
శ్రీసాళ్వతిమ్మసచివేశ్వరభాగినేయః
నాదిండ్లయప్పసచివో నయతత్త్వవేదీ
శ్రీకొండవీటినగరైకధురంధరో౽భూత్."

అను వాక్యములంబట్టి యప్పన వినికొండ (*Vinukonda*) దుర్గాధ్యక్షుడుగా నుండి నయతత్త్వవేదియై, విజ్ఞానఖనియై, సంస్కృతాంధ్ర భాషల కృతుల జెప్పించెను.

త్రేతాయుగంబున శ్రీ రామచంద్రమూర్తి లక్ష్మణస్వామితో గూడి సీతాన్వేషణమునకయి

(16-వ పేజీ చూడుడు)

కథానిక:

# అడ్డగట్టు

'శ్రీ తటవర్తి'

(గతసంచిక తరువాయి)

## ౪

ఆ రాత్రి వర్ధనానికి నిద్రే పట్టలేదు. ఆగ్రహం, ఆవేదన, ఆందోళనతో రాత్రి వేగిం చాడు. అతని ప్రకృతి రంగమ్మకు బాగా తెలుసు. బంధువులలో స్నేహితులలో కూడా తన దర్జా చూపించాలని ఎదుటివాళ్లకు గొప్ప కలుగుతుందేమో అనియైనా తలచకుండా ఆత్మాతిశయం వర్ణించుకుంటూ ఉండే వర్ధనం హృదయ మామె బాగా ఎరుగు. భర్త కెన్నిసార్లో చెప్పి చూచింది. ఇటువంటి ప్రవర్తన గౌరవానికి బదులుగా ఆ గౌరవం మేలుకు బదులుగా కీడు సంపాదించి పెడుతుందని. అల్లాగ కాకుండా అందరితో ప్రేమగా కలిసిగొట్టు కొనడం నేర్చుకోవాలని బోధిం చింది. కాని లాభం లేకపోయింది. నేటి విష యంలో కూడా భర్తదే తప్పని ఆమె ఎరుగును. కనుకనే పెన్మిటిని ఓనక వేసుకుగాలేకపోయింది ఆయనఉద్దేశ్యంతో సహకరించలేకపోయింది. భర్త తనతో మనస్సువిప్పి మాట్లాడనప్పుడు తానెందుకు పూనుకోవాలని ఊరకుంది. మగడిని మళ్లీ ఏమీ ప్రశ్నించలేదీ విషయంలో—

ఆ పగలు వర్ధనం ఇంటిలోనంచి కదలనే లేదు. ఏదో అదోవిధంగా - మందు తిన్నవాడి లాగ ఆలోచనతో - అవమానం భరించలేక మంచంమీదే పరుండిఉన్నాడు.

ఆ పగ లెవ్వరో ఇద్దరు ముగ్గురు సొమ్ము బదు లడగడానికి నలుగురైదుగురు పుచ్చుకొన్న బాకీ తీర్చుకోడానికి వర్ధనమింటికి వచ్చారు. ఇంట్లో లేడని చెప్పించాడు.

రాత్రి పండ్రెండు గంటలు దాటింది. నాల్గు మూలలా గాఢాంధకారం. జంగమస్థావరాలన్నీ మైమరచి నిద్రిస్తున్నాయి. కడుపుమంటచేత ఘూకజాతికిమాత్రం నిద్ర లేదు.

తెల్లవారింది. రాత్రిఅంతా నిద్రలేదు గోవర్ధ నానికి. ఎప్పుడు పట్టిందోగాని ఉదయం ఆరు గంటలైనా ఇంకా నిద్రపోతున్నాడు. రంగమ్మ లేచింది మామూలుగా. దొడ్డితలుపూ భర్తపడక గదితలుపూ తెరచిఉన్నాయి. కంగారుపడింది. భర్తను లేపింది. ఉలిక్కిపడి లేచాడు వర్ధనం. ఇనప్పెట్టె చూచాడు. మూయబడే ఉంది. అద్దాలబీరువామాత్రం బ్రద్దలు కొట్టబడిఉంది. పగలు ధరించిన వస్తువులన్నీ రాత్రి ఆ బీరువా లోనే భద్రపరచడం రంగమ్మ కలవాటు. నిన్న రాత్రి అల్లాగే చేసింది. తాళంచేతుల గుత్తి పరుపుక్రిందే ఉన్నది. బీరువా బ్రద్దలుకొట్టి వస్తువులు దోచుకుపోయారు. అన్ని వస్తువులు చూచుకొన్నారు. ఒక్క కాసులపేరుమాత్రం లేదు. మిగిలిన వేవీ దొంగలు పట్టుకొని వెళ్లలేదు.

ఇంటిదాసీ - చిన్న పాలేరూ వచ్చారు. ఊరంతా ఈ చోరీసంగతి విని వర్ధనమింటికి పరుగెత్తుకువచ్చారు. మారెయ్య రామన్న నారా యుడు వచ్చారు. గ్రామమునసబు పోలీసుకు ఒక్కీరు వ్రాసిపంపాడు.

ఇదేదో విచిత్రమైన దొంగతనంలాగ కనిపిం చింది అందరికి. మువ్వలవడ్డాణం, నాల్గుపేటల గొలుసు, కంటెవంకీలు ఇంకా ఎన్నో ఉన్నాయి. అన్నీ వదిలిపెట్టి ఒక్క కాసులపేరే పట్టుకుపోవడంలో ఏదో విచిత్రంఉంది. ఊహా రచనలు, వాదప్రతివాదాలు జరుగుతున్నాయి.

నారాయుడు—మునసబుగారూ అన్నీ వదలి పెట్టి ఒక్క కాసుల పేరే పట్టుకుపోవడం వింతగా ఉందండి అన్నాడు.

మారెయ్య—అన్నీ కాజెయ్యాలనే వచ్చాడు. ఎవరో లేచారని కంగారుపడి పారిపోయి ఉంటాడు.

రామన్న—ఎంత సాహసం. ఇనప్పెట్టె కన్న గట్టి కొంపలోకి ఎల్లా దూరగలిగాడో! తలుపెల్లా తెరిచాడో! గోవర్ధనం, రాత్రి గదితలుపు వేసుకో లేదూ? అన్నాడు.

వర్ధనం —ఏమో నాకంత జ్ఞాపకంలేదు. గాలి లేదని యీ వసారాలో చాలాసేపు పడు కొన్నాను.

నారాయుడు—అప్పుడే గదిలోకి దూరాడు.

వర్ధనం—మా మెత్తదనం బాగా గుర్తిం చారు మా ప్రాణాలు కూడా పుచ్చుకొంటేనే గాని వదలరు. అయినా ఏమి చేస్తాము! మా కర్మ. అన్నాడు నీరసంగా.

మారెయ్య ఏదో అనబోయాడు. ఇట్టే మరచి పోయాడు. తల బ్రద్దలు కొట్టుకొన్నా జ్ఞప్తికి రాలేదు. ఆ మాటకోసమే ఆలోచిస్తున్నాడు.

నారాయుడు—మన గ్రామంలో, నాకు జ్ఞానంవచ్చినతరువాత ఎక్కడా దొంగతనమే ఎరుగము. పూరింటిలోని పూతికపుల్లకూడా పోయి ఉండలేదు. మరి ఇప్పు డిది ఎల్లాగ జరి గిందో కాని—

ఇది తన కింకో గట్టి పరాభవ మనుకొన్నాడు వర్ధనం. తన చేతగానితనాని కిదొక నిదర్శన మను కొన్నాడు నిష్ప్రభమైపోయింది వర్ధనం ముఖం

పోలీసులు వస్తారు. వాళ్లకి భోజనాలు కాఫీలుఏర్పాటుకోసం లోపలికి వెళ్లాడు వర్ధనం. అక్కడ కూడా రంగమ్మచుట్టూ గ్రామంలోని ఆడవాళ్లందరూ ప్రోగుపడి యీ చోరీగురించే విమర్శిస్తున్నారు. వర్ధనంరాక చూచి అంతా తప్పుకోబోతూ ఉంటే రంగమ్మే లేచి ఇవతలి వసారాలోకి భర్త కెదురుగా వచ్చింది.

"పోలీసురిపోర్టు చేసాము. వాళ్లు వస్తారు. కాస్త వాళ్లకి భోజనాలు వగైరా."

"సరేకాని పోలీసురిపోర్టెందుకు? కాసుల పేరు పోతేపోయింది. పోలీసూవద్దూ రిపోర్టూ వద్దూ ఇంకెక్కడైనా పెట్టి బీరువాలో పెట్టా ననుకొన్నా నేమో ఇంకా వెదుకుదాము."

"రాత్రి నువ్వా బీరువాలో పెట్టడం నేను స్పష్టంగా చూచాను. ఇప్పుడు రిపోర్టు చెయ్య కుండా ఊరుకొన్నామంటే రోజూ మన ఇంటిలో దొంగతనమే. ఒక్క చెంబూ కూడా మనకు దక్కదు."

"అల్లా గెన్నటికీ కాదు. మన గ్రామం మంచి కట్టుబాటులో సంఘీభావంతో ఉంది. మన గ్రామస్థులు పోకిరులు, తుంటరులు, జూద రులు కారు. మీ రెన్ని చెప్పండి. రిపోర్టు మాత్రం చెయ్యొద్దు. నా వస్తువు నాకు దొరికి పోతుందని నా మనస్సు చెప్పుతోంది."

"దొరక దని ఇంకాపోతా యని తగిన రక్షణ చూచుకో అని నా మనస్సు చెప్పుతోంది. పోలీసులకి రిపోర్టు పంపేసాము వాళ్లు వచ్చితీరు తారు. వాళ్ల భోజనం మన ఇంటిలోనే ....."

"సరే భోజనాని కేమిలెండి. వస్తారు. తిని పోతారు. కాని వాళ్లతో — పోయిన వస్తువు దొరికిందని. ఇంక కే నవసర మని చెప్పి వేయండి.

ఈ చివరిమాటలు వినిపించుకోకుండా వెళ్లి పోయాడు వర్ధనం. ఇంకా వీధిలో జనం అంతా అల్లాగే కూర్చుని ఉన్నారు ఎవ్వరికి ఆకలే లేదు. వర్ధనంఇంటిలో దొంగతనం వారిని చాలా బాధ పెట్టింది. మొన్నటిరోజున ఆ ఘట్టం జరగడం ఇప్పుడీ దొంగతనం!......

## ౫

తొమ్మిదిగంటలప్రొద్దెక్కేటప్పటికి వెంకటా పురంనుంచి పోలీసుసబిన్స్పెక్టరు నాయుడు గారు ఇద్దరు జవానులతో వచ్చారు. మునసబు- గ్రామస్థులందరూ లేచి దండంపెట్టారు. వర్ధనం స్వాగతంచెప్పాడు. వీధిఅరుగుమీద పడక కుర్చీలో కూర్చున్నాడు ఇన్స్పెక్టరు. అరుగు క్రింద పడిమీద కూర్చుని బీడీ కాల్చుకుంటు న్నారు జవానులు.

గ్రామంలోని పిల్లలు ఈ ఎర్రటోపీలను చూచి భయంచేత దూరంగా నిలబడి ఏవేవో అనుకుంటున్నారు.

వర్ధనంనౌకరు కాఫీ తెచ్చి యిచ్చాడు నాయుడుగారికి. కాఫీ త్రాగి సిగరెట్టంటించాడు సబిన్స్పెక్టరు.

"అయితే మునసబుగారూ, ఒకసారి లోపలికి వెళ్లి ఆ గది- ఆ బీరువా మాద్దాము అంటూ లేచాడు. వర్ధనం, మున్సబులుమాత్రం కూడా వెళ్లారు. మిగిలినవారందరూ అరుగుమీదే కూర్చు న్నారు. పని ఉన్నదంటూ నారాయుడు - మారెయ్య వెళ్లిపోయారు.

బీరువాఅద్దంతలుపు బ్రద్దలు కొట్టబడిఉంది. గది తలుపూ, దొడ్డి పెరటితలుపూ చూచాడు ఇనస్పెక్టరు. వర్ధనంతో మీ దాసీలని, పాలే ళ్లని, నౌకర్లని పిలిపించమన్నాడు.

వాళ్లు అటువంటివాళ్లు కారని వాళ్లమీద ఏ అనుమానం లేదని నొక్కి చెప్పాడు వర్ధనం.

"అయితే ఇంకెవ్వరి మీద అనుమానం?—" అన్నాడు మళ్లీ సిగరెట్టు అంటించుతూ.

వర్ధనం చెప్పడానికనుమానించాడు ప్రక్కనే మునసబున్నాడని. అదిగ్రహించి ప్రక్కవసారా లోకి వెళ్లారు వర్ధనం నాయుడున్ను.

"ఇన్స్పెక్టరుగారూ ఇది పెద్దకుమ్మక్కుతో, సాహసంతో జరిగించబడింది. దీనికి కొంచెం ఉపోద్ఘాతం చెప్పవలసిఉంది. అంటూ మొన్నటి చరిత్ర మంతా చెప్పి ఫలానావాళు ఈ పని చేసి ఉంటారని ఫలానావాళ్లు మద్దత్తు చేసి ఉంటారని అన్నాడు.

"సరే మీ మాటచొప్పున మే మెంక్వయిరీ చెయ్యాలి అంటూ లేచాడు వర్ధనం, మునసబు లతో కలిసి బయలుదేరాడు. ఎక్కడికా అని ఎల్లరూ వెంబడించారు.

నారాయుడు బీదవాడు. ఇల్లూ బీదదే. తండ్రితాతలు గడించియిచ్చిన ఎకరం నేలా అతని కుటుంబానికి జీవనాధారం. గౌరవం అభి మానం పోగొట్టుకోకుండా పోషించుకుంటూ వస్తున్నాడు కుటుంబాన్ని. భార్య నల్గురు బిడ్డలు అతని మొత్తం పరివారం. సంతోషంతో సంతృ ప్తితో శాంతంగా జీవితం గడుపుతున్నాడు.

వర్ధనంఇంటిదగ్గరనుంచి తిరిగి వచ్చాడు నారా యుడు. ఈ చౌర్యం అతని కందరికంటె బాధ కలిగిస్తోంది మొన్న అనవసరంగా వర్ధనంతో వివాద. నేడు ఆ పెద్దకొంపలో దొంగతనం జర గడం అతని కేమో గుండె అదురుగా ఉంది.

ఆవుపాలు పిండుకున్నాడు నారాయుడు. లేగమూతను భార్య లాగిపట్టుకొని ప్రక్కనే నిలబడిఉంది. ఇంతలో పోలీసులు గ్రామస్థులు అంతా తమ ఇంటివైపు, ఇంటికే రావడం చూచి పట్టుకొన్న దూడ నట్టే వదిలివేసి లోనికి పరు గెత్తింది నారాయుడి భార్య. అమాంతంగా దూడ కలియబడడంలో పరాకుగాఉన్న నారా యుడి చేతిలోని పాలచెంబు క్రింద పడిపోయింది. పిండిన పాలన్నీ మట్టిగలిసిపోయాయి.

పైకి తలఎత్తి చూచాడు నారాయుడు. భార్య అక్కడ లేదు. కాని సబిన్స్పెక్టరు, జవానులు, మున్సబు, వర్ధనం ఇంకా గ్రామస్థులు సాక్షాత్క రించారు.

విస్తుపోయాడు నారాయుడు. హృదయం మేనూ వణికింది. ఏమనాలో కూడా తెలియ లేదు. నోటివెంట మాట ఊడిరావడంలేదు. సబిన్స్ పెక్టరుకఠోరస్వరం అతన్ని మేల్కొల్పింది.

"నీ యిల్లు సోదా చెయ్యాలి" అన్నా డిన స్పెక్టరు.

అందరికీ కోపం, భయం, ఆశ్చర్యం ఒక్క సారిగా పుట్టాయి గ్రామమంతటికీ ఉత్తముడూ సజ్జనుడూ అయిన నారాయుడు నేరస్థుడా! అభూతకల్పన, మోసం, వంచన! మొన్నటి పరా భవం ఈవిధంగా చల్లార్చుకొంటున్నాడు వర్ధనం. ఇది అందరూ గ్రహించారు.

ఇంతవరకూ వచ్చింది పరిస్థితి ఇంక ఊరుకో కూడదని నారాయుడి తరఫుననుండి అన్నింటికీ ఒడిగట్టాలని ఎంచారు ఆ గ్రామస్థులంతా. ఇంత దాకా వర్ధనంమీద ఏ కొంచెమో ఉన్న తమ భక్తి, ఆదరం చెడింది. వర్ధనంచేతే తమ భావ పరివర్తనకు కారణమని ఎవ్వరో ఏదో చెప్ప బోతూ ఉంటే మునసబు వాళ్లనెవరిని మాట్లాడ నీయలేదు. మునసబు కూడా నారాయుడిపవిత్ర వర్తనం ఎరుగు. కనుకనే నారాయుడూ! ఆ పో యిన వస్తువు నీ యింట్లో ఉందని అనుమానించారు పోలీసువారు. చూచుకోనియ్యి. నీ కేమీ భయం లేదన్నాడు. తన హోదా ఉద్యోగంబట్టి నారా యుడియందుండే తన ప్రేమతోను.

నారాయు డేమీ జవాబియ్యలేదు స్థాణువు లాగ అక్కడే నిలబడియున్నాడు

నారాయుడి ఇంటిలోకి వెళ్లా రినస్పెక్టరూ


(17 వ పేజీ చూడుడు)




బోట్ల సహాయంతో మునిగిపోయిన గుడిసెలలోని వస్తువులను చచ్చిన జంతువులను ఒడ్డుకు చేర వేయుచున్న దృశ్యము.



ముంపు ప్రదేశంనుంచి ఏదోవిధంగా బయటపడ్డ కొందరు.



వరదనీరు ఇళ్లకు చుట్టుముట్టినందువల్ల పై కప్పులు మాత్రమే కనుపిస్తున్నాయి.




మూసియున్న హెడుస్లూయిసు ద్వా[illegible]ల

# కృష్ణా




కృష్ణవరదలవల్ల (విజయవాడ) జలమయమైన రివర్ ల




విజయవాడ రివర్ లంక, భ్రమరాంబాపురం, డ్రైవర్ [illegible]
పోయినవి. అక్కడ ఒక గుడిసెలోన






రైల్వే వంతెనదిగువ నీటిమట్టం తెలిపే స్తంభం.



తెల్లనీరు ఆనకట్ట ఎగువది. నల్లనీరు ఆనకట్ట దిగువది. ఎలక్ట్రిక్ స్తంభాలు కానవగును.

## విజయవాడలో


# నదివరదలు




వరదరోడ్డును కోసి వేయుటగూడా స్పష్టముగా
దు కానవగును. రోడ్డు అంచు తెగిన
చోట కొళాయిగొట్టాలుగూడ కలవు.
ఇంక కొంత హెచ్చిన వీటికి ప్రమాదమే.




ఒక పేటలో నీటిలో మునిగి తేలుతున్న గుడిసెల దృశ్యం.



వరదముంపును చోద్యంగా చూస్తున్న నగరవాసులు.



…టలలో దాదాపు 1500 గుడిసెలు నీటివరదలవల్ల యిలా మునిగి
…ండి సామగ్రిని బయటికి తీస్తున్న దృశ్యము.



ఆ యా ఇళ్లవారు కొంతమంది తమ సామానులను ఈ విధంగా ఇవతలకు చేరవేసుకోగలిగారు.




# కానుక

రచన : శ్రీ మహీధరనళినీ మోహన్‌రావు

పూర్వకాలంలో ఒకఊళ్లో "ప్రభాకర భట్టు" అనే గొప్ప సంస్కృతపండితు డొక డుండేవాడు. ఆ పండితుడు అనేక రాజాస్థానాలకు వెళ్ళి, అక్కడ పండితుల నందర్నీ వాదంలో ఓడించి, తనంతవాడు లేడని గొప్ప కీర్తి తెచ్చుకున్నాడు. ఆ ప్రభాకరభట్టుకి "సురేంద్రభట్టు" అనే కొడు కున్నాడు. ఆ సురేంద్రభట్టు చిన్నప్పటినుంచీ అల్లరి పిల్లలతో తిరిగి, చదువుసంధ్యలు లేక అల్లరిచిల్లరిగా ఉండేవాడు. కొన్నాళ్లికి పెద్దవా డయ్యాడు.

ఒక రోజున ప్రభాకరభట్టు కొడుకును పిలిచి నాయనా! నేను ముసలివాడి నయాను. నువ్వుకూడా పెద్దవాడ వయావు. ఏదో నాలుగు ముక్కలు నేర్చుకుని, వృద్ధిలోకి వస్తావనుకున్నాను. ఇంతవరకూ నీకు ఒక్క అక్షరంముక్కయినా రాలేదు. నేను ఎన్నిసార్లో చదువు చెప్తాను రమ్మంటే వినకుండా ఇష్టంవచ్చినట్లు తిరిగేవు. చదువు రానివాడు ప్రపంచకంలో చిల్లిగవ్వకు కూడా పనికిరాడు. నిన్ను చూపెట్టి "భట్టుగారి అబ్బాయి రా వీడు" అని ఎవరైనా అంటూంటే నాకు కూడా సిగ్గుగా ఉంది. ఛీఛీ! ఇల్లాంటి వాడి మొహం చూడకూడదు. అని గట్టిగా చీవాట్లు పెట్టేడు. సురేంద్రభట్టు ఎంత చదువు రాని మొద్దైనా ఈ మాటలు వినేటప్పటికి అభిమానం వచ్చింది. ఛీఛీ! ఇంక ఈ ఇంట్లో ఒక నిమిషం ఉండకూడదు. కాశీలో గొప్ప గొప్ప పండితు లుంటారుట. వాళ్లదగ్గిరికి వెళ్లి, సంస్కృతం చదువుకుని, గొప్ప పండితుణ్ణయికాని మళ్ళీ ఈ గడప తొక్కను." అనుకున్నాడు.

ఆ సాయంత్రమే సురేంద్రభట్టు తనకు కావలసిన బట్టలన్నీ ఒక చిన్న సంచీలో పెట్టుకున్నాడు. ఆ రాత్రి వీధి అరుగుమీదే పడుక్కున్నాడు. అర్ధరాత్రి ఐంది. అందరూ గుర్రుపెట్టి నిద్దరపోతున్నారు. సురేంద్రభట్టు లేచి, తన సంచీ పుచ్చుకుని, మెల్లిగా పిల్లిలాగ వీధిలోకి వెళ్ళిపోయాడు.

ఆ కాలంలో ఇప్పటిలాగ కార్లూ, రైళ్లూ, విమానాలూ అవీ లేవు. ఎంత దూరమైనా కాలినడకనే వెళ్ళేవారు. మన సురేంద్రభట్టు కూడా అల్లాగే నడక ప్రారంభించాడు. సాయంత్రానికి ఏదో ఒక ఊరు చేరుకోవడం, ఎవరి ఇంట్లోనో కాస్తభోజనం చెయ్యడం. రాత్రి ఎవరిఅరుగుమీదో అంగోస్త్రం పరుచుకుని పడుకోవడం. మళ్ళీ తెల్లారకట్టే బయలుదేరడం. ఇల్లాగ నాలుగైదు నెలలకి కాశీ చేరుకున్నాడు సురేంద్రభట్టు.

ఇంక కాశీలో సురేంద్రభట్టు మహాశ్రమపడ్డాడు. కనిపించిన పండితుడిదగ్గిరికల్లా వెళ్లి, "సంస్కృతంలో పండితుడైపోడానికి ఎన్నాళ్లు చదువుకోవాలండీ?" అని అడిగేవాడు. "సుమారు ఎనిమిదిపళ్లేనా చదువుకోవాలి" అని వాళ్లు జవాబుచెప్పేవారు. వెంటనే భట్టు "అయ్యబాబోయ్! ఎనిమిదేళ్లే!" అని హడిలిపోయి వెళ్ళిపోయేవాడు. ఇల్లాగ తెగ తిరిగేడు. తిరగ్గాతిరగ్గా భట్టు అదృష్టమా అంటూ కొన్నాళ్లకి ఒక పండితుడు కనపడి సురేంద్రభట్టుతో "శతశ్లోకేన పండితః" అని పెద్ద లన్నారు కనుక నూరు శ్లోకాలు చదువుకుంటే చాలు. పండితుడి వైపోతావు" అన్నాడు. అబ్బా! నూరు శ్లోకాలే?" అని పెదవి విరిచేడు భట్టు. అప్పుడు భట్టుఅవస్థ చూచి ఆ పండితుడు మళ్లీ ఇల్లా అన్నాడు. "చతుశ్లోకేన పండితః" అనికూడా చెప్తూ ఉంటారు. కనుక నాలుగు శ్లోకాలు టీకాతాత్పర్యసహితంగా చదివేవంటే పండితుడివైపోతావు! ఈ మాటలు వినేటప్పటికి భట్టుకి సంతోషం కలిగింది. "ఎల్లాగో కష్టపడి ఆ నాలుగుశ్లోకాలూ వల్లించేస్తే పండితుడి నయి పోవచ్చు" అనుకున్నాడు. అప్పటినుంచీ ఆ పండితుడి దగ్గరే చదువుకోవడం మొదలు పెట్టేడు.

నాలుగునెల లయేటప్పటికి మహాకష్టంమీద నాలుగుశ్లోకాలు కంఠతా పట్టించేడు. ఇంక పండితుణ్ణయిపోయాను గదా అని మహాసంతోషపడిపోయి, గురువుగారివద్ద సెలవుతీసుకుని ఇంటికి బయల్దేరేడు.

అల్లా కొంతదూరం నడిచేటప్పటికి దారిలో చచ్చి పడిఉన్న గాడిద ఒకటి కనపడింది. దాన్ని చూచేటప్పటికి "అనాథప్రేతసంస్కారాత్ కోటియజ్ఞఫలం లభేత్" అని తను చదువుకున్న మొదటి శ్లోకం జ్ఞాపకం వచ్చింది. అంటే దిక్కులేనివాళ్ల శవాలను దహనం చేస్తే కోటియజ్ఞాలు చేసినంత ఫలం వస్తుంది అని అర్థం. అందుచేత ఆ దిక్కులేని గాడిద మీద దయపుట్టింది భట్టుకి. దానిని ఏ స్మశానంలోనికేనా తీసుకవెళ్లి దహనంచేద్దా మని ఆగాడిదపీకకి తాడు కట్టి లాక్కొనివెళ్లడం మొదలుపెట్టేడు. కొంతదూరం వెళ్లేటప్పటికి ఆ గాడిద చాలా బరువుగా ఉన్నట్టు తోచింది. లాక్కెళ్లడం చాలా కష్టంగా ఉంది. వెంటనే చటుక్కున "సర్వస్య గాత్రస్య శిరః ప్రధానం" అని తను చదువుకున్న రెండో శ్లోకం జ్ఞాపకంవచ్చింది. అంటే శరీరంఅంతలోనూ తలకాయ ముఖ్యమైన దని అర్థం. అందుకని "ఈ శవాన్నంతనీ మోసుకెళ్లడం ఎందుకూ? ముఖ్యమైన తలకాయను తీసుకెళ్లి దహనంచేస్తే సరిపోతుంది" అనుకున్నాడు. వెంటనే ఆ పక్కనే ఉన్న గరిగమ్మని తీసుకువచ్చి ఆ గాడిదమెడ పరపరా కోసేసేడు. ఆ తలకాయను నెత్తిమీద పెట్టుకుని మళ్ళీ నడక ప్రారంభించేడు. మరికొంతదూరం వెళ్లేటప్పటికి ఆ తలకాయ కూడా బరువుగానే కనిపించింది. అప్పుడు తను చదువుకున్న "పంచేంద్రియాణాం నయనం ప్రధానం" అన్న మూడో శ్లోకం జ్ఞాపకంవచ్చింది. అంటే ఐదు ఇంద్రియాలలోకీ కళ్లు ముఖ్యమైనవి అని అర్థం. "ఈ తలకాయనంతనూ మోసుకెళ్లడంకన్న ఈ కళ్లు రెండూ పట్టుకెళ్లి దహనం చెయ్యడం మంచిది." అనుకొని, ఆ గాడిదకళ్లు ఊడపీకేడు. వెంటనే రెండు గుడ్లూ ముంజికళ్లల్లాగ చేతులోకి ఊడివచ్చాయి. ఆ రెండు గుడ్లనీ చేత్తో పట్టుకుని మళ్లీ బయలు దేరేడు.

కొంతదూరం వెళ్లేటప్పటికి ఒక ఊరు వచ్చింది. ఆ ఊరిని ఒక రాజు పాలిస్తున్నాడు. ఆ రాజు పండితులనీ, కవులనీ పోషించేవాడు. అందుకని "ఆ రాజు దగ్గిర తన సంస్కృతపాండిత్యం చూపెడితే ఏదేనా ముట్టుతుం"దని ఆశపడి, ఆ రాజుగారిదగ్గరకు బయలుదేరేడు. రాజుగారిదగ్గరకు వెళ్లేటప్పుడు ఉట్టిచేతుల్తో వెడితే బాగుండదని తను కాశీనుంచి తెసుకువచ్చిన గాడిదగుడ్లని రాజుగారికి కానుకగా ఇద్దా మనుకుని, గుడ్లని పట్టుకెళ్లేడు.

మన సురేంద్రభట్టు మెల్లిగా కోటకుచేరుకుని, రాజుగారి ఆస్థానంలోకి వచ్చాడు. ఆ రాజుగారు ధగధగా మెరిసిపోతున్న మణులు పొదిగిన బంగారపు సింహాసనంమీద కూర్చున్నారు. పక్కని మంత్రి కూర్చున్నాడు. ఒక వైపున పండితులూ, ఒకవైపున కవులూ కూర్చుని ఉన్నారు సురేంద్రభట్టు గాడిద గుడ్లు పుచ్చుకుని, రాజుగారికి సాష్టాంగ నమస్కారం చేసి, తను తెచ్చిన కానుక రాజుగారిదగ్గర పెట్టి, చేతులు కట్టుకుని నిలబడ్డాడు. రాజు భట్టును ఎగాదిగాచూసి "నువ్వు ఎవరు?" అని అడిగేడు. భట్టు మహావినయంగా "మహారాజా! నన్ను సురేంద్రభట్టు అంటారు. సంస్కృతంలో గొప్పపండితుడైన ప్రభాకరభట్టు మా తండ్రి. నేను కాశీలో చదువుకుని సంస్కృతంలో పాండిత్యం సంపాదించాను. ఏలినవారి త్యాగగుణం, కవిపండితపోషణా విని తమ దర్శనంకోసం వచ్చాను." అని చెప్పేడు. రాజుగారికి భట్టు తెచ్చిన కానుక ఏమిటో అర్థంకాలేదు. అందుకని "అవి ఏమిటి?" అని భట్టుని అడిగేడు. వెంటనే భట్టు "అవి గాడిద గుడ్లండి. కాశీనుండి ఎంతో అపురూపంగా తీసుకువచ్చానండి" అన్నాడు. "గాడిదగుడ్లు" అన్నమాట వినేటప్పటికి తన్ను అవమానంచేస్తున్నా డని అనుమానం వేసింది రాజుకి. మళ్ళీ భట్టుని చూచి రాజు "నువ్వు ఏవేం చదువుకున్నావ్?" అన్నాడు. వెంటనే భట్టు తను చదువుకున్న నాలుగు శ్లోకాలు అప్పచెప్పేసేడు గుక్కతిరగకుండా. భట్టుని చూసి కవులూ, పండితులూ, రాజూ మంత్రీ అంతా ఫక్కున నవ్వేసేరు. రాజు భట్టుఅమాయకత్వాన్ని చూసి, కొంత డబ్బిచ్చి పంపించేసేడు.

---

బాలగేయం:

# కుక్క - కమ్మరి

శ్రీ పి. ఎస్. ఆర్. ఆంజనేయులు

కాయకష్టముతో భుక్తిగడపుకొనెడు
యొక్క కమ్మరి పెంచెను కుక్క నొకటి
అందమైనది మిక్కిలి నల్లని దది
దాని మిక్కిలి ప్రేమించు దాని నతడు.
ఎపుడు కమ్మరి సమ్మెట నెత్తి కొట్టి
కష్టపడుచుండు గొలిమిపై గ్రాగుచుండు
నట్టియెడ యూరి నూరక చుట్టివచ్చు
లేనిచో నిద్రపోవును లేకికుక్క.
కాని కమ్మరి వంటింటిలోని కేగి
తినుటకై యన్నమ్ము దీసికొనెడు వేళ
కెచటినుండియొ తాను వంటిల్లు చేరి
తోక యాడించు గంచము తొంగి [చూచు.
యొక్కనా డత డనె నవ్వి కుక్కతోడ;
"నిన్ను నెవ్వరు పిల్చినా రిపు డిచటికి?
నేను దినుతఱి జూచి నీ వేగుదెంతు
వైపులేకుండ బోయెదు పనిని జూచి.
కూడు దొరుకదు శ్రమపడకుండ నెపుడు
సోమరుల కీ జగంబున చోటు లేదు
ఎవ్వ డెపుడును గష్టించి చెమట నోడ్చు
నన్నమ్ము దిను నధికార మతనిదె
సుమి."

# అశోకుని బాల్యం

"శ్రీ నేమాని వీరభద్రరావు"

బాలలూ! మీలో చాలామంది అశోకుని గురించి చదువుకున్నారు. కాని అశోకుడు చిన్నతనంలో ఎలా వుండేవాడో మీలో చాలామందికి తెలియదు. పువ్వు పుట్టగానే వాసనబట్టి మంచి పువ్వో, చెడ్డపువ్వో చెప్పవచ్చునంటారే. అట్టి విధంగా అశోకుని గొప్పతనం చిన్నతనంలోనే గుర్తించడానికి అతని చేష్టలు ఏవిధంగా వున్నాయో యీ క్రింది కథ తెలుపుతుంది.

అశోకునికి ఐదు ఏళ్లు వచ్చాయి. తండ్రికి ముద్దుకొడుకు. అందరిపిల్లలతోను బడికి పంపితే కొడుక్కి ఏ చెడ్డ అలవాటులు అలవడతాయో అని భయపడి యింటివద్ద ఒక గురువును నియమించాడు. మహారాజుగురువుగారిని అశోకుడు "అమరజాల్" అని పిలిచేవాడు. గురువుగారు అశోకునికి పాఠాలు చెప్పి ఆఖరుకి ఒక కథ చెప్పేవారు. అశోకుడికి మీ అందరిలాగే కథలంటే ఎంతో ప్రేమ.

ఒకదినం అశోకుడు పాఠాలు బాగా చదివి "అమరజాల్", నేను యీదినం పాఠాలు బాగా చదివేనుగనుక చక్కని కథ చెప్పాలి అన్నాడు. గురువుగారు అతని మనస్థితి కనిపెట్టడానికి "అశోకా! ఒక గొర్రెలమందలో వుండే ఒక గొర్రెపిల్ల దారి తప్పిపోయి తల్లి కనబడక కంగారుపడి తిరుగుతుంది అది పడే బాధ చక్కని కథగా చెప్పనా" అన్నారు.

"నాకా కథ వద్దు" అన్నాడు అశోకుడు.

"పోనీలే, ఆ కథ చెప్పను. ఒక పిల్లి పిల్ల తన తోకను చూచి, ఎలుకేమో అని భ్రమపడి దానిని పట్టుకుందామన్న ప్రయత్నంతో గిర్రున తిరుగుతూంది. కాని ఎలుకను పట్టుకోలేకపోతూంది. దానిగురించి చక్కని కథ చెప్పనా?" అన్నారు.

"అమరజాల్! నాకు యిలాంటి కథ లక్కరలేదు. యుద్ధాలనుగురించి చెప్పండి" అన్నాడు అశోకుడు.

"అశోకా! నీకు ఎప్పుడూ యుద్ధాలంటే యింత ప్రేమ ఎందుకు? యుద్ధాలు ప్రజాక్షయకారణం నాయనా" అన్నారు గురువుగారు.

"అయినా సరే, మా తాత మా నాన్న ఏయే యుద్ధాలు చేశారో ఎవరిని ఎట్లా తరిమేరో నాకు చెప్పాలి" అని లేచి నిలబడిపోయాడు. గురువుగారు అశోకునిలో వుండే వుత్సాహం గుర్తించి, అతని తాత తండ్రుల యొక్క చర్యలు చక్కగా వర్ణించి చెప్పేవాడు. అశోకునికి, తను రాజ్యాం ఎప్పుడు ఏలటం సంభవిస్తుందో. తాను కూడా శత్రువుల్ని ఎప్పుడు భూమియొక్క అంచులవరకూ తరమటానికి గల అవకాశం ఎప్పుడు చిక్కుతుందో అని ఉవ్విళ్లూరుతున్నాడు.

అశోకుని తండ్రి చనిపోయినతరువాత అతడు సింహాసనం ఎక్కాడు. అతని చిరకాలవాంఛ తీరబోతూందేమో అన్నట్లుగా కలింగదేశీయులు కయ్యానికి కాలుదువ్వారు. అశోకుడు సైన్యాన్ని చేకూర్చాడు. ఒక్క హిందూదేశమేగాక ప్రపంచంలో ఏయే భాగాల్లో ఎన్నెన్ని గుఱ్ఱాలు ఏనుగులు లొట్టిపిట్టలు వున్నాయో అన్నింటిని అశోకుడు సమకూర్చాడా అనిపించేటట్లు వుంది. ఇక భటులకు లెక్కలేదు. ఆకాశంమీద ఎన్ని నక్షత్రాలు వున్నాయో అంతమంది భటులను సమకూర్చేడేమో అని ఆశ్చర్యపడక తప్పదు. అశోకుడు కళింగదేశంమీదకు గాదు, ప్రపంచాన్నే తనవశం చేసుకొనేటందుకు బయలుదేరాడా అని చూపరుల కనిపించక మానదు. ప్రతి యింట నున్న యువకుడు యుద్ధానికి బయలుదేరాడన్నమాటే. యింత సైన్యంతో అశోకుడు కళింగదేశాన్ని కలింగులని ఏమి చేశాడో వేరే వర్ణించి చెప్ప నక్కరలేదు.

ఎక్కడ చూచినా పీనుగుపెంటలే. సూర్యుడు యీ ఘోరదృశ్యాన్ని చూడలేనేమో అని త్వరగా యింటికి పోయి తలుపులు బిగించుకు కూర్చోడానికి తొందరపడుతూన్నట్లు అస్తమిస్తున్నాడు. ఎక్కడ విన్నా నక్కల అరుపులు, గాయములు తిన్నవారి మూలుగులు. అశోకుడు యిట్టి యుద్ధరంగంలోనుండి గుఱ్ఱంమీద స్వారీ చేస్తూ బయలుదేరాడు. గుఱ్ఱంనడక చూస్తే దాని ఆలోచనలు కూడా అట్టి మందస్థితిలో వున్నాయేమో అన్నట్లు వుంది. ఈ దృశ్యాలను చూడలేను అని అనుకుంటూందేమో అన్నట్లు తలవంచే నడుస్తూంది. అశోకుడిలో గుఱ్ఱంయొక్క పరిస్థితి ఒక వింతమార్పుని కలుగజేసింది. వెంటనే గుడారానికి వెళ్లిపోయాడు.

సైన్యాధిపతులు వచ్చి "ప్రభూ! యీదినం జయమంతా మనదే. రేపు ఏ భూమిపై దాడివెళ్లవలయునో శలవియ్యండి అని ఉత్సాహపూరితులై ప్రశ్నించారు.

"రేపటినుండి యుద్ధమే వద్దు. రేపు సూర్యోదయంతో, ఆదర్శపరిపాలనోదయం కావాలి" అన్నాడు అశోకుడు.

"ప్రభూ! యింతలో యింత మార్పేమి?" అని ఆశ్చర్యంతో అడిగేరు.

"అవును. నా రాజ్యంలో యుద్ధపరికరాలకు బదులు, కొడవలి, సుత్తి మొదలగు పనిముట్లకు నిరంతరం పనిగలగాలి. యుద్ధంలో గాయములుతిన్న వారి మూలుగులకు బదులు చంటిపిల్లల కిలకిల నవ్వులు వినబడాలి. పీనుగుపెంటలతో నిండిన యుద్ధభూములకు బదులు, పచ్చగా పండిన పొలాలు కావాలి. చంటిపిల్లఅయినా సరే, ఒంటరిగా, నిర్భయంగా వీధులవెంట తిరిగే వాతావరణం వుండాలి. జంతుహింస, మొదలే వుండకూడదు." అని దేశమంతా చాటింపించాడు.

దాని ఫలితమే, అశోకచక్రం మన కాంగ్రెసుజండామీదకు రావటం.

---

# నిజముమాట్లాడు దొంగ

శ్రీమతి బారు సరోజినీదేవి


ఒక ఊరిలో ఒక బీదవాడు వుండెను. అతనికి భూములుకాని, డబ్బుకాని ఏమి లేదు. అందుచేత అతను చాల కష్టముతో తన జీవితాన్ని గడుపుతున్నాడు. అతనికి కడుపునిండ తిండి దొరుకుటకు ఎటువంటి ఉపాయము తెలియుటలేదు. అందుచేత దొంగతనము చేయుట మొదలుపెట్టెను. దొంగతనముచేత అతనికి చాల ధనము దొరుకుతోంది కాని అతని మనస్సునకు సంతోషము లేదు.

ఒకరోజు అతను ఒక సాధువును కలుసుకొన్నాడు. తన కథ అంతా ఆ సాధువుతో చెప్పాడు. నీవు అబద్ధము చెప్పకుండగా వున్నట్లయితే భగవంతుడు నీకు మేలుచేస్తాడని సాధువు చెప్పెను. మహాత్మా నేను దొంగను, నిజము చెప్పినట్లయితే నా కడుపు ఏ విధముగా నిండుతుంది. సాధువు అనెను: దాని చింత నీకు వద్దు. భగవంతునిమీద ఆధారపడి వుండు. అతను నీకు మేలు చేస్తాడు. ఆ రోజునుండి దొంగ నిజము మాట్లాడుటకు నిశ్చయించుకొనెను.

ఒకరోజు రాత్రి దొంగ దొంగతనానికి బయలుదేరెను. త్రోవలో అతనిని ఒక మనుష్యుడు కలిసికొనెను. సోదరా! నీవు ఎవరివి? ఎక్కడకు వెళ్లుచున్నావు? ఆ మనుష్యుడు అడిగెను. దొంగ చాల సందిగ్ధావస్థలో పడెను. కాని అతను ఎల్లప్పుడు నిజము మాట్లాడుటకు నిశ్చయించుకొనెను. అందుచేత అతను ఆ మనుష్యునితో చెప్పెను. నేనుదొంగను. రాజుగారి యింటికి దొంగతనానికి వెళ్లుచున్నాను. దొంగమాట విని ఆ మనుష్యుడు చాల ఆశ్చర్యపోయాడు. అతను ఆలోచించసాగెను. ఇతను ఎటువంటి దొంగ? తన మాటను దాచకుండగా పూర్తిగా చెప్పేసాడే! నేను కూడ నీతో వస్తానని ఆ మనుష్యుడు అనెను. ఇద్దరు కలసి రాజుగారి యిల్లు చేరారు. యిద్దరు కలసి దొంగతనము చేసి ఆ వచ్చినది చెరిసగము పంచుకొనుటకు నిశ్చయించుకొన్నారు. ఈ రెండవ మనుష్యుడు రాజు అని దొంగకు తెలియదు. రాజు వేషము మార్చి పట్నముయొక్క స్థితిని తెలుసుకొనుటకొరకు తిరుగుచుండెను రాజుగారి యిల్లు చేరగానే దొంగ లోపలకు వెళ్లాడు, రాజు బయట నిలబడివుండెను. దొంగ లోపలకి వెళ్లి చాల కష్టముతో ఒక పెట్టె తెరచాడు. అందులో మూడు రత్నాల హారము లున్నాయి. దొంగ రెండు హారాలు తీసుకొని ఒక హారము అందులో వదిలేసి బయటకు వచ్చాడు. బయటకు వచ్చి ఒక హారము రాజునకు యిచ్చి సోదరా! పెట్టెలో మూడు హారాలు వున్నాయి. కాని నేను రెండు హారాలు తెచ్చాను. మూడు హారాలు తెచ్చినట్లయితే మనము పంచుకొనుటకు వీలుండదని, దెబ్బలాటలు వస్తాయని చెప్పెను. తరువాత ఇద్దరు తమతమ యిండ్లకు వెళ్లిపోయిరి.

రెండవరోజు ధనాగారాధికారిని పిలిచి నిన్నరాత్రి దొంగతనము జరిగింది నీకు తెలుసునా? అని అడిగెను. వెళ్లి ఏమేమి పోయెనో చూడమనెను. కోశాధికారి కంగారుపడి వెళ్లి రత్నాల పెట్టె తెరిచి చూచెను. అందులో రెండు హారాలు లేవు. అది చూచేసరికి కోశాధికారియొక్క మనస్సులో దురాశ పుట్టింది. మూడవ హారము కూడ పోయింది అని చెప్పుటకు ఇది మంచి సమయమని అతను ఆలోచించెను. అతను ఇలా ఆలోచించి మూడవ హారము తీసుకొని జేబులో వుంచుకొని రాజుగారిదగ్గరకు వెళ్లి సర్కార్! పెట్టెలో మూడు హారములు లేవని చెప్పెను. కోశాధికారిమాట వినేసరికి రాజుకి చాల కోపము వచ్చింది. మూడవ హారము ఈ కోశాధికారియే దొంగతనము చేసివుంటాడని అతను అనుకొనెను. కోశాధికార్ని వెతకగా అతని జేబులో హారము దొరికింది. రాజు వెంటనే కోశాధికారిని తొలగించి ఆ స్థలములో దొంగను పిలిచి ధనాగారానికి అధికారిగా చేసెను.

---



# తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

౪౦

(సంపు. ౨ : పదం. ౧౮౭)

నాటరాగం - అట్టతాళం

[పల్లవి]

(౧) , పప మగమా గా మ | పధప పసే సనినీ | , ప పని సా , ని | పసా , ని పా పమరిస
తనకే డచదువులు తనకే డశాస్త్రాలు

(౨) గమ పప పమరిపసగ గమ | పధప పసేని సేనిరిసే సేనినీ | , ప సేని సేరీ రీ |
తనకే డచదువులు తనకే డ
సేనిపనిస్రీ సేనిపా పమరిస
శాస్త్రాలు

(౩) గమ పప సేనిపమరీ రి | గమ పధాప పసే సేనినీ | , పధ ధప ప సే సే ని సే రి రీ
తనకే డచదువులు తనకే డ
సమరీ సేనిపరీ సేనిపమ
శాస్త్రాలు

(౧) రీ గమ పధపా మపమా | రి రీ పమరి రిస | , సా సమ మగగా | మా , , , ,
మనసుచంచలబుద్ధి మానీనా

(౨) , గమ పధపని సనిపమ | రి రీ గమపని పమరీ | , సాసప పమమా మగగా
మనసుచంచలబుద్ధి మానీ
మపా , , పమరిస
నా

గమ (తనకేడ)

[చరణం]

(౧) , , ప పా మా | , మగ గమపమ రీ | , సస రి సా | సస ని సి సా సా
జడ్డుమానవుడు చదువ జదువ నాస

(౨) , , ప పా మా | పధ పసా , సేనిపమరీ | , సరి పమరీ రీ | సరిస ని సి సా సా
జడ్డుమానవుడు చదువ జదువ నాస
, , సరీ సా , గ | మరి గామా | , సస పా పమగమ | మపా , , ,
వడ్డివారు గాక వదలీనా

(౧) , , సే సేనిపా పనిమా | పనీ సాసా | నీ సేరి రీ | సేరిసే నినీ సాసా
సుడ్డికుక్కసంతకుబోయి తిరిగిన

(౨) , , స సేనిపా పమధప | పమ రి గమపనిసా | , నీ సేరి రీ | సమా మరి రీ
సుడ్డికుక్కసంతకుబోయి తిరిగిన

(౧) , , పని సేరీ , సా | , సేని పని నీ | , పని సా , ని పా , మ | పమరి సా , ,
దుడ్డుపెట్టెగాని దొరక్కీనా

(౨) గమ పని సేరీ , సా | , సేనినీ పమగమ పనీ , | , పని సా , ని పా , మ | గమపనిసే సే నిని ప పమ మరిస
దుడ్డుపెట్టెగాని దొరక్కీనా

గమ (తనకేల)

ఇట్లే క్రిందిచరణము :

(౨) దేవదూషకుడై - తిరిగేటి వానికి
దేవతంత్రము - తెలిసీనా ?
శ్రీ వెంకటేశ్వరు - సేవాపరుడు గాక
పావనమతియై పరగీనా ? (తనకేల)

లఘుటీక: ఈ పదమునకు రెండే చరణములు ముద్రితములు. తాళ్ళపాకవారి పదాల చరణసంఖ్య ప్రాయశః 3. విషయవిస్తరమును బట్టి ఎక్కువ చరణాలును ఉండవచ్చును. కాని మూటికంటే తక్కువ చరణా లుండేది అపురూపం. ఇందులో ఎక్కడనో పొరబా టున్నదేమో అని సందేహించవలసినంత క్వాచిత్కంగా ఒకటి రెండు పదా లిట్టివి ప్రకృతముద్రణములో నున్నవి.

జడ్డు=జడత్వము - సోమరితనము - అజ్ఞానము; వడ్డివారు=వర్ధిల్లును; దుడ్డుపెట్టెగాని=లావైన కఱ్ఱతోడి దెబ్బతప్ప; దైవతంత్రము=భగవంతుని లీల.

ముద్రితపాఠములు: మానెనా, వదలెనా-ఇత్యాది; దుడ్డుపెట్టె దైవదూషకుడు, దైవతంత్రము-రెండును యతిభంజకములగు రూపాలు.

## నాదిండ్ల అప్పన మంత్రి:

(10వ-పేజీ తరువాయి)

దక్షిణాభిముఖుండయిపోవుచు రావణుని ఖడ్గమున కాహుతిగా దన ఱెక్కలనిచ్చి నేలంగూలియున్న జటాయువువలన లంకాధిపతి సీతనపహరించిపోయె నన్న వార్త నిచట వినియుండుటచే నీ పర్వతమునకు 'విన్నకొండ' యను పేరు వచ్చెనని యభిజ్ఞు లనుచుందురు. గ్రామము నంటిపట్టికొని కొండ కలదు. దీని కుడిప్రక్కభాగమున నొక వీరాంజనేయవిగ్రహ మున్నది. ఆ స్వామిని నంటి యాంజనేయస్వామి యని పిలుచుచుందురు. కొండపైన రామలింగేశ్వరస్వామి యాలయము, పెద్ద మండపము, రామగుండము, సీతగుండము, మంచినీటి దొనలు, తిరగ భావి, అనేక చిన్నచిన్న గుడులు,—కలవు. కొండక్రింద 'వినికొండ' గ్రామము కలదు.

ఈ దుర్గమును బరిపాలించుటకు నియమింపబడిన యప్పమంత్రి యార్వేల వంశవార్ధిపూర్ణచంద్రుం డని—

"పారదప్రభావిభాసిభవ్యకీర్తివాహినీ
పూరదానధూతదివ్యభూజరత్నకామగు
గ్వార యాఱువేలవంశవార్ధి పూర్ణచంద్రమా
సారబుద్ధిజాలనీతిశత్రుభూమిభృద్రమా!"

అను 'రాజశేఖర చరిత్ర' మందలి (ద్వి. ఆ. 187 ప.) సుగంధవృత్తము దెలుపుచున్నది. ఈ గ్రంథరచనానంతరము వ్రాయబడిన 'కృష్ణార్జున సంవాదము'న గల—

"అందు నప్పనమంత్రి యాచకలోక
మందారభూజసమానవైభవుడు
రాజశేఖరచరిత్రమున కధినాథు
డాజికిరీటి మహాభాగ్యయుతుడు
శ్రీయశోనిత్యుండు............"

అను వాక్యము లప్పనమంత్రి యాచకలోకమందారభూజసమానవైభవు డనియు, ఆజికిరీటిమహాభాగ్యయుతు డనియు-దెలుపుచున్నవి. అంతియకాక సంస్కృతాంధ్రవాఙ్మయముల పెంపునకు గారణమ్మయి యనేకాగ్రహారముల ధర్మమొనర్చి తటాకారామాదివసతుల గల్పించి సత్పరిపాలనము నెఱపి ప్రజల కృతజ్ఞతకు భాజను లయిరని—

"శాకాబ్దే నవవహ్నివార్ధివసుధా
గణ్యేశ్వరే వత్సరే
సుక్షేత్రం వినికొండకుండిసరితో
ర్మధ్యే కియన్మాత్రతః
కృత్వా గ్రామవరం తటాకకలితం
చాప్పపురాఖ్యాన్వితం
ప్రాదాదంగడి గోపినాథహరయే
నాదిండ్లయప్పప్రభుః."

"అనంతగోపినాథాయ
కొంపిచర్లనివాసినే
ప్రాదాద్గోవరం గ్రామం
నాదిండ్లాప్పయమన్త్రిరాట్."

"మద్దిరాలపురిమాధవదేవై
వప్ర మప్రజలధీందుశకాంకే
పైడిమఱ్ఱు మదిశత్పరిపూర్ణం
గ్రామ మావసుధ మప్పయమంత్రీ."

"బ్రహ్మాగ్ని వేదశశిగణ్యశకేశ్వరేఽబ్దే
నాదిండ్లయప్పసచివో వినికొండదుర్గే
రామేశ్వరాయ ఘనమంటపవప్రసౌధాగ్
రమ్యాలయం సమతనోత్సుమతో రసజ్ఞః."

"శాకేశ (?) వహ్నినిగమేందుగదాత్మవర్షే
నాదిండ్లతిమ్మసచివాత్మభవాప్పయార్యః
ఓంకారనామ సరిదంతిక నందిపాటి
గ్రామే శివాలయ మనర్ఘ్య మసావకార్షీత్
.............................."

అను వాక్యము లవగతమొనర్చు చున్నవి. ఇతని వీరత్వమును—

"నాదిండ్ల నున్న రిపులకు
నే దండను నైన దిరుగ రెల్ల ధరిత్రిన్
ఏ దండనైన విజయము
నాదిండ్లయ్యన్న దండనాథాగ్రణికిన్."

అను పద్యము స్పష్టీకరించుచున్నది. ఇట్టి వీరవిక్రమాదిత్యునకు, బరిపాలనాదక్షునకు, దానికి, భాషాపోషకునకు, కృతిపతికి, బ్రజాహితైక తత్పరునకు, సుయశోవిరాజితునకు,—మ న్నమోవాకములు. ఇతడు నరసరాయని పేటకనతిదూరమున నున్న 'నాదిండ్ల' వాస్తవ్యుడు. నాదిండ్లవారే 'అన్నాప్రెగ్గడ' వారుగా మారిరని "కొండవీటి దండకవిలె" సాటుచున్నది.

# అదృష్టం

(11-వ పేజీ తరువాయి)

వానలూను. తాళంలేని ట్రంకుపెట్టె బంధులు తీని మాసుపెట్టె గూళ్లూ వెదికారు. నులకమంచం కింద కుండలలోనూ వెదికిచూచారు. కాని ఆ వస్తువెక్కడా కనిపించలేదు. తిరిగి వచ్చారు యిటికి పోలీసులు. నారాయుడూ! ఆ వస్తువెచ్చట దాచావో చెప్పు అని గద్దించాడు సబిన్సుపెక్టరు.

నారాయుడింకా ఆశ్చర్యపాటులోనే ఉన్నాడు. సబిన్సుపెక్టరుమాట అతనికి వినపడనే లేదు. అందుచేత జవాబే చెప్పలేదు.

తొందరపని ఉండి పొలం వెడుతున్న మాలెయ్య పోలీసులు నారాయుడింటికి వెళ్లారని తెలిసి పరుగెత్తుకువచ్చాడక్కడికి-సబిన్సుపెక్టరు ప్రశ్న మాలెయ్య విన్నాడు.

"బాబూ, మీ రధికారులు, చదువుకొన్నవారు, ఇల్లంతా వెదికిచూచారు. తెస్తే ఇంటిలోనే ఉంటుంది. ఇంకా వెదకండి. వాడినడిగితే ఏమి చెప్పతాడు పాపం? అన్నాడు.

అతని మాటలోని వ్యంగము గ్రహించి నారాయుడు మండిపడ్డాడు. ఏదో అనబోతూ ఉంటే మున్సబు శాంతివాక్కులతో ఉపశమింపజేశాడు. "ఇన్సుపెక్టరుగారూ వాడితోనేమి? చదువుసభ్యత ఎరుగని మూర్ఖుడు. పల్లెటూరివాడు. కాని మీ కనుమాన మెల్లాగ కలిగిందో కాని యీ నారాయుడంత పని చేసాడంటే నేనే కాదు యీ గ్రామంలో ఎవ్వరూ నమ్మరు. అతని నిర్దోషిత్వానికి మే మంతా పూచీ ఇస్తాము..."

"సరే మీరు చెప్పింది నిజమే కావచ్చు. కాని మా విధి మేము చేయవలసిందే" అని అంటూ ప్రక్కనేఉన్న అవులపాకలోకి వెళ్లాడు సబిన్సుపెక్టరు. ఒక మూల పిడకలు, చిట్టుసంచి పైన తాటాకుగొడుగు బోర్లించి ఉంది. గొడుగు కాలితో గెంటివేసాడు. పిడకలన్నీ చేతిలోని బెత్తంతో కదిపి చూచాడు. చూరులో, పెండెలలో నిదానించిచూచాడు. చివరకి చిట్టుసంచి దిమ్మరించాడు. అందులోనుంచి పడింది కాసుల పేరు.

కాసులపేరు చేతితో పట్టుకొని పాకలోనుంచి వచ్చాడు సబిన్సుపెక్టరు.

అక్కడి జనమంతా కాసులపేరు ఇనస్పెక్టరు గారి చేతిలో చూచారు. ప్రాణం నోట్లోకి వచ్చినట్లయింది. నారాయుడు, మాలెయ్యల ముఖాలు వెలవెలపోతున్నాయి. ఇంతవరకూ వర్ధనం ఏమీ మాట్లాడనే లేదు. కాసులపేరు చూడగానే — "పైకి అంతా పెద్దమనుష్యులే కబుర్లలో అందరూ సజ్జనులే! ఆచరణలో హృదయంలో మాత్రం......" మిగిలింది సబిన్సుపెక్టరు పూర్తిచేసాడు.

"అంతా కళ్మలమే. తెల్లటి మనసులలో రాక్షసులు, నవ్వుతూ ఉన్న మొగాలలో రక్తపాయులు ఉంటారు. మున్సబుగారూ! పాపం మీరంతా పూచీపడ్డారే. ఇదిగో పోయినవస్తువు మీరంతా అనుకొనే పెద్దమనిషిగోశాలలోనే దొరికింది. ఏమంటారు?" అంటూ హేళనగా నవ్వాడు.

మున్సబుకూడా దిగ్భ్రమచెందాడు. ఏమీ మాట్లాడలేకపోయాడు. మాలెయ్య ప్రభృతులు తెల్లబోయి మౌనముద్రదాల్చారు.

నిశ్చేష్టుడై నిలిచియున్న నారాయుడికి జవానులు అరదండాలు తగిలించారు. తీసుకుపోయారు. యజమానికి వచ్చిన అవస్థ చూచి భార్య గొల్లుమంది. విచారస్వరంతో ఆవు అంబే అంటూ అరచింది.

## ౬

నారాయుడిని తీసుకొని వెంకటాపురం వెళ్లిపోయారు పోలీసులు. ఓ గంట ఆగి గోవర్ధనం కూడా వెంకటాపురం వెళ్లాడు. గ్రామస్థులంతా మునసబింటివద్దకు చేరారు. ఆ పూట ఆ గ్రామంలో ఎవ్వరూ పొలం వెళ్లలేదు, భోజనం చెయ్యలేదు.

ఇదంతా వర్ధనం చేసిన పన్నాగమే. మొన్నటి విద్వేషం యీవిధంగా సాధించాడని అందరూ అనుకొన్నారు. అందరికి ఇదివరలో వర్ధనంమీద ఉండే కొస్త భక్తి, గౌరవం ఇప్పుడు నశించాయి. అతని అన్యాయవర్తనం, ఆత్మాతిశయమూ అందరూ తెలుసుకొన్నారు. ఎల్లాగయినా నారాయుడిని విడిపించి తీసుకురావాలని - ఇటువంటిపనులెప్పుడూ చెయ్యకుండా వర్ధనానికి పాఠం నేర్పాలని అంతా నిశ్చయించుకొన్నారు. కాని ఇందుకు డబ్బు కావాలి. న్యాయం, ధర్మం అంటూ చేతులుకట్టుకొని కూర్చుంటే పని జరగదు. గ్రామములోని అందరి ఆస్తి ప్రోగుచేసినా వర్ధనంతో పోటీ చెయ్యలేము. అయినా మన ప్రయత్నం మనం చెయ్యాలిగదా అన్నాడు మునసబు. మాలెయ్య గబగబా ఇంటికి పరుగెత్తుకొనివెళ్లి పెళ్లాం రెండుపుస్తెలూ పట్టుకువచ్చాడు. "మునసబూ, మనలో ధర్మం, దైవం, న్యాయం ఉంది. ఇదిగో నా చందా అంటూ రెండు పుస్తెలూ మునసబుచేతిలో పెట్టాడు. అందరూ చందాలు వేస్తున్నారు. కొన్ని వందలు వసూలయ్యాయి.

నారాయుడిని విడిపించుకునివచ్చిందాకా అన్నం, నీరు ముట్టుకోకూడదని అంతా ప్రతిజ్ఞ చేసుకొన్నారు. ఈ విషయంలో కావలసినవన్నీ చెయ్యడానికి మునసబుకి సర్వాధికారం ఇచ్చారు. వెంకటాపురం వెళ్లడానికందరూ సిద్ధమయ్యారు. సంగతి అంతా రంగమ్మకు తెలిసింది. నారాయుడు నిర్దోషి అని ఆమెమనస్సు గట్టిగా చెప్పతోంది. అయితే మరి ఆ వస్తువు నారాయుడి ఇంటిలోనే దొరికిందే?

బాగా తర్కించింది. ఆమె కొక ఆలోచన తట్టింది. స్థిరపరచుకొంది.

భర్త వేంకటాపురం వెళ్లాడని తెలిసింది రంగమ్మకి. పనిమనిషిచేత భోజనం పట్టించుకొని దొడ్డిగుమ్మందారిని ఆ ఎండలో నారాయుడి ఇంటికి వెళ్లింది. ఎవరో ఇద్దరుముగ్గురు ఆడవాళ్లు అక్కడ ఉన్నారు. బలవంతపెట్టి భోజనం చేయించింది. నారాయుడి భార్య, పిల్లలు తిన్నారు. మెల్లగా రంగమ్మ, "అమ్మా నీకు వచ్చిన యీ ఆపత్తుకు నేనే కారణం. నా కాసులపేరు పోవడంవల్లే నీకూ నీ భర్తకూ యీ అవస్థ వచ్చింది. నీ భర్త క్షేమంగా నీ యింటికి వస్తాడు. విచారించకు మని ఓదార్చింది, కౌగలించుకొంది. నీ కేమీ బెంగ, భయం వద్దు అని చాలాసేపక్కడ కూర్చుని ఇంటికి వచ్చివేసింది.

ఇంటికి తిరిగివచ్చింది రంగమ్మ. భర్త ఇంకా రాలేదు. ఆమెకు అనేకభావాలు కలుగుతున్నాయి. వాటిని కార్యరూపంలోకి తీసుకురావడ మెల్లాగ అని ఆమె పరిపరివిధాల యోచించింది. తన మగని అహంభావం, గర్వం తగ్గాలి. తోటిమానవులతో సోదరభావంతో ప్రవర్తించేట్లుగా చెయ్యాలంటే ఏది దారి?

సాయంత్రమయింది. రాత్రి ఎనిమిదిగంటలు దాటినతర్వాత వర్ధనం ఇంటికి తిరిగివచ్చాడు. భోజనంచేసి పడుకున్నాడు.

తనతో భర్త ఏమీ మాట్లాడలేదు. రంగమ్మ కెల్లాగో ఉంది. భోజనంచేసి భర్త పడుకొన్న గదిలోకి వెళ్లి చూచింది. మంచంమీద పడుకొని చుట్ట కాలుస్తూ ఉన్నాడు వర్ధనం. తనే పలకరించింది దగ్గరగా కుర్చీమీద కూర్చుని.

"అయితే నారాయుడిని ఏమి చేయించినట్లు? రిమాండులో పెట్టారా?

"ఊఁ" అన్నాడు ఈ అనవసరప్రసంగం నీ కెందుకన్నట్లు.

"కాని. నా కో సందేహం కలుగుతోంది..."

"ఒక్కటే కాదు నూటొక్కటి కలుగుతాయి నీకు."

"మీ మనస్సు సరిగ్గా లేదని నాకు తెలుసు. అయినా నా అనుమానం తీర్చాలి."

"ఏమి టది"

"కాసులపేరు నారాయుడే దొంగిలించాడని మీరు నమ్ముతున్నారా?"

నేనే కాదు. ప్రపంచమంతా. చోరీ వస్తువతని ఇంటిలోనే దొరికింది. ఇంకా సందేహ మెందుకు? అంటూ లేచి కూర్చున్నాడు."

"అపహరించిన ఆభరణం తనయింటిలోనే దాచుకొంటాడా ఎవ్వడేనా తెల్వితక్కువగా?"

"ఎందుకు కాకూడదు? తానెంతో మంచివాడని అంతా ఎరుగుదురు గనుక తనయింటి కెవ్వడు వచ్చి పరీక్షిస్తారనీ అనుకొన్నాడు."

"మొన్నటి ఘటన తరువాతకూడా?"

దుండగీళ్లకి భయం, భక్తీనా? మీ కెన్ని చెప్పండి. నేను నమ్మను.

"నే నింక చెప్పనే చెప్పను. నువ్వు నమ్మనూ వద్దు."

"కిట్టనివాళ్లు అతన్ని వంచించడానికి—"

"అర్థంలేని నీ ప్రసంగం కట్టిపెట్టు. లౌకికవ్యవహారాలు లక్ష ఉంటాయి. ఆడదానికన్నీ ఎల్లా అర్థమవుతాయి? అన్నాడా ప్రసంగమంతటితో మాన్పించాలని."

"అన్యాయంగా ఒకవ్యక్తి బాధపడుతూ ఉంటే చూచి ఊరుకోవడం మానవధర్మం కాదు. ఆ నిర్దోషిఆత్మ ఎంత ఘోషిస్తోందో, ఆ తాపం అందరికీ కీడు తెచ్చిపెడుతుంది. అమంగళం, అనర్థం కలిగిస్తుంది. ఎందుచేతనో నా హృదయం చాలా బాధపడుతూ ఉంది. నామాట వినండి. అతనిమీది కేసు తీసివేయండి. అన్యాయంకోసం పట్టుదల వహించేవాళ్లున్నారంటే న్యాయం - సత్యంకోసం అన్నింటికీ తెగించేవాళ్లూ లేకపోరు. గ్రామమంతా అతని పక్షం - నారాయుడికి శిక్షపడినా మనకు వచ్చేలాభం కన్న నష్టమే ఎక్కువగా ఉంటుంది. మనమింకీ ఊళ్లో కాపురం చెయ్యనేలేము. ఆలోచించండి. ఆత్మనాశనం కోరితెచ్చుకొనే ప్రవృత్తి మంచిది కాదు.

"వెళ్లు నాకు నిద్ర వస్తోందన్నాడు ఆమె మాటలకు సమాధానం చెప్పలేక - ఆమెచెప్పినట్లు నడుచుకోడానికి ఇష్టమూ లేక. "వెళ్లిపోతాను. కాని మా క్షేమంకోసం - మా సుఖంకోసం మీకూ-అల్లాగే మీ కుశలం-మీ గౌరవంకోసం నాకూ కర్తవ్యం ఉందని మరచిపోకండి - ఎవళ్ల కర్తవ్యం వాళ్లు - అంటూ వెళ్లిపోయింది. భార్యమాటలు గోవర్ధనం అంతగా పట్టించుకోలేదు. ఏదో ఆలోచిస్తూ నిద్రపోయాడు.

వారంరోజులైంది. గ్రామస్థులంతా నారాయుడిని జామీనుమీద విడుదల చేయించి తీసుకురావాలని విశ్వప్రయత్నం చేశారు. కాని లాభంలేక పోయింది. కారణం? వర్ధనం పట్టుదల - పట్టుదలకంటె ఎక్కువగా అతని ధనబలం. తనకున్న అపారశక్తిసామర్థ్యాలూ ఆఫీసర్లలో తనకున్న పలుకుబడీ ఎంత గొప్పవో చూపించాడు వర్ధనం గ్రామస్థులందరికీ. గ్రామస్థుల మాట విన్నవాడే లేడు. వాళ్ల ప్రయత్నాలొక్కటీ ఫలించలేదు. ఆఫీసర్లందరూ గోవర్ధనానికి దగ్గరిచుట్టాలే. గోవర్ధనానికి కాదు; అతని విత్తానికి. చంద్రగుప్తుడు - అశోకుడినాటి భారతదేశం కాదు. నైతికంగా భావపరివర్తనం జరగనంతవరకు న్యాయం ధర్మం గగనకుసుమాలే అనుకొన్నారు గ్రామస్థులంతా.

ముద్దాయితరఫు ప్లీడరు గట్టివాడే - గట్టిగానే వాదించాడు. వస్తువుతో పట్టుబడ్డ అపరాధి విషయంలో మొదటి రోజునే ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చాడు జడ్జి. దానికే యథార్థవాదం - యుక్తివాదం మార్పు తేలేకపోయింది. రంగస్వామి,వర్ధనం,అనుభవం చాలని లేతవయస్సుగల సబిన్సుపెక్టరూ కృతకార్యులయ్యారు. వాళ్ల ప్రజ్ఞ బాగా రాణించింది.

గ్రామస్థులందరికీ నిరుత్సాహం అధైర్యం కలిగింది. న్యాయదేవతను పట్టుకొని బండకత్తితో - వెండికత్తితో మెడ తరిగిస్తూ వే దానికి పైకి మాత్రం శిష్ట సమ్మతుల లోని సూత్రాలు బంగారుసూత్రాలు చుట్టబెట్టుతూ ఉండడం మాలెయ్య ప్రభృతులు స్పష్టంగా చూచారు. కాని ఎవరేమి చేస్తారు? గతాశులై - హతోత్సాహులై చ్యుతధైర్యులై - ఎదురు చూస్తున్నారు తీర్పుకోసం.

11 గంటలయింది. వర్ధనంవకీలు రంగస్వామి సబిన్సుపెక్టరు నాయుడు ఒక ప్రక్క కూర్చున్నారు. వాళ్ల నేత్రాలలో గర్వం, మదం, సంతోషం నిండి ఉన్నాయి. ఒక ప్రక్కగా ప్రేక్షకలోకం వ్యథితహృదయంతో - మినుకు మినుకు మంటూ ఉన్న ఆశాకిరణంతో కూర్చుని ఉంది. బోనులో చిన్నబుచ్చుకున్న మొగంతో నారాయుడు నిలబడి ఉన్నాడు.

జడ్జి తీర్పు చదువుతున్నాడు. అందరి చెవులు కన్నులయ్యాయి. కన్నులు చెవులయ్యాయి.

"నారాయుడు మహాసాహసికుడు; పట్టుదల గలవాడు. అర్ధరాత్రివేళ ఒక సంపన్న గృహస్థు ఇంటిలో దూరి చౌర్యం చేశాడు కనుక దోషి."

వీధిలో గుర్రంబండి ఆగినచప్పుడు. అంతా ఆవంకకు చూచారు. ఎవ్వరో ఒక వ్యక్తి గబగబా నడిచి జడ్జీపీఠాన్ని సమీపించాడు. జడ్జి ఇంకా చదువుతున్నాడు. "అపహృతాభరణం తన అవులపాకలో దాచుకొని పట్టుబడ్డాడు గనుక శిక్షార్హుడు."

అజ్ఞాతవ్యక్తి జడ్జికి నమస్కరించాడు.

"ప్రభూ, నేను ముద్దాయి న్యాయవాదిని."

"అయితే?"

"నా దొక చిన్న విజ్ఞప్తి"

ఆలోచించాడు జడ్జి. సరే రెండు మాటలలో నీ వాదం చెప్పివెయ్యాలి అని అన్నాడు.

ప్రేక్షకుల సర్వేంద్రియాలూ ఒక్కటై శ్రవణద్వయిలో చేరాయి వర్ధనం - రంగస్వామి కంగారుపడ్డారు. రంగస్వామి లేచి ఏదో చెప్పబోయాడుగాని జడ్జి వారించాడు.

"నీటిబోదెవద్ద జరిగిన పరాభవం తీర్చుకోడానికి స్వయంగా రాత్రి 12 గంటలకి గోవర్ధనం గారే కాసులపేరు పట్టుకొనివెళ్లి నారాయుడి దూడలపాకలో దాచి వచ్చాడు.

కనుకనే సబిన్సుపెక్టరుతో నారాయుడి దూడలపాక వెదకమన్నాడు.

"సబిన్సుపెక్టరూ ఏమంటావు?"

"సత్యం అన్నాడు సబిన్సుపెక్టరు. ఎందుకన్నానా అని తరువాత బాధపడ్డాడు వర్ధనం - రంగస్వామినాయుడి కేసి క్రోధంగా చూచాడు. అంతా బూడిదపాలు చేశాడని అజ్ఞాతవ్యక్తి మీద నిప్పులు క్రక్కుతున్నారు.


రాగం అపశ్రుతికి రావడం చూచి రంగస్వామి మెల్లగా అవతలకు జారాడు. డబ్బుతో పాటుగా సానుకూలమైన దనుకొన్న కార్యం విఫలమైపోయిందనుకుంటూ తలవంచుకొన్నాడు వర్ధనం. తన స్వైర విహారానికి కళ్లెం వేదనుకొన్న వర్ధనానికి శృంగభంగమయింది. ఎటువంటి వాళ్లనైనా జయించి విజయం సంపాదించిపెట్టే ఆయుధం మొరవోయిందని అతని కిప్పుడు తెలిసింది. నారాయుడు విడుదల చేయబడ్డాడు.

ఆరిపోనున్న ఆశాజ్యోతిని అఖండజ్యోతిగా చేసిన ఆ అజ్ఞాతవ్యక్తికోసం - అందరూ మాలెయ్య, రామన్న, మున్సబు, గ్రామస్థులూ అన్వేషించారు. అజ్ఞాతవ్యక్తి అదృశ్యమయ్యాడు.

గ్రామస్థులంతా నారాయుడిని కౌగలించుకొన్నారు. అందరి నేత్రాలలో ఆనంద బాష్పాలు చిందులాడుతున్నాయి.

# దిల్వారా దేవళములు - మౌంట్ ఆబూ

శ్రీ ఆకుండి వేంకటశాస్త్రి



దేవళము గోపురము లోకప్పున శిల్పసౌందర్యము

రాజపుత్రస్థానమున గల యెడారిమధ్యమునుండి లేచు పర్వతములలో 'ఆబూ' పర్వతమొకటి. ఈ పర్వతములు నేలమట్టమునుండి 5000 అడుగుల యెత్తు మొదలు 6000 అడుగుల వరకు ఎత్తుగలవిగా నున్నవి. ఈ పర్వతోపత్యకలన్నియు కన్నులపండువుగ ఆకుపచ్చని వనరాజితో విరాజిల్లుచుండును. ఈ పర్వతపార్శ్వములలో నదీనదములు వంకరటింకరగా ప్రవహించుచున్నవి. ఈ పర్వతశ్రేణిలోనే ఆబూ పర్వతరాజమని పేరెన్నికగనిన్న, ప్రాచీన చరిత్రలో అర్బుదపర్వతమని చెప్పబడునది కలదు. విష్ణుపురాణములో యీ అబూ (అర్బుద)... పర్వతమున కత్యంత పశ్చిమమున తత్ప్రాంత జాతులు, సౌరాష్ట్రులు, సూరులు, ఆభీరులు అర్బుదు లనియు.* పారియాత్ర పర్వతశ్రేణికి సమీపమున వాస మొనర్చుచుండిరని తెలుపబడినది.

* మహేంద్రో మలయస్సహ్య శ్శుక్తిమాన్ గంధమాదనః వింధ్యశ్చ పారియాత్రశ్చ సప్తైతే కులపర్వతాః 'ఆబూ' 'పారియాత్ర' అనాదుల పర్వత శ్రేణిలోనిది - త్రికాండశేషము.

టోలెమీ అను పాశ్చాత్యుడు తన భూగోళశాస్త్రమున ఆరావళీ పర్వతములను అందలి ఆబూ పర్వతమును గూర్చియు ప్రశంసను చేసెను. అతడు యీ పర్వతమును తన భాషలో 'అపోకోపీ' పర్వతము లని దేవతల శిక్ష అను నర్థమిచ్చెడి పదమును వాడెను.. ప్లినీ అను ప్రకృతి చరిత్రకారుడు-ప్రాచీన యాత్రికుడు మెగస్తెనీసు యీ పర్వతమును 'అపోకోపీ' అనగా పర్వత శ్రేణినుండి వేరుచేయబడినది అను నర్థమిచ్చెడి పదమును వాడెనని తనగ్రంథమున వాడినాడు.

మహాభారత మీ ఆబూపర్వతమును 'ఛిద్రము' అని పేర్కొన్నది. అనగా దేవత లా ప్రాంతపు జనులను వారుచేసిన దుష్కార్యములకు శిక్షించుట కిటుల ఆ పర్వతశ్రేణిని శిక్షారూపమున ఛిద్రమొనర్చినటుల పేర్కొనుచున్నది.

ఆబూపర్వతములోని శిలాశాసనములవలన ఆ ప్రదేశము జైనమతమునకు గొప్ప దుర్గముగ పరిణమించినట్లు కనబడుచున్నది. ఆ శిలాశాసనములలో అతిప్రాచీనమైనది A. D 671 వ సంవత్సరము నాటిది. ఆబూపర్వతములోని అత్యద్భుతమైన దేవళములు జైనులచే నిర్మింపబడినవి 1032 A.D లో విమలాసాహా అను వణిజశేఖరుడు కట్టిన దేవళము కలదు.

జైనమతప్రాబల్యము A.D 1320 సంవత్సరము వరకు గలదు. తరువాత శైవమతము విజృంభించినది.

మౌంట్ ఆబూనుగూర్చిన ఐతిహ్యముగు అద్భుత కథనమొకటి కలదు. అది యేమనగా అచటి దేవళములలో నొకదానిపై ఇటుల శిల్పమున చిత్రింపబడినదానినిబట్టి శివభక్తుడైన వసిష్ఠుడు హిమాలయమున కొంతకాలము నివసించినట్లును శంకరుని ఆ హిమవన్నగములో నొక ఖండమును నీ ఆబూపర్వతప్రాంతమున నుంపవలసినదని కోరగా శంకరు డటు లాతని ననుగ్రహింప నీ హిమవన్నగఖండము నీ 'ఆబూ' యిపుడున్నచోటున నుంచె నని యైతిహ్యము.

ఇంకను యిట్టి యైతిహ్యగాథాపరంపరవలన మౌంట్ ఆబూపర్వతము పవిత్రతమమైనదిగా కన్పట్టుచున్నది. ఇట్టి అద్భుతైతిహ్యగాథాలహరిచే యీ పర్వతము వింత రామణీయకత అలముకొని యున్నది. అచటి ఒక దేవాలయకుడ్యముపై పైపేర్కొన్న వసిష్ఠుని గాథ, శిల్పమున చిత్రితమైయున్నది. ఈ ప్రశాంత పర్వతమయప్రదేశమున దేవతలెల్ల సంచరించుచుందురనియు, యీ యచలగృహమునగల సరోవరాళిని వినోదవిహారముల జేయుచుందురని చెప్పుదురు. పర్వతపార్శ్వముల నున్న గుహాలలో ఋషులు తపస్సులు చేసికొందురనియు పర్వతశిఖరములపై దేవతలెల్ల మానవుల కదృశ్యులై విహరించుచుందురని జనులు నమ్ముదురు.

ఎల్లప్పుడును, జప, తప, సమాధినిష్ఠాగరిష్ఠులగు జైనమత తీర్థంకరులు ఆధునికకాలమున కూడ యీ మౌంట్ ఆబూ ప్రదేశమును తపోపుణ్యగ్రామిగ జేసికొనుచున్నారు.

ఆబూ పర్వతశిఖరముపైకి పోవుదుమేని, అచటనుండి పర్వతమునలుదిక్కులకును అత్యంతరామణీయక దృశ్యమును పర్వతోపత్యకదేశముగా పరిణామము నందినట్లు చూపట్టును. అచట 'నక్కి తలావు' లేక ముత్యపు చెఱువు అను నత్యంతమనోహరమైన సరోవరమును జైనులు తమకు పవిత్రతీర్థమునుగా నెన్నుకొని తెల్లని చలువరాలతో మనల నాశ్చర్యచకితుల గావించు శిల్పకళావైదగ్ధ్యమును ప్రకటించు దేవళముల నచట నిర్మించిరి.

దిల్వారాలో దేవళములను నిర్మించినవారు జైనులే. అవి A. D 1032 సంవత్సరమునాటివి. విమలాషాహా అనువణిజరాజు నిర్మించిన దేవళమే మొదటిది. అప్పటినుండి జైనమతము A. D 1320 లో అత్యుచ్ఛదశయం దుండెను. తదనంతరము శైవమతప్రాబల్యము హెచ్చినది. తరువాతవత్సరములలో జైన శిలాశాసనములు కన్పడుటలేదు. అనగా 15 వ శతాబ్దమువరకు శైవమే మిక్కిలి ప్రాముఖ్యదశయం దుండెను.

శైవమత ప్రాబల్యము A. D 1752 వరకు ఉండినట్లున్నది. A. D 1821 సంవత్సరపు ఒక శిలాశాసనమువలన సిరోహి నగరపు రాజా మహదేవ్ సింహ్ అనువారిచే 'అందలి దేవళములలో నొక శిథిలమైన దేవళము పునరుద్ధరింపబడినట్లు తెలియుచున్నది. ప్రయాణ సౌకర్యము లేర్పడిన ఆధునికకాలమున దిల్వారా దేవళములు పూజాదులకై పోవు యాత్రికులకు దుర్గమములుగానే యున్నవి. అట్లగుటకు కారణములు, దూరము, స్థానము, అనునవి. పాలితన, గిర్నార్ అను స్థలములకు సమీపములో నున్న ప్రదేశములలోగల కట్టడములు, వాని వైశాల్యత మొదలగు విషయములలో మౌంట్ ఆబూలోని వానిని మించజాలవు. జైనుల విజృంభణకాలమున ఆబూపర్వతము ఎన్నియో దేవళములతో విరాజిల్లుచుండినది. అచటి దేవళము లన్నిటిలో రెండింటితో మాత్రము కొన్ని గుణములలో హిందుదూదేశములోగల యే దేవళమును సరితూగజాలదు. ఆ దేవళములు పూర్తిగా తెల్లచలువరాలతో కట్టబడినవి. ఆ సమీపములో అనగా 300 మైళ్లలోపున తెల్లచలువరాతి గను లెక్కడను లేకపోయినను యిచట యిట్టి చలువరాలతో దేవళములు కట్టబడు టాశ్చర్యజనకమే.

దిల్వారా దేవళములన్నిటిలో ఒక్కటి తప్ప తక్కినవన్నియు శ్వేతాంబర తెగకు చెందిన జైనమతస్థులు నిర్మించినవే. శ్వేతాంబర తెగయన ఆ మతస్థులెల్లరు యెల్లప్పుడు తెల్లని వస్త్రముల ధరించుటయే శ్వేతాంబర జైనమత చిహ్నము. ఈ ప్రత్యేకమత చిహ్నముగల యీ మతస్థులచే నిర్మింపబడిన దేవాలయములు అందలి విగ్రహములు తెల్లని వస్త్రముల ధరించినటులను తెల్ల చలువరాలతో చేయబడియున్నవి. విగ్రహములకు కన్నులకు ప్రకాశమానమైన ఒక తెలుగు రాలు పొదివియున్నవి.

వారిలో రెండవ తెగవారు దిగంబరులు. వా రానాడు వివస్త్రులుగనే సంచరించుచుండిరి. కాని యిటీవల వారిని పోలీసువారు వివస్త్రులుగ తిరుగనీయనందున వారు చిన్నవస్త్రములనైనను ధరింపవలసినవా రగుచున్నారు. ఆ దిగంబర మతము విజృంభించిన కాలమున వారు దిగంబరులై విచ్చలవిడిగ తిరుగుచుండిరట.

జైనులు తమ మతములో ఉత్కృష్టులుగ నెన్నువారిని తీర్థంకరులని వారికి దైవత్వము నారోపించి వారి నధికభక్తి విశ్వాసాదులతో భజించుచుండిరి.

జైనుల దృష్టిలో దైవమునకంటె అధికులనియు అందుచే వారికే గుళ్లు గోపురములు కట్టి వారి నారాధించెడివారు. అందుచేతనే దిల్వారా దేవళముల పుంజములో మధ్యస్థానము నాక్రమించినవి. అవి యొక తీర్థంకరుని దేవళమే.

ఆబూ పర్వతముపై యీ దేవళముల సంపునకు దిల్వారా అని పేరెట్లు కల్గినదనగా దేవల్ వాడా - అను రెండుపదముల చేరిక. అనగా దేవళము లుండుచోటు. ఈ దేవళముల గుంపు మౌంట్ ఆబూ పర్వతమునకు $1\frac{1}{2}$ మైళ్ల దూరమున నున్నవి. ఇందు ప్రముఖస్థానము నాక్రమించినవి నాలుగు దేవళములు. అందు మొదటి దేవళములో అర్చింపబడు దైవము 'ఆదినాథ్' అనబడు మొదటి తీర్థంకరుడు. ఇతని చిహ్నమొక యెద్దు. ఐతిహ్యమేమన యీ తీర్థంకరుడు సువర్ణదేహచ్ఛాయ గలవాడనియు యీతడు పుట్టినపుడు ఆరునెలలకాలము వజ్రవైడూర్యాది ప్రకాశమానములైన శిలలవర్షము కురిసినదట. ఈతని తల్లి గర్భిణిగా నున్నప్పుడు దేవలోకమునందుండెడి కల్పవృక్షముల ఫలములను భుజించుచుండెడివారట. ఈ దేవాలయము హిందూదేవళములకు వలెనే శిఖరము కలిగియున్నది.

ఈదేవాలయములో మండపము కప్పు 48 స్తంభములపై మోపబడియున్నది. కప్పుభాగమున తెల్లచలువరాతితో కట్టబడి శిల్పకళావిభవమును చాటు పనితనము కలదు. చక్రాకారముగ నున్న కప్పునందు పదునారుమంది విద్యాధరులు చేతులు చేతులు కలిపి వలయముగ తిరుగు నృత్యభంగిమాకృతిల శిల్పచాతుర్యము వెల్లడింపబడినది.


ముఖమండపమున శిల్పచతురత మెఱయ నిర్మించిన 'తోరణమాల' కలదు. ఫెర్గూసన్ అను చరిత్రకారుడు అచటి దేవాలయములలో నొక 'డోము' లోపలి విద్యాధరీ 'నిర్వాణ' పంక్తి తెల్లచలువరాతిపై శిల్పము హిందూదేశములో నేదేవళమునను కన్పట్టదని తన చరిత్రలో వ్రాసెను. ఆ దేవళములలో 'పోర్టికో' లనబడు భాగములలో (సెల్సు) గదులవంటివానిలో (ఏబది) బౌద్ధవిహారములను పోలినవి... తీర్థంకరుల విగ్రహములుంచబడినవి. ఆయా గదుల వంటి వానికి కప్పుభాగమున "శత్రుంజయ" మాహాత్మ్యమునుండియు (ప్రముఖ జైనమత గ్రంథము). మరి యితరజైన ఇతిహాసికముల గాథలెల్లశిల్పచిత్రములై వెలసినవి. విష్ణువు యొక్క నాల్గవయవతారమైన నరసింహావతారము హిరణ్యకశిపుని చంపుచున్నట్లు చిత్రమొకటి అచటి దేవాలయపు డోము (కప్పు)లో చిత్రింపబడెను. ఎచట చూచినను గంధర్వులు, నెమలికన్నులు, దేవగాయక గాయనీ చిత్రములు శిల్పమున వెలసినవి.

ఈదేవాలయములలో నొక గదిలో నెమ్నాథ్ అను యిరువది రెండవ తీర్థంకరుని విగ్రహము కలదు. ఇతని చిహ్నము శంఖము. ఇది రాతిపై చెక్కబడినది. ఈ నెమ్నాథుడనువాడు సన్యాసి యగుటకు ముందు గొప్ప బలశాలి యని పేరొందెనట. ఈతడు శ్రీకృష్ణుని 'శార్ఙము' అను శంఖమును గంభీరఘోషముతో నూదెనట. ఆ ధ్వనికి 16 భువనములును దద్దరిల్లెనట. ఇంత బలిష్ఠుడయ్యు ఇతనికి నవనీతకోమలహృదయము కలదట. ఇతనికి పెండ్లికావలసిన దినమున పెండ్లి విందులకై అనేకములగు ఎద్దులు, గొఱ్ఱెలు మేకలు తోలుకొనిపోబడుచుండుట నితడు చూచెనట. అంతట యితడు వానిని చూడగనే అయ్యో! నా పెండ్లిపేరిట నెన్ని జీవరాసులు చంపబడుచున్నవి? అనుచు వానిపై జాలిగొని తాను పెండ్లిచేసికొనుటను మానుకొనిన మహాభూతదయాపరుడు. అతడు జీవహింసను మాన్పించి పెండ్లివిందులను మాన్పించి, తానుతుదకు సన్యసించి మౌంట్ 'గిర్నార్'కు పోయి యచట యతియై జీవితమును గడపెను.


ఒక దేవళములో 39 గదులలో పైపేర్కొన్న గాథలవంటి నెమ్నాథ్ జీవితగాథలు శిల్పమున మనోహరముగా చిత్రితములైనవి. జైనులకు నెమ్నాథ్ దైవతుల్యుడయ్యెను.

ఈ దేవళములన్నియు వెలుపలి భాగమున నేమియు ఆకర్షకముగను ప్రకటముగను కన్పట్టక నిగూఢముగ లోపలి భాగమున మనోహర దివ్యకళావైదగ్ధ్యముతో విరాజిల్లుచున్నవి. ఈ శిల్పముల దిలకించు వారల కేమితోచునన—ఇచటి శిల్పులింతింతనరాని తమ శిల్పకళానైపుణిని నీ దిల్వారాదేవళములలో నింకొక అపురూపమైన

(20-వ పేజీ చూడుడు)



దిల్వారా దేవళము లోపలి దృశ్యం.




# ఫిడేలు వాద్యము

## శ్రీ కొర్నెపాటి వెంకటేశ్వరరావు

సంగీతవాద్య విభాగములలో తంత్రీవాద్యములలో ముఖ్యమైనది ఫిడేలువాద్యము. ఇయ్యది పాశ్చాత్యులచే కనిపెట్టబడిన వాద్యమైనను కర్ణాటకసంగీతమున ప్రధానాగ్రముగను లక్ష్యలక్షణయుక్తముగను ప్రదర్శించుటకు అనువగువాద్యమగుటచే నిదియొక ప్రాముఖ్యమైన సంగీతవాద్యముగా హిందూదేశమునందు పరిగణింపబడుచున్నది.

ఇందుగల ముఖ్య విశేష మేనగా? ఇయ్యది కర్ణాటకసంగీతమునే గాక, హిందూస్థాని, పాశ్చాత్య సంగీతములను గూడ నోటితో పాడకుండా సోలోకచ్చేరి చేయుట కర్హమైనది.

దీనియొక్క ముఖ్యమైన ఉపయోగములు. హరికథలకు, గానకచ్చేరీలకు, సినిమాబాండ్ లెండ్సు మొదలగు వాటికి ప్రక్కవాద్యములకు గూడ నుపయోగింపదగిన వాద్యమగుటచే తంత్రీవాద్యములలో మిక్కిలి శ్రేష్ఠమగు సంగీతవాద్యముగా పరిగణింపబడుటకు తగియున్నది.

ఫిడేలుయొక్క పరిమాణముల వివరములు. యివి ముఖ్యముగా (3)మూడు విధములుగా నున్నవి. (1)సింగుసైజుగలవి (2) ముప్పాతిక (3/4)సైజుగలవి(3), అర్ధసైజుగలవి ½ ఇవిగాక (⅛)సైజుగలవి గూడ వుండును.

ఇవి అభ్యాసకుల వయస్సు లేక శరీరపరిమాణమును బట్టి ఆయాసైజుగల ఫిడేళ్లను నిర్ణయించి వుపయోగింపదగును.

ఫిడేలుయొక్క అన్ని భాగముల వివరము:—

"A" గుర్తుగల భాగమును తలలేక స్క్రోల్ అనియు, "B, B" గుర్తుగల భాగములను చెవులు (Pegs) అనియు, "C" గుర్తుగల భాగమును మెడ అనియు, "D" గుర్తుగల భాగమును వ్రేళ్లుత్రొక్కు చదునైనబల్ల అనియు, "E" గుర్తుగల భాగమును కీలు, లేక వంతెన అనియు "F, F" గుర్తుగల భాగములను ధ్వనినిచ్చు రంధ్రములు అనియు, "G" గుర్తుగల భాగమును నాలుక అనియు, "H" గుర్తుగల భాగమును బటన్ అనియు, "I" గుర్తుగల భాగమును నట్ అనియు. "G" గుర్తుగల భాగము క్రిందనున్న 4ను, తంత్రులు అనియు, "K, K" గుర్తుగల భాగమును అర్ధచంద్రాకారముగల ధ్వనినిచ్చు బల్ల అనియు, "L, L" గుర్తుగల భాగములు అర్ధచంద్రాకారముగలవంపు కలిగిన ఆర్చీలు అనియు, అడుగు భాగమును వెనుక భాగము అనియు, అర్ధచంద్రాకారము గల రెండు చెక్కల మధ్య ధ్వనినిచ్చు స్తంభము మొదలగునవి కలిగియుండును. వీటిని ఆయాసైజులను బట్టి తయారుచేయుదురు. చెక్కను బట్టి సౌండు మార్పు కలుగును.

ఫిడేళ్లను చేయుటకు ముఖ్యముగా ఉపయోగించుటకు పనస కర్రను, గాని, లేక ఏగిస కర్రనుగాని వుపయోగింతురు. ఇవి యిదివరలో పారసు దేశములలో తయారు అయిన ఫిడేళ్లు చాలా అత్యద్భుతముగా నాదమును, లేక ధ్వనిని కలిగియుండును. ఇటీవల వీనిని మన దేశములలో కూడా తయారుచేయుట ప్రారంభించిరి. ఇవి అంత నాదమును పోషింపలేవు. వీటిని తయారుచేయు కొయ్యముక్కలను మిషనుమీద పొరలు పొరలుగా తీసి, మెరుగు కాగితముతో తగిన పాలీషుచేసి తయారుచేయుదురు. మిగతా వస్తువులు కూడా మిషనుమీదనే తయారుచేసి బిగించుదురు.

కమానుయొక్క వివిధభాగముల వివరము:—

"A, A" గుర్తుగల భాగమును కర్ర అనియు "B" గుర్తుగల భాగమును నట్ అనియు, "C" గుర్తుగల భాగమును, సీల అనియు, "D" గుర్తుగల భాగమును వెంట్రుకలు అనియు, "E" గుర్తుగల భాగమును తల అనియు చెప్పుదురు.

తంత్రుల వివరములు:—

ఫిడేలు 4 తంత్రులు కలిగియుండును. అందు మొదటి తంత్రిని "మంద్ర" మనియు, రెండవ తంత్రిని "తగ్గపంచ"మనియు, 3వ, తంత్రిని "షడ్జము," లేక సారిణి అనియు, 4వ, తంత్రిని "పంచమ" మనియు చెప్పబడును. మొదటి తంత్రి పట్టు, లేక ఉక్కు మీద జల్తారుచే చుట్టబడియుండునది, లేక పట్టుమీద చుట్టబడిన తంత్రి మిగుల శ్రేష్ఠము. రెండవ, మూడవ, తంత్రులు, నరముతో చేయబడియుండును. నాలుగవ తంత్రి ఉక్కుతో చేయబడినది ఉపయోగింతురు. ఈ నాలుగు తంత్రులయొక్క బిగింపును, వ్రేళ్లయొక్క అనుకూలము ననుసరించి, తగ్గశ్రుతి యందు వుపయోగించువారలు ఎక్కువ మందముగల తంత్రులను, హెచ్చు శ్రుతియందు పయోగించువారలు తక్కువ మందముగల తంత్రులను ఏర్పరుచుకొనెదరు.

తంత్రులను వేయువిధము:— ఫిడేలుకు వేయు 4 తంత్రుల యొక్క మొదటికొనను పటమునందు జూపబడిన "G" గురుతు గల భాగమునందలి రంధ్రములకు ఎడమవైపునుండి వరుసగా చొప్పించి, క్రింద ముడివేసి రెండవ కొనను "E" గురుతుగల బ్రిడ్జీమీదుగా "B-B" గుర్తుగల 4 చెవులకు చుట్టి బిగింపవలెను.

తంత్రులను శ్రుతి చేయుటలో గల భేదములు:—

ఫిడేలుకు గల 4 తంత్రులలో మొదటి 3వ, తంత్రిని ఆధారశ్రుతి యగు మధ్య షడ్జముగను, 4వ తంత్రిని మధ్య పంచమముగను 2వ తంత్రిని మంద్రపంచమముగను 1వ, తంత్రిని మంద్ర షడ్జముగను శ్రుతి చేయవలెను. ఈ విధముగా పంచమ శ్రుతిని చేయవచ్చును.

పంచమశ్రుతిలోని 2వ, 4వ, తంత్రులను, మంద్రపంచమ మధ్యపంచమములను 1వ పూర్ణ స్వరము తగ్గించి చేయబడిన శ్రుతిని మధ్యమ శ్రుతి యని చెప్పుదురు.

వాద్యమునకు ఉపయోగించు సాధనము:—

ఫిడేలువాద్య మొనర్చుటకు కమాను, లేక విల్లు అనుసాధనము ఉపయోగింపవలెను. ఈ కమాను నిడుపాటి గుండ్రనైన చావగల సన్నని కర్రకు గుర్రపు వెంట్రుక లమర్చబడి యుండును. ఈ వెంట్రుకలను గరుకు చేయుటకు రజన్, లేక అరపూస అను సీమగుగ్గిలము నుపయోగింతురు.

కుడిచేతి యభ్యాసము:— విల్లు యొక్క మొదటికొనను కుడిచేతితో పట్టుకొని తంత్రుల మీద వెంట్రుకలంటియుండునటులను ముందుకు, వెనుకకు లాగుచున్న ఎడల ధ్వనిని కలిగింపచేయదగును.

ఎడమచేతి యభ్యాసము:—ఎడమ యొక్క వ్రేళ్లు ఆనుకొనునట్లు క్రిం కుడివైపుగా పైకిదీసి వ్రేళ్లను తంత్రులపై వంచి నిలుపవలెను. స్వరములను బలికించుటలో పంచమ శ్రుతియందుండునపుడు, మంద్రషడ్జ, మంద్ర పంచమ, మధ్య షడ్జ, మధ్యపంచమములను, మధ్యమశ్రుతియం దుండునపుడు, మంద్రపంచమ, మధ్యషడ్జ, మధ్యపంచమ, తారషడ్జములను, ఎడమచేతి వ్రేళ్లను తంత్రులపై నదుమకనే విల్లు సహాయముతో పైసర్వములను బలికింతురు. మరియు ఆగూతాళ, జాతి, కాలనియములందు గల పలువిధముల మార్పులకు విల్లు నుపయోగించుచు అభ్యసించెదరు.

*N-B*—ఇటీవల కొందరు ఫిడేళ్లకు 7తంత్రులను వేసి వాద్యమొనర్చుచున్నారు. ఇదియొక నవీనకల్పనావిశేషమని చెప్పకతప్పదు.

ఈ 7 తంత్రుల నుపయోగించు విధము:—

ఫిడేలుకు గల ముఖ్యమగు 4 తంత్రులలో 2వ, 3వ, 4వ, తంత్రుల నొక్కొక్క దానికి నదేరకమైన తంత్రిని మరియొకటి చేర్చి జంటగా జంటగా నుండునట్లు తంత్రులను వేయుదురు. అప్పుడు మొత్తము 1 + 2 + 2 + 2 = 7 తంత్రులగును.

ఇట్టి 7 తంత్రులు గలవాటిని సప్తతంత్రులు గల ఫిడేలు అందురు. ఇట్లు సప్తతంత్రులు వేయుటవలన విశేష మేమనగా 4 తంత్రులయందు బలుకు నాదముకంటె 7 తంత్రులయందు బలుకు నాదము రెట్టింపై వినుటకు గంభీరముగా వుండును. ఇదియొక్కటే సప్తతంత్రులు వేయుటయందు గల విశేషము.

కాని కర్ణాటకసంగీతమునకు 4 తంత్రుల వాద్యనాదమే సాంప్రదాయమని, శాస్త్రసమ్మతమని, మనదేశమందలి సుప్రసిద్ధ ఫిడేలిష్టులు అందరు 4 తంత్రులను మాత్రమే ఉపయోగించుచున్నారు.

# ప్రస్తుత విద్యావిధానము: ఉపాధ్యాయుల స్థితి

## శ్రీ విద్వాన్ బిట్రా భావనారాయణ

ఏనాడు భారతావని పరదాస్య శృంఖలల నుండి విముక్తి జెందితన యవమానపంకిలమును ప్రాక్ పశ్చిమ దక్షిణ సముద్రములలో క్షాళన మొనర్చెనో నాటినుండియు భారతీయులు స్వేచ్ఛావాయువుల పీల్చి పవిత్రాశయములతో దేశసౌభాగ్యమును గోరి సర్వమానవ సౌభ్రాతృత్వము జేకూర్చుట వారి విధియైయున్నది.

అధునాతనయుగము శరవేగమున విజ్ఞానవికాసమొందుచు ఖగోళమంతయు విద్యాధికుల కరతలమం దిమిడి యున్నట్లున్నది. ఏదేశము నాగరికత యైనను వాదేశమందలి విద్యావికాసముపైననే ఆధారపడియుండుననుట నిర్వివాదాంశము. ప్రపంచ చరిత్రలో భరతఖండము నూతన రూపురేఖలతో విరాజిల్లగలదనియు, విరాజిలుననియు సమస్తభారతీయులేగాక ఖండఖండాంతరవాసు లెల్లరు వాశించుచున్నారు. ఇట్టిమహోన్నతాశయములకు నిలయమై విశ్వకల్యాణము చేకూర్చగల స్వతంత్రభారతము తొలుత స్వస్వరూపమును జక్కదిద్దుకొనుట అత్యావశ్యకము.

భారతదేశ పరిపాలన నేడు స్వతంత్రభారత వీరుల హస్తగతమైయున్నది. ఇది ధర్మసమ్మతము. శాస్త్రీయము. దేశము. ప్రజలు, పాలకులు, నెల్లరు స్వతంత్రులే. కావున దేశాభ్యుదయమునకు ప్రశాంతవాతావరణము ప్రజల మానసిక ఆధ్యాత్మిక ఆనందములే మూలకారణములు. ఇట్టి యప్రతిమానసుఖానుభూతి దేశమునందలి విద్యాభివృద్ధిపైననే ఆధారపడియుండుననుట వేఱుగ జెప్పనక్కఱలేదు. అట్టియెడల అసంఖ్యాకములైన ప్రజల కావాసమగు భారతావనియం దెందరు విద్యాధికులు కావలయును? విద్యాధికుల నొనర్చు ఉపాధ్యాయు లెందఱు కావలయును? వారి స్థితిగతు లెట్లుండవలయు ననునదే తీరని సమస్య.

నేటి అర్థికదుస్థితికి లోనైన ఉపాధ్యాయుడు భారతదేశమునందు ప్రాచీనకాలము నుండి పారంపర్యముగ పూజింపబడుచున్న విద్యాపీఠమును, గురుస్థానమును, వీడకయే దాని గౌరవప్రపత్తుల కెట్టి భంగము వాటిల్లకయే తన ధర్మమును నెరవేర్చుచు తృప్తిచెందుచు తన పదవియే స్వర్గతుల్యముగ జూచుకొనుచున్నాడు. ఉపాధ్యాయుని బాధ్యతలలో సంబంధించని యే యంశమును దేశమునం దుండబోదు. ఇతడొక సృష్టికర్త. జ్ఞానభాస్కరుడు. అసిపంజరమును తీర్చి దిద్ది దానికి పుష్టినొసగి కుంజరశ్రేష్ఠముగ సంస్కరింపగల శిల్పి. రథికునకు జీవస్థానమగు సారథి. కుసుమకోమలహృదయముల వికసింపజేయగల దోహదకర్త. ఇతడు స్వయముగ నుపాధ్యాయుడే యయ్యు విద్యార్థులలో విద్యార్థియు గూడ నగును. కావున నేటిభారతావనిలో నుపాధ్యాయుని స్థితిగతుల పరామర్శించు బాధ్యత ప్రజాప్రభుత్వముపై నున్నది. ఇందులకు ప్రభుత్వమేగాక ప్రజలును సహకరించవలసియున్నది.

ప్రస్తుతము విద్యావిధానములో నూతనముగ విద్యాశాఖాధికారులవలన గొన్ని సంస్కారములు గావింపబడి వెనుకబడియున్న ఉపాధ్యాయులు ముందంజవేయుటకై కొన్ని పరీక్షల యవకాశము గలుగజేసిరి. ప్రాథమిక, మాధ్యమిక ఉపాధ్యాయులు, పారిశ్రామికశాఖోపాధ్యాయులు, మాతృభాషా ఉపాధ్యాయులు నీ పరీక్షల యవకాశ ఫలమును బొందగలరను ఆశయమే అందలి నియమము. ఈ యవకాశము కలుగజేసినందులకు విద్యాశాఖ మిక్కిలి యభినందనీయమనుటలో సందియ మెంతమాత్రమును లేదు. ఈ నియమము ఉపాధ్యాయులకును, పాఠశాలలో జదువు విద్యార్థులకును నొకరీతిగనే వర్తించునదై యున్నది. ఇట్టియెడ బోధనాబాధ్యత వహించు ఉపాధ్యాయుడు తగినంత విశ్రాంతి లేమి జేసి పరీక్షకై నిర్ణయింపబడియుండు అంశములన్నియు నొకేసారి పరీక్షలో గెలుపొందజాలకున్నాడు. మఱియు ఆర్థిక దుస్థితి యొకవైపున పాఠశాలాకార్యభారములు మఱియొకవైపున బాధించుచుండ నాతనికి ప్రశాంతవాతావరణమే లభింపదు. ఇట్టి కారణములచే తలకుమించిన పరీక్షగుసుముల జెల్లించి తత్ఫలమును బొందజాలకున్నాడు. కాబట్టి విద్యాశాఖవారు ఉపాధ్యాయుల పురోభివృద్ధి కాంక్షింతురేని ఒక్కొక్క యంశమును పరీక్షలో గెలుపొందినను ఉన్నత విద్యాభివృద్ధికి తగిన యవకాశము గల్పింపవలయును. అవకాశము సక్రమపద్ధతిలోనున్న, దాని సార్థకతస్పష్టము కాగలదు. అట్లు లేనియెడల పేరాసచే నుపాధ్యాయులు తలకుమించిన పరీక్షరుసుముల జెల్లించుచు ఫలితముల బొందజాలకే యుందురు. ఉత్తమ విద్యాధికులు, ఉన్నత విద్యాధికులు ఎందరో కావలసియున్న ప్రస్తుతపరిస్థితులలో ఇట్టి కఠోరనిర్బంధములు తొలగించి ఉపాధ్యాయుల కిచ్చిన సదవకాశమును విద్యాశాఖవారు సార్థకపరుతురుగాక!

మాతృభాషా ఉపాధ్యాయులు యోగ్యతగలిగినవారు కళాశాలలో మాతృభాషోపన్యాసకులుగా నియమింపబడవలయునన్న బి. ఓ. యల్ డిగ్రీ కలిగిన యోగ్యత యుండవలయునను యూనివర్సిటీ నిర్ణయము గలదు. ఇంతకుమున్ను విద్వాన్ యోగ్యతగలిగిన భాషా ఉపాధ్యాయులు సాహసించి బి. ఓ. యల్. పరీక్షలకు జదివి కృతార్థులగుచుండిరి. కాని యిటీవల అట్టి యోగ్యతలుగల భాషా ఉపాధ్యాయులు బి. ఓ. యల్. డిగ్రీ పరీక్షకు జదువవలయునన్న ఇంటర్మీడియేట్ బి. యస్. సి. ఇంగ్లీషుతోబాటు వారు లోగడ జదివి కృతార్థులైన విద్వాన్ పరీక్షలోని ఒక్కొక్క భాగము మరల ఆంగ్లభాషతోబాటు చదివి రెండును గెలుపొందవలయును. ఇది కేవలము నిరాదరణము. కళాశాలా విద్యకై పెనగులాడు భాషాఉపన్యాసకుల యుత్సాహము నరికట్టుటే. ఒకవైపున కళాశాలలో నీ విద్యావిధానమున్నను ప్రక్కదారికి కంటకభూయిష్ఠమైన మార్గమున సాహసించి గమ్యస్థానమును జేరదలచిన వారికీ నిర్బంధముల న్యాయదృష్టితో దొలగించి విద్యాశాఖవారు వారి పురోభివృద్ధిని గోరుదురుగాక!

# రూపాయి విదేశ విలువ తగ్గింపు

(7-పేజీ తరువాయి)

మతి చేసికొనరాదు. ఆ విధంగాకాని మన కేర్పడిన వ్యతిరేకవ్యాపారశేషాలను అనుకూలముగా మార్చుకొనలేము.

కాని ఇక్కడ ఇంకొక బాధ కూడా ఉంది. భారతదేశం ఎగుమతిచేసే వస్తువులు బహు కొద్దిగా ఉన్నాయి. అందులో చాలవరకు పంపబడుటలేదు. పంపబడినవాటిలో గూడ నాణ్యం తక్కువ; మోసమెక్కువ కనపడుటచే ఎగుమతులు పడిపోవుచున్నవి. ఇకపై ఎగుమతులధికంచేసికోవాలంటే కరెన్సీవిలువ తగ్గించబడటమే కాకుండా దేశంలోని వస్తువునాణ్యం కూడ బాగుపడేటట్లు చూసుకోవాలి. లేకపోతే ఇప్పుడు దెబ్బతింటే మళ్లీ తేరుకోడం చాల కష్టం.

ఈ చర్యవలన దేశంలోని జీవితప్రమాణములు (*cost of living*) అధికము కాకమానదు. కాని దేశాభివృద్ధే దేశీయుల ముఖ్యకర్తవ్యమైతే వ్యాపారస్తులు ఈ అదనుచూసుకుని లాభములు సంపాదింప ప్రయత్నింపక దేశముయొక్క కష్టసమయంలో స్వంతలాభం కొంత వారు మానుకుని ఎదుటివానికొరకు కూడ కష్టపడగల్గితే ఎట్టి స్పెక్యులేటివ్ చర్యలు సాగనీయకుండా ప్రభుత్వము త్వరలో తమ చట్టశక్తులద్వారా అదుపుచేయగల్గిన ఈ బాధను చాలవరకు నివారింపవచ్చును.

మన కింకనూ రెండుసమస్యలు రాకమానవు. ఒకటి మన స్టర్లింగు నిల్వల సమస్య. రెండవది మన పాకీస్తాన్ ఎగుమతి దిగుమతుల సమస్య.

ఈ విలువ తగ్గింపువలన మన స్టర్లింగునిల్వలు కొంత నష్టము కావలసిఉంటుంది. ఏలయన ఇదివరకటి పరిస్థితులలో 15 మిలియను పౌనుల స్టర్లింగ్ విడుదలద్వారా, మనకు 60 మిలియన్ డాలర్ల అమెరికన్ వస్తువులు లభ్యమగుచుండెను. అరవైమిలియన్ల డాలర్లు సంపాదించాలంటే ఇప్పుడు మనం కనీసం 20 మిలియన్ల పౌనులైనా బ్రిటను కివ్వాలి

కాని ప్రస్తుతపు ఒడంబడికలు మార్చుకొనిన గాని ఈ మార్పులు చేయుటకు వీలుండదు. అందుచే ఏటేట 5 మిలియన్ల స్టర్లింగ్‌లు అధికంగా, అన్యాయంగా భారతదేశం నష్టపడవలసి ఉంటుంది. ఆ నష్టము రాకుండా బ్రిటన్‌తో సంప్రదింపులు భారతదేశం జరుపుకొనకపోతే, బ్రిటిష్‌అతివాదులు విజయం పొందినవారవుతారు. ఎన్నినెలలనుండియో వారు స్టర్లింగ్ నిల్వల విలువను చాల తగ్గించివేయవలెనని (***Sealing down of Sterling balanees***) వాదించుచున్నారు. సౌజన్యస్వభావులగుటచే బ్రిటిష్ కార్మికప్రభుత్వ మిందుకు సమ్మతించలేదు. కాని ఈచర్యవలన వారు చేయకుండానే తటస్థించిన లాభానికి వారు కూడ తలయొగ్గి ఊరకుండవచ్చును. నష్టపోయేది భారతదేశం కనక పట్టుబట్టి ఒడంబడికల మార్పులకు ప్రయత్నించకపోతే దేశానికి నష్టం తప్పదు.

ఇక మన పాకీస్తానుసమస్య:—పాకీస్తాను తన రూపాయల విలువతగ్గించుకోలేదు. ఇతరస్టర్లింగ్ ప్రాంతాలన్నీ తగ్గించుకొన్నాక ఈవిలువలనావిధంగానే నిలబెట్టుకోగా వారి రూపాయికి ఒక అసహజమైన విలువ నిస్తుంది. (*unnatural over valuation*) భారతదేశంపైఉన్న ఉక్రోషం ఈవిధంగా కూడా ప్రతిబింబించింది. భారతదేశాన్నే విధంగానైనా నష్టపెట్టడం పాకీస్తానుకుసంతోషం. అందుకు తప్ప పాకీస్తాన్ ప్రభుత్వ మీచర్య తలపెట్టడానికి వీలుండదు. ఎందుకంటే పాకీస్తాన్‌నుండి భారతదేశం జనుపనార, ప్రత్తి, గోధుమ మొదలగువస్తువులను దిగుమతిచేసికొంటుంది. ఇప్పుడు మన కరెన్సీవిలువ తగ్గించినప్పుడు వారి కరెన్సీవిలువ తగ్గకపోతే మనము వస్తువులకోసం ఇదివరకు కన్న 30.5% హెచ్చు డబ్బు వారికి చెల్లించుకోవాలి. అంటే ఖర్చులుకూడ మనం స్టర్లింగునిల్వలలో చెల్లించుకోవాలన్నమాట. ఈచర్యవల్ల తాత్కాలికంగా పాకీస్తాను లాభం పొందగలదు. కాని కాలం గడచినతర్వాతనైనా తమ కరెన్సీవిలువ తగ్గించుకోక తప్పదు. జనుముధర హెచ్చుటచే కొంతకాలమువరకు మనమిల్లులు దెబ్బతినగలవు.

కాని ఈలోపుగా మన దేశంలోనే జనుపనార నుత్పత్తిచేయుటకు ప్రయత్నములు జరిపితే కొంత నష్టంతోటే బయటపడవచ్చును. మనకు కావలసిన ప్రత్తికూడ ఇకపై పాకీస్తానునుండి కాకుండా మనకువలెనే కరెన్సీవిలువ తగ్గించుకొన్న ఈజిప్టునుండి తెప్పించుకొంటే పాకీస్తాన్ తలపెట్టిన ఈ నష్టంనుండికూడా తప్పించుకోవచ్చును.

భారతదేశాన్ని నష్టపెట్టడానికే పాకీస్తాన్ ఈ చర్య తీసికొందనడానికి సందేహ మనవసరం. కాని త్వరలోనే వారి కరెన్సీ విలువకూడ తగ్గింపక తప్పదు. ఏలయన మామూలు పరిస్థితులలోనే అట్టి దేశాలకి విదేశవస్తువు లధికంగా రాగలవు. ఉత్పత్తి అధికమగుటకు బదులు నష్టము రాకపోదు. అంతటితో దేశములోని మూలధనములు విదేశములోనికి ప్రవహింపవలసివచ్చును. అప్పుడైనా పాకీస్తాన్ తన కరెన్సీవలువ తగ్గించుట తప్ప వేరు గత్యంతర ముండదు. కాని తాత్కాలికంగా భారతదేశానికి ఇందువల్ల కొంత నష్టం రావచ్చును.

బ్రిటన్‌లోవలెనే భారతదేశంలోగూడ చాల మందికి 30.5% విలువ తగ్గింపు ఆశ్చర్యంగా ఉంది. నిజానికి ఇంతటి రేటు అవసరంకూడా. లేకపోతే వచ్చే నష్టాలు చాలా వున్నాయి. కార్యదీక్ష పట్టుదల ప్రజాసేవాలక్ష్యాలుగా ఉంచుకొని గట్టిగా పనిచేసి దేశంలో ఉత్పత్తుల నధికం చేసికోవాలి. నాణ్యవంతమైన వస్తువుల నెగుమతి చెయ్యాలి. ఇంక కొద్దికాలం సౌఖ్యాభిలాషలను త్యాగంచేస్తే త్వరలోనే దేశంలో అనుకూలపరిస్థితు లేర్పడుతాయి. ప్రభుత్వము ద్రవ్యోల్బణము నరికట్టడానికి పనిచేస్తే దేశంలో వస్తువుల ధరల నరికట్టవచ్చును. జీవిత ప్రమాణముల నధికంగాకూడా కాపాడుకోవచ్చును. కొద్దిపాటి శ్రమతో త్వరలోనే దేశాన్ని స్వయం పోషకంగా చేసికోవచ్చును.

ఏ లాభము వచ్చినా దేశీయుల సహకారం సానుభూతి త్యాగశక్తులపై ఆధారపడిఉంటుంది. అదనుచూసి లాభం పొందకుండాఉంటే త్వరలోనే దేశం సౌభాగ్యవంత మవగలదు. మన దేశభక్తిని మన దైనికజీవితంలోని దినచర్యలలో చూపుకోవాలి.

---

# దిల్వారా దేవళములు మౌంట్ ఆబూ

(18-వ పేజీ తరువాయి)

దేవళము కలదు. దాని పేరు 'చావ్ ముఖీ' దేవళము. ఇదియే దేవళములన్నిటిలో వింతయైనది. జీవనాడి యనదగిన దేవళము. శిల్పులు అచ్చట దేవాగారములను కట్టుచుండెడి రోజులలో తమకు విరామము కల్గినపుడెల్ల కొంచెము కొంచెముగా తమశ్రమను వినియోగించి దేవాలయతనమును దేవునికే కానుకగాను అంకితముగాను ఉండుటకై కట్టిన గుడి యిది. ఈ దేవాలయమును చూతుమేని యీ గాథ నమ్మదగినట్లున్నది. ఎందుచేతనంటే దేవాలయశిల్పాదులను పరికింతుమేని యిందలి శిల్పము మాత్రము శిల్పులస్వేచ్ఛాధోరణీవిలసితముగా కన్పట్టుచున్నది. ఒకచోట దేవాలయపు 'డోము' భాగమున ఒక మామిడి కొమ్మ చిత్రింపబడినది. మొట్టమొదట దానివి చూచిన తోడనే ఆకుపచ్చరంగు పూయబడినట్లు కనపడును. కొమ్మనుండి ఆకులగుత్తి రాలి క్రింద పడుచున్నట్లు కనపడును. నిజముగా రంగు పూయబడలేదు. వర్షములు కురిసి కురిసి వర్షములు వెనుక బట్టిన తరువాత ఆరాతి ఆకులపై ఆకుపచ్చని నాచు బయలుదేరి అవి నిజమైన ఆకులవలెనే చూచువారలకు తోపజేయును.

'కలనల్‌టాడ్' అను మొట్టమొదట 1822 సంవత్సరమున మౌంట్ ఆబూలో కాలుపెట్టిన యైరోపాదేశస్థుడు "ఆబూ దేవళములలో యీ మామిడి కొమ్మచిత్రముగల దేవలమువంటి దేవళమును మరియొకటి రెండు యీ దేవళముల గుంపులో శిల్పమున సాటిలేనివని ఘంటాపథముగ చెప్పగలను..." అనెను. శిల్పసంపదా విభవము చూచి యానందింప గల్గుటకీ ఆబూ ఒక పుణ్యక్షేత్ర మని చెప్పవచ్చును.

# మహాత్ముని తత్వము

(8-వ పేజీ తరువాయి)

ఆత్మ పారిశుధ్యం లేనిదే, అహింసావ్రతాచరణ అసంభవమవుతుంది. హృదయనైర్మల్యంలేని వ్యక్తి దైవానుభూతిని పొందలేడు. ఆత్మపారిశుధ్యావశ్యకత మాత్రం జీవితంలోని వివిధ వృత్తులకూ వర్తిస్తుంది.

ఒక్కవ్యక్తి కి ఆత్మపరిశుభ్రతను సాధిస్తే అది ఇరుగుపొరుగుకు, పర్యవసానంగా సర్వత్రా వ్యాపిస్తుంది.ఐతే దీని సాధనమార్గం అతి కష్టభూయిష్ఠమైనది. మనసా,వాచా, కర్మణా ఏవిధమైన ఆగ్రహోద్రేకాలు పనికిరావు. కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలను అధిగమించాలి."

"ఏ విషయాన్నైనా రహస్యంగా వుంచడం మహాపాతక మని నా నమ్మకం. మనం చేసే ప్రతి చర్యను, మాట్లాడే ప్రతి మాటను భగవంతుడు ప్రత్యక్షంగా చూస్తూనే వున్నాడని గుర్తించినట్లయితే, ఈ ప్రపంచంలో ఎవరితోనూ ఏ విషయాన్నీ రహస్యంగా వుంచవలసిన అగత్యం లేదనే సంగతి బోధపడుతుంది. భగవంతుడి ఎదుట మనకు అపరిశుభ్ర భావాలు తోస్తవా? వాటిని ఉచ్చరించడానికి నోరు వస్తుందా? ఈ మనపనులకు రహస్యాన్ని, మరుగును కోరడం కూడా మానసిక అపరిశుభ్రత అనే చెప్పవలసి వస్తుంది. మురికిని, అపరిశుభ్రతను దాచి వుంచడం మానవప్రకృతి. అపరిశుభ్రతను చూడడానికి గాని, మురికిపదార్థాలను తాకడానికిగాని మన మనస్సు ఒప్పదు. అందువల్లనే వాటిని మన కళ్ళపడకుండా చేస్తాము. మనం మాట్లాడే భాష విషయంలో కూడా అంతే. ప్రపంచం ఏ దుర్భావాలను వినకూడ దని కోరుకుంటామో వాటి జోలికే మన మనస్సును పోనివ్వకూడదు.

మహాపాతకాలన్నీ రహస్యంగా జరిగేవే. మన చర్యలనేగాక, భావాలనుకూడా భగవంతుడు పరీక్షిస్తున్నాడని గ్రహించినప్పుడే మనకు ముక్తి......

---

# నాకబలి

(5-వ పేజీ తరువాయి)

ఇన్నాళ్ళూ, ఆమె పంచేంద్రియాలనుమాత్రమే అతనికి సౌఖ్యదాయినిగా చేసినట్లయింది. ఆ రాత్రి మలిజామున ఆ మెకౌగిలిలో పంచేంద్రియాలను మించిన అతీతస్వరూపాన్ని దేన్నో అతనికి సంపూర్ణంగా అర్పిస్తున్నంత ఆనందంలో అతన్ని ఓలలాడించింది. ఆ కౌగిలిలో ఆదమరిచి నిద్రపోబోతున్నాడు. ఆమె మెళుకువ తెప్పించింది. బలవంతంగా తెచ్చికొన్న మాటగా, విషాదహాసంతోనే ఆ శ్రుతికి అపశ్రుతిని ఉద్దేశపూర్వంగా కల్పిస్తూ, "శీను ఏమనుకొంటాడో, అక్కడికేపోదాం పద"అంది. ఆఅపశ్రుతికి ఇద్దరూ కంపించిపోయారు. తన మనసులోని "ఇది తుది సారి" అన్న భావనను అతనికి తెలియనీకుండా, దేహాన్ని వదిలిపోతున్న ప్రాణం తుదిసారి దేహాన్నంతనూ అలముకొన్నట్లు అతన్ని బిగ్గ కౌగలించుకొంది. ఆసంక్షోభంనుంచి తేరుకుని, అతన్ని ప్రశాంతంగా ముద్దుపెట్టుకొని ముందు చావడిలోకి నడిపించింది. శీను గాఢనిద్రలో ఉన్నాడు. రాఘవరావు ఆ ఆనందాన్ని నెమరేసుకొంటూ, నిద్రాభారంతో, తమ్ముని కివతలగా మేను వాల్చి నిద్రపోయాడు.

తెల్లవారి అన్నదమ్ము లిద్దరికీ ఒకసారే మెళకువ వచ్చింది.

"అన్నయ్యా! ఇవాళ వెళ్తాను." అన్నాడు శీను.

రాఘవరావు కళ్లు నులుముకొంటూ జవాబు చెప్పకుండా ఆలోచిస్తున్నాడు.

ఆమెతో కూడా చెప్పి వెళ్దామని శీను లోపలికి వెళ్లాడు.

"అన్నయ్యా! ఆమె ఏదీ!"

రాఘవరావు కలవరపాటుతో లేచి కూర్చున్నాడు. తన తలగడవద్ద, ఒక ఉత్తరం కంటపడింది.

"రాఘవా! ఆ ఉద్యోగంలో చేరవద్దు. నేను నా భర్తదగ్గరకు కాశీ వెళ్ళిపోతున్నాను. నన్ను మర్చిపో. శీనుతో కలిసి ఇంటికి వెళ్ళిపో. శీనుకు నా ఆశీర్వచనములు. ప్రభావతి."

క్రింద మళ్లీ తాజాకలం వ్రాసి ఉంది.

"ఈఇంటి అద్దెఅంతా నిన్ననే వాళ్లకిచ్చేశాను. ప్రొద్దున్నే కాళీచేసి ఇస్తామన్నాను. మనం కాళీచెయ్యవలసినవి కూడా ఏమీ లేవు. ప్రభావతి."

రాఘవరావు ఇంకా కలలోనుంచి తేరుకొంటూన్నట్లుగానే అనుకొంటున్నాడు. కాసేపటిక్రింద కాశీజీవితంలో "రాఘవా సెలవు" అంటూ ముద్దుతో వీడ్కోలిస్తున్నట్లు కలవచ్చినట్లయింది. ఆ వీడ్కోలు కలలో భాగం కాదని ఇప్పుడు తెలిసివచ్చింది.

అడావుడిగా రైలుస్టేషనుకు బయలుదేరాడు. శీను అన్నవెంటనే మాట్లాడకుండా నడుస్తున్నాడు. ప్లాటుఫారంమీద అడుగుపెట్టేటప్పటికి కలకత్తామెయిలు ప్లాటుఫారం విడిచిపోతోంది. ఆమె కిటికీలోనుంచి తనను చూస్తూ తన నుండి కదిలి దూరమైపోతోంది. రాఘవరావు మనస్సులో అనేకభావాలు ఒక్కక్షణంలో అల్లల్లాడాయి. "తన యింతటి త్యాగాన్ని కాలదన్ని తన్ను నీరసుడిగా జమకట్టి ఇల్లా వెళ్లిపోయిందన్న" కోపము, తక్కిన సర్వసంక్షోభాలకూ ప్రతీకారంగా మనస్సును నింపేసింది.

మాట్లాడక తల వంచేశాడు. దుఃఖమూ, కోపమూ కూడా మనస్సును కుమిలింపచేస్తున్నాయి.

ఒక్కసారి తల విదల్చుకొన్నాడు.

"శీనూ! మన రైలు ఎన్నింటికి?"-అని కటువుగా అడిగాడు.

శీను ఆమె పోయినవంకే చూస్తూ దీనంగా నిలబడివున్నాడు. అన్నపలుకులో కటుత్వానికి అదిరిపడి ఇటు చూశాడు. ఆమె చెప్పినట్లే అన్నయ్యను తీసుకెళ్తూన్నందుకు అతనికి ఆశ్చర్యం, విషాదంమాత్రమే కల్గుతున్నాయి.

---

# మనరాష్ట్రం మనదేశం:

(9-వ పేజీ తరువాయి)

ఆహారోత్పత్తి వృద్ధికార్యక్రమానికి భంగం కలుగుతున్నదట. గత మూడుమాసాలుగా కమ్యూనిస్టుల దౌర్జన్యం మితిమీరిం దన్నారు.

భారతప్రభుత్వం ఆంతరంగికశాఖ దేశంలో కమ్యూనిస్టుల చర్యల్ని గురించి ఒక కరపత్రం ప్రచురించింది. బెంగాల్, హైదరాబాద్, ఆంధ్రదేశాలలో కమ్యూనిస్టులు అరాచకం అశాంతి రెచ్చగొడుతున్నారని చెప్తూ ప్రభుత్వం అనేక వివరాలు ప్రచురించింది. ప్రజల్ని ప్రభుత్వంపైనా పోలీసులపైనా తిరగబడాలని హెచ్చరిస్తూ కమ్యూనిస్టులు ప్రచురించిన కరపత్రాల్లోని ముఖ్యాంశాలను ఈ కరపత్రంలో ప్రచురించారు.

కమ్యూనిస్టులు అరాచకం రెచ్చగొట్ట తలపెట్టిన విషయం కొత్త గాదు. అది అందరికీ తెలిసినదే. వారుకూడా తమ లక్ష్యాల్ని ఎన్నడూ గుప్తపరచలేదు. కమ్యూనిస్టుల దౌర్జన్యాల నణచవలసిన అవసరం ఎంతఉన్నదో, కమ్యూనిస్టుల నణచే పేరుతో అసాధారణాధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానానికి తావివ్వకుండా ప్రభుత్వం, పోలీసుశాఖ జాగ్రత్త వహించవలసిన అవసరం కూడా అంతే ఉన్నది. శాంతి రక్షణగాని శాంతిభంగంకాని తుదికి ప్రజల సానుభూతి .సహాయాలపైనే ఆధారపడి ఉంటాయి.

## ప్రపంచ బాంక్ ఋణం:

భారతదేశానికి రెండో ఋణం కోటిడాలర్లివ్వడానికి ప్రపంచబాంక్ నిర్ణయించింది. మధ్య ఇండియాలో దుబ్బుగడ్డితో నిండిఉన్న 30 లక్షల ఎకరాలను బాగుచేసి ఆహారోత్పత్తినిమిత్తం వినియోగించాలనే ఉద్దేశంతో భారతప్రభుత్వం ఋణం కోరింది. నిజానికి మధ్య ఇండియాలో దాదాపు 90 లక్షల ఎకరాల నేల ఈమాదిరి దుబ్బుగడ్డితో నిండి ఉంది. ప్రస్తుతం 30 లక్షల ఎకరాలనే బాగుచేసి దున్నడానికి ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. ప్రపంచబాంక్ ఋణంతో 375 పెద్ద ట్రాక్టర్లు ఇతర పరికరాలు అమెరికానుంచి దిగుమతిచేస్తారు. భూమిబాగుకు ఖర్చు చాలావరకు భారతప్రభుత్వమే భరిస్తుంది. ఈ కార్యక్రమంవల్ల నలభైలక్షలటన్నుల ఆహారం పండించవచ్చునని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అంటే మనదేశంలో ఆహారం కొరత చాలావరకు దీనితో తీరిపోగలదు. దీనివల్ల మన ఆర్థికసమస్య చాలావరకు పరిష్కారమై పోగలదని అంచనా వేస్తున్నారు. బాంకుఋణం 1952 జూన్ మొదలు 7 సంవత్సరాల్లో తీర్చవలసిఉంటుంది. వడ్డీ నూరింట $2\frac{1}{2}$ వంతులు. కమిషన్ నూరింట 1 వంతు.

## కాశ్మీరం:

కాశ్మీరసమస్యసందర్భంలో కమిషన్ ప్రతిపాదననీ, ట్రూమన్ అట్లీల విజ్ఞప్తుల్నీ భారత ప్రభుత్వం నిరాకరించింది.

భారత ప్రభుత్వ నిశ్చయానికి భారతదేశం, ముఖ్యంగా కాశ్మీర్ దేశవాసులు హర్షించారు. ఆజాద్ కాశ్మీర్ దళాల భవిష్యత్తునుగురించి వచ్చిన తగాదాలో ఐక్యరాజ్యసమితివారి కమిషన్ ప్రవర్తన తెల్లమయింది. పాకీస్తాన్‌తో ఒకమాట, భారతదేశంతో ఒకమాట చెప్పడం వల్ల భగ్నమైన కమిషన్ మధ్యవర్తిత్వం హాస్యాస్పదంగా ఉంది.

కమిషన్ ప్రవర్తనలో న్యాయదృష్టి పూర్తిగా లోపించినట్లు స్పష్టమయింది. ఆజాద్ కాశ్మీర్ సేనల్ని నిరాయుధంచేసి, వారి ఆక్రమణలోఉన్న ప్రాంతంలో శాంతి స్థిరపడిన తరువాతనే భారతసైన్యాలలో అధికభాగం జమ్మూప్రాంతాన్నీ కాశ్మీర్ లోయ ప్రాంతాన్నీ విడిచి వెళ్లిపోవాలనీ, ఆ తరువాతనే జనవాక్యనిర్ధారణ జరగాలనీ భద్రతాసమండలి తీర్మానంలో చెప్పబడింది. ఆ ప్రకారం అనుసరించడానికి భారతప్రభుత్వం సంసిద్ధత చూపింది. పాకీస్తాన్ అంగీకరించలేదు. కాని ఆ విషయాన్ని ఎటూ నిర్ణయించకుండా కాశ్మీర్ కమిషన్ కాశ్మీర్‌వచ్చి మధ్యవర్తిత్వానికి దిగింది. శాంతిస్థాపనప్రతిపాదనల సందర్భంలో ఈ విషయం చర్చకు వచ్చినప్పుడు పాకీస్తాన్‌కు ఒకమాటా, భారత ప్రభుత్వానికి ఒకమాటా చెప్తూవచ్చింది. భారత సైన్యాలు కాశ్మీరాన్ని విడిచి వెళ్లిపోయేసమయంలోనే ఆజాద్ కాశ్మీర్ సేనల్ని కూడా నిరాయుధం చెయ్యవచ్చుననీ, ముందుగా నిరాయుధం చెయ్యాలనే నిర్బంధం లేదనీ పాకీస్తాన్‌కు చెప్పింది. ముందుగా ఆజాద్ కాశ్మీర్ సేనలు నిరాయుధం చెయ్యబడినతరువాతనూ, ఆజాద్ కాశ్మీర్ ప్రాంతంలో శాంతిపరిస్థితులు ఏర్పడిన తరువాతనే భారతసైన్యాలు కాశ్మీర్ లోయనూ జమ్మూప్రాంతాన్నీ విడిచి వెళ్లవచ్చుననీ, అంతవరకూ అక్కడ ఉండవచ్చుననీ భారతప్రభుత్వానికి చెప్పింది. ఈరీతిగా చెప్పినందువల్లనే తిరిగి ప్రతిష్టంభన ఏర్పడింది. ఆజాద్ కాశ్మీర్ సేనల్ని నిరాయుధం చేసేవిషయమై శాంతిపరిష్కారసమావేశంలో చర్చించరాదని పాకీస్తాన్ పట్టుబట్టింది. చర్చించి తీరాలనీ, జనవాక్యనిర్ధారణకుగాని, భారతసైన్యాల ఉపసంహరణకి ముందుగాని ఆజాద్ కాశ్మీర్ ప్రాంతంలో శత్రుసేనల్ని నిరాయుధంచేసి శాంతిని స్థాపించేవిషయాన్ని చర్చించి, ఆతరువాత జనవాక్యనిర్ధారణవిషయం యోచించాలని భారతప్రభుత్వం ఖండితంగా చెప్పింది. శాంతిసమావేశం జరగలేదు.

వాదగ్రస్తవిషయమైన ఆజాద్ కాశ్మీర్ సేనల భవితవ్యంగురించి, జనవాక్యసంధారణగురించీ అడ్మిరల్ నిమిట్జ్‌ను పరిష్కర్తగా అంగీకరించి, అతని నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కమిషన్ మరొక ప్రతిపాదన చేసింది. అంటే కమిషన్ తన తీర్మానంతో ఇదివరలో నిర్ణయం చేసివేసినవిషయాన్ని (ఆజాద్ కాశ్మీర్ సేనల్ని నిరాయుధంచెయ్యాలని చేసిన నిర్ణయాన్ని) ఇప్పుడు త్రోసిపుచ్చి పరిష్కర్తవిచారణకి ఒప్పగించాలని ప్రతిపాదించిందన్నమాట. దీనికి ట్రూమన్, అట్లీలు అంగీకరించవలసిందని ప్రధాని నెహ్రూకు విజ్ఞప్తులు పంపారు.

ఈ ప్రతిపాదనను అంగీకరిస్తే, ఆజాద్ కాశ్మీర్ ప్రాంతంలో శత్రుమూకల్ని నిరాయుధం చెయ్యడం, భారత సైన్యాలు కాశ్మీర్ లోయను విడిచివెళ్లడం ఒకేసారి జరగాలని పాకీస్తాన్ పట్టుబట్టి తీరుతుంది. జనవాక్యనిర్ధారణ ఏకోరీతిని జరపాలని ఆత్రుతతో ఉన్న నిమిట్జ్ పాకీస్తాన్ కోరికను మన్నించక తీరని పరిస్థితి వస్తుంది. పాకీస్తాన్ కోరిక తీరనిచో జనవాక్యనిర్ధారణ జరగదు. అంటే తిరిగి భారతదేశాన్ని మరొక పాకీస్తాన్‌షరతుకి అంగీకరింపచెయ్యవలసివస్తుంది. ఈ పరిస్థితుల్లో భారతప్రభుత్వం కొత్త ప్రతిపాదనను నిరాకరించడం సమర్థనీయమే కాదు. అవసరంకూడా అయింది.

పాకీస్తాన్ ఒత్తిడివల్ల కమిషన్ తమ మొదటి నిశ్చయానికి స్థిరంగా నిలబడలేక చివరికి పరాజయాన్ని అంగీకరించక తప్పింది కాదు. కాని శాంతిసమాలోచనల వైఫల్యానికి బాధ్యతను భారతప్రభుత్వంతలపై రుద్దింది.

కమిషన్ వైఖరి ఆరంభంనుంచీ భారత ప్రభుత్వంపట్ల విముఖంగానే ఉంది. కమిషన్ వైఖరివల్లనే పాకీస్తాన్ మొండితికి ప్రోత్సాహం కలిగింది. కాని ఏ నిర్ణయంవల్లకాని కలిగే ఫలితాలను అనుభవించవలసిన ప్రజలకు ఏది మేలో ఏది కీడో గ్రహించడానికి రాజకీయవేత్తల కంటే అధికావకాశా లున్నాయి. పాకీస్తాన్ ఆక్రమణలో సకలయాతనలకూ లోనైన పల్లెవాసులు ఇస్లాంమతావేశల రాజకీయాలవల్ల ఫలితాలను స్వయంగా అనుభవించారు. కేవలం దోపిడికోసమే వచ్చిన పఠాన్లు ఇస్లాంసౌభ్రాతృత్వోద్యమంలోని నిజానిజాలు గ్రహించగలిగారు. "ఆజాద్ కాశ్మీర్" సైన్యాల ఆక్రమణలోఉన్న ప్రాంతంలో సరిహద్దుగ్రామాలనుంచి ప్రజలు "ఆజాద్ కాశ్మీర్" ప్రభుత్వానికి ఒక్క నమస్కారంపెట్టి ఈ సరిహద్దులోకి వచ్చేస్తున్నారు.

మతవైషమ్యాలను ద్విజాతిసిద్ధాంతాన్ని విశ్వసించని కాశ్మీర్‌జాతీయ సమావేశ సభ్యులు భారతదేశంలోనే చేరిపోగలరని ప్రకటించారు. కాశ్మీర్‌కమిషన్ చర్యలను నిరసించి అనేకమందిసభ్యులు భారతప్రభుత్వం కాశ్మీర్‌సమస్యగురించి భద్రతామండలిలో ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని వాదించారు. ఆరీతిగా తీర్మానం చెయ్యకపోయినా కాశ్మీర్‌వాసుల మనోగతి ప్రపంచానికి తెలిసివచ్చింది.

కాశ్మీర్‌కమిషన్‌కు ఏదో మాయ బుచ్చి సమస్యను పరిష్కారంచేశారనిపించుకోవాలనే కాని న్యాయం చేకూర్చాలనే యోచన ఎన్నడూ లేదని తెలుసుకోడానికి మరొకసంఘటనతో డయింది. కమిషన్‌ఆధ్వర్యంక్రింద యుద్ధవిరామసంధి సక్రమంగా అమలు జరుగుతున్నదో లేదో అజమాయిషీ చెయ్యడానికి నియమించబడిన మిలిటరీ అబ్జర్వర్లనాయకుడైన డెల్వాయ్ ప్రవర్తనే ఈసంగతిని ఋజువుపరుస్తున్నది.

ఆజాద్ కాశ్మీర్ సేనలతోచేరి ద్రోహచర్యలలో పాల్గొంటున్న సర్దార్ ఎఫెండీ, బేగం ఎఫెండీలతో డెల్వాయ్ మైత్రి చేకూర్చుకున్నాడు. శ్రీనగర్‌లో ఎఫెండీల గృహాన్ని తనకు నివాసంగా కాశ్మీర్ ప్రభుత్వమే ఇచ్చింది. ఈ ఆదరానైనా జ్ఞప్తిఉంచుకోకుండా, కాశ్మీర్ ప్రభుత్వాన్ని కన్నుగప్పి ఎఫెండీలకు చెందిన బంగారాన్నీ, ఆభరణాలనూ రావల్పిండిలో బేగం ఎఫెండీకి అందిచ్చాడు. తనకు నివాసంగా కాశ్మీర్ ప్రభుత్వం ఇచ్చిన ఇంటి అద్దెవిషయంలో కాశ్మీర్ ప్రభుత్వానికి తెలియకుండా ఎఫెండీల ఏజంటుతో వ్యవహారం నడిపాడు. ఇట్టివారిని తటస్థులుగా, మధ్యవర్తులుగా విశ్వసించడం అసంభవం. చేసిన ద్రోహానికి డెల్వాయ్ శిక్షాపాత్రుడు.

[సీతారాం]

---

# ★ గ్రంథ పరిచయం ★

## నవభారతం:

గ్రంథకర్త: శ్రీ సీతంరాజు సుబ్రహ్మణ్యంగారు; సుదర్శనపబ్లిషర్సు 10/3 తంబుచెట్టివీధి, మద్రాసు. వెల రూపాయన్నర.

ఇది స్వతంత్రభారతదేశంలో 1948-49లో ప్రభుత్వకార్యకలాపాల సమీక్ష. 1947-48 లో కార్యకలాపాలనుగురించి గత సంవత్సరం స్వాతంత్ర్యదినసందర్భంలో వీ రిట్టిగ్రంథాన్ని ప్రచురించారు. ప్రస్తుత గ్రంథంలో ఆర్థికవ్యవహారాలు, ప్రభుత్వపు బడ్జెట్లు, ఆహారసమస్య, కాశ్మీర్, ఇండియా పాకీస్తాన్ సంబంధాలు, సంస్థానాలు, హైదరాబాద్, విదేశవ్యవహారాలు, కార్మికవ్యవహారాలు, రాజ్యాంగపరిషత్తు, రాజకీయపక్షాలు మొదలైన ప్రకరణాలున్నాయి. ప్రతిసంవత్సరం మనదేశ రాజకీయ వ్యవహారాలు, ఆర్థికపాలనాదివ్యవహారాలసమీక్ష ప్రచురించవలసిన అగత్యం ఎంతైనా ఉంది. సులువుగా బోధపడే భాషలో ఈ విషయాలను వివరించిన ఈగ్రంథకర్త కృషి ప్రశంసాపాత్రం.

---

## సర్వోదయ:

[హిందూస్తానీ మాసపత్రిక: శ్రీకృష్ణ ప్రింటింగ్ వర్క్సు, వెల రూపాయి.]

అఖిలభారత సర్వసేవాసంఘంవారి ప్రచురణ. శ్రీ వినోబాభావే సంపాదకులు, దాదా ధర్మాధికారి కార్యకారీసంపాదకులు. 1942 ఆగస్టులో నిలిపివేయబడిన ఈ పత్రిక తిరిగి 1949 ఆగస్టునుంచి వర్ధానుంచి వెలువడుతున్నది.

'సర్వోదయ' సిద్ధాంతంగురించి గాంధీజీ 1938 జూలై 21 వ తేదీని ఈ క్రింది విధంగా వ్రాశారు:

"సత్యాగ్రహంద్వారానే తప్ప సర్వోదయం అసంభవం. ఇక్కడ సత్యాగ్రహంఅంటే ధాత్వర్థాన్ని మనం గ్రహించాలి. సత్యగుణ సమన్వితమైన ఆగ్రహమే అహింసాతత్వాను సారమై ఉంటుంది. సర్వోదయ సిద్ధి అహింసాసిద్ధిపైన ఆధారపడిఉంటుంది. అహింసాసిద్ధి తపశ్చర్యపైన ఆధారపడి ఉంటుంది. తపశ్చర్య సాత్వికమైనదై ఉండాలి. ఇందులో అవిశ్రాంతమైన ఉద్యమం, కృషి, వివేకం సమావిష్టమై ఉంటాయి. విశుద్ధతపస్సులో విశుద్ధ జ్ఞానం మిళితమైఉంటుంది.

కాని అనుభవరీత్యా తెలుస్తున్నదేమంటే ప్రజలు అహింసను నామమాత్రంగానే స్వీకరిస్తున్నారు. వారిలో మానసికఉద్యమం లోపించింది. వస్తుస్థితిని గ్రహించడానికైనా కృషి చెయ్యలేకుండా ఉన్నారు. హిందూస్తాన్ దీన దారిద్ర్యంలో మునిగిఉంది. మన మీ దారిద్ర్యాన్ని నివృత్తి చెయ్యాలని యత్నిస్తున్నాం. కాని ఈ దారిద్ర్యం ఎలా వచ్చింది? దీనిఅర్థమేమిటి? మొదలైనవిషయాల్ని ఎంతమంది విచారిస్తున్నారు? అహింసాభక్తులు ఇట్టి విషయాలపట్ల జ్ఞానం ఆర్జించాలి.

"ఈమాదిరి సాధనను అలవర్చడమే 'సర్వోదయ' కర్తవ్యం. ఇతరులతో వాదోపవాదాలతో కాలం వ్యర్థపుచ్చడం కాదు. 'సర్వోదయ' కార్యకర్తలు 'గాంధీవాదం' అనేమాటను మరిచిపోవాలి. గాంధీవాదమనే వస్తువేదీ లేదు. నేనే నూతనవస్తువునూ హిందూస్తానంలో ప్రవేశపెట్టలేదు. ప్రాచీనవస్తువునే నూతనరూపంలో సమర్పించాను.

దీనిని నూతనక్షేత్రంలో ప్రయోగించడానికి కృషి చేశాను. ఈ కారణంవల్ల నా వాదాన్ని గాంధీవాదమని చెప్పడం ఉచితం కాదు. మనకెక్కడ లభ్యమౌతుందో అక్కడల్లా సత్యాన్ని గ్రహిస్తాం. ఎక్కడ సత్యం గోచరిస్తుందో అక్కడ సత్యాన్ని ప్రశంసిస్తాం. ఆ సత్యాన్ని అనుసరిస్తాం. అనగా 'సర్వోదయ' లోని ప్రతివాక్యంలోనూ అహింస, జ్ఞానం ప్రతిఫలించాలి."

'సర్వోదయ' పత్రికఆశయాలనుగురించి సంపాదకులు వివరణలో "మలిన స్వార్థాన్నీ, సమాజహానికి దోహదమిచ్చే కార్యకలాపాలను నిరోధించి పోరాడ్డానికీ, ప్రజాకల్యాణసాధనం కోసం కృషిచెయ్యడానికీ 'సర్వోదయ' తిరిగి జన్మించింది" అని వ్రాశారు.

పూర్వంవలె ఉపదేశాలతో ఇప్పుడు కార్యం కొనసాగదనీ, సర్వరాజకీయ నైతికవాదాలను చర్చించవలసిన అవసరం ఉందనీ, స్వాతంత్ర్యసిద్ధివల్ల దృక్పథం మార్చుకోవలసిన అగత్యం కలుగుతున్నదనీ చెప్పారు.

గాంధీజీ నిర్మాణకార్యక్రమప్రచారానికీ, దీనస్థితిలోఉన్న వర్గాలవారి ఉద్ధరణకీ ఈపత్రిక కృషిచేస్తుందని చెప్పారు. స్వరాజ్యం, సర్వరాజ్యం వారి ఆదర్శాలు. విశ్వకుటుంబం వారి అంతిమాదర్శం.

పండిట్ నెహ్రూ పత్రికావ్యవస్థాపకులకు సందేశం పంపుతూ ఇలా అన్నారు. "నేటి క్లిష్ట సమస్యల పరిష్కారానికి గాంధీజీసిద్ధాంతాలు, వారి నిర్మాణాత్మక కార్యక్రమం ప్రజలందరూ తెలుసుకోవలసిన అగత్యం ఉందనీ, 'సర్వోదయ' పత్రిక ప్రజలకి దృక్పథం తెలపగలదనీ నా ఆశయం."

# ప్రస్తుత సమస్యలకు గాంధిజీ పరిష్కారం

(6-వ పేజీ తరువాయి)

అట్టి వ్యామోహంలోంచి బయటపడలేనంత కాలం అట్టి "విశ్రాంతి" నాగరికత అని, సౌఖ్య దాయకంఅని, ముందుకుపోవడంఅని, అభివృద్ధి అని, నినాదాలు లేవదీస్తూ ఉంటారు. నిజమైన సౌఖ్యానికి ఇవి దారితీయవని, నీటిబుగ్గలవలె క్షణికమని 'శాశ్వతత్వం' వీటిలోలేదని మానవ సేవలోనే నిజమైన సౌఖ్యం, ఆనందం ఉన్నాయని గాంధితత్వవాదం.

### విప్లవం

దేశంలోని ఆర్థికఅసమానత్వాన్ని పోగొట్టాలనే వాదంలోనివారే కమ్యూనిస్టులు కూడా. కాని వారి ఆశయాలు విపరీతం—ఉత్పత్తి వృద్ధి చేయడం, కొనుగోలుశక్తి వృద్ధిచేయడం ఇలాంటి "పిచ్చి" కేకలు వారికి రుచించవు. ఇప్పుడున్న ధనికవర్గాన్ని నాశనం చేయడమే రక్తపాతమే - విప్లవమే. ఇది పురికొల్పడానికి వారు కల్పించే ఆశ "ధనికుల డబ్బంతా అందరూ కలిసి పంచేసుకోవచ్చును" అని, ఏదో ఒక అశాంతి కల్పించి కార్మికులనో, కర్షకులనో, ఇంకెవరినో, రెచ్చగొట్టి, వర్గద్వేషం కల్పించి, ప్రభుత్వాన్ని స్తంభింపచేసి, విప్లవం లేవదీసేస్తే (ఇందులో కొందరిని హతమార్చేసి కూడా) దాని తరువాత పరిస్థితులు వాటంతటవే సర్దుకొని ఏదో ఒక సమానత్వం దానంతట అదే కలుగుతుంది అని వీరి నమ్మకం. రక్తపాతంవల్ల కలిగిన శాంతి రక్తపాతానికే దారితీస్తుంది కాని శాశ్వతశాంతి ఏర్పడదు. రష్యాలో రక్తపాతంతో సాధించిన సంస్థను క్రూరహింసమొనతో సంరక్షించుకోవలసివస్తున్నది. ఇంకొక అభిప్రాయం కలవాడికి ఈ సంస్థలో తావు లేదు. వాడు తుడిచిపెట్టుకొని పోవాల్సిందే. ఇట్టి విధానంవల్ల శాంతిఏర్పడ్డా అది కొద్ది కాలంమాత్రం నిలిచేదే. ఈ నాడు సాధించబడ్డవారి హృదయాలలో ద్వేషాగ్ని రగులుతూనే ఉంటుంది. అవకాశం కోసం వెదుకుతూనే ఉంటారు. సమయం చిక్కినప్పుడు దెబ్బకి దెబ్బ తియ్యడానికి లోలోన ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇది మానవునిలోని కేవల రాక్షసత్వాన్ని రేపే విధానం.

ఈనాడు దేశంలోని ధనం అంతా అందరికీ పంచివేయవచ్చును. కాని అందరూ ఒకే విధంగా అనుభవించరు. ప్రవృత్తులు వేరు. అందరి భావాలను యంత్రంలోవలె ఒకేమాదిరిగా మార్చడానికి వీలు లేదు. కొందరు వెంటనే ఖర్చుపెట్టి మరునాటికే ఆకాశంవేపు చూస్తారు. కొందరు ఎక్కువకాలం అనుభవించడానికి ప్రయత్నిస్తారు. మరికొందరు సంచిలో కట్టి చూచి ఆనందిస్తూ ఉంటారు. ఒకే ఇంటిలోని పిల్లలకు తినుబడివస్తువులు ఇస్తే కొందరు తక్షణం తినేస్తారు. కొందరు నింపాదిగా తింటూ ఆనందకాలం పొడిగించడానికి ప్రయత్నిస్తారు. కొందరు తింటే తరిగిపోతుందనే భయంతో దాచుకోడానికి ప్రయత్నంచేస్తారు. మొదటనే తినేసిన పిల్లలు మంచిమాటలాడో, భయపెట్టో, దొంగిలించో మిగతావారి సరకులను కాజేస్తారు. ధనం విషయంకూడా ఇదే జరుగుతుంది. నిలవచేసినవారి డబ్బు దుబారాఖర్చువారలకు కావాలి, తిరిగి తిరిగి విప్లవాలు సంభవిస్తూనే ఉండాలి. శాంతి ఏర్పడడానికి అవకాశం లేదు.

### యంత్రాలు

"అయితే ఈ విధానంలో యంత్రాలకు అసలే తావులేదా?" అనే ప్రశ్న ఒకటి బయలుదేరుతున్నది. "మీరు రైలెందు కెక్కుతారు నడిచి వెళ్లకూడదా? నీ చొక్కా ఏనూలుతో కుట్టేరు? నీ గడియారం ఎక్కడ తయారయింది?" అని ఇలా ఎన్నో ప్రశ్నలువేసి గాంధీవాదులను వెక్కిరించేవారు కూడా ఉన్నారు. ఈనాడు సమాజం యంత్రాలను పూర్తిగా విడిచిపెట్టలేదు. అలా విడిచిపెట్టమని గాంధీజీకూడా చెప్ప లేదు. సేవాగ్రామానికి రేడియో, విద్యుచ్ఛక్తి తమ ఖర్చుతో ఏర్పాటు చేయడానికి అనుజ్ఞ ఇమ్మని మహాత్ముని కొందరు కోరితే భారతదేశంలోని ఏడులక్షల గ్రామాలకు ముందు ఏర్పరిచి ఆఖరున తన ఆశ్రమానికి ఏర్పరచే ప్రయత్నం చేయమన్నాడు.

సింగర్ కుట్టుయంత్రం ఇళ్లలో వాడుకో వచ్చుననికూడా మహాత్ముడు ఒకప్పుడు చెప్పేడు. మానవులను నిరుద్యోగులుగా చేయడానికిగాని, కొందరి కష్టంవల్ల కలిగే ఫలం వారికి పూర్తిగా దక్కకుండా, మధ్యవర్తులు కాజేయడానికిగాని, 'గృహ'విచ్ఛిన్నానికిగాని వీలు కలిగించే యంత్రాలు వద్దన్నాడాయన. గృహపరిశ్రమలను వృద్ధిపరచే మంచియంత్రాలను నిర్మించినప్పుడు తనకెట్టి అభ్యంతరం లేదన్నాడు.

జీవితానికి అవసరమయే పదార్థాలన్నీ వికేంద్ర పద్ధతిలోనే తయారుకావాలని అతని ఆశయం. రైలుఇంజన్లు, మోటారులు, స్టీమర్లు మొదలగు గృహపరిశ్రమలలో తయారుచేయడానికి వీలులేని యంత్రాలు భారీపరిశ్రమలలోనే తయారు కావాలి. ఆ పరిశ్రమలు జాతీయపరిశ్రమలుగా ఉండాలి అని ఆయన మతం.

### రామరాజ్యం

గాంధిమహాత్ముడు ఆశించిన రామరాజ్యం మానవులలోని దైవత్వాన్ని ప్రజ్వలింపచేయాలన్న విధానం. సేవ, ప్రేమ, తత్వాల పునాదిమీద ఈ సౌధం నిర్మించబడాలని అతని ఉద్దేశం. ధనవంతులవద్దనున్న డబ్బుతగ్గించి పేదలకు ఇవ్వాలని అతని కోర్కెకూడా. కానిచట్టంవల్లనో, దౌర్జన్యం వల్లనో, రక్తపాతంవల్లనో, వారిడబ్బు గుంజి పేదలకు పంచడం కాదు. అతని ఆశయం హృదయపరివర్తనంవల్ల ఇది జరగాలని, ఆ ధనవంతులే, తాము, భగవంతుడిచ్చిన ధనానికి పూచీదార్లు మాత్రమేననే భావంతో, పేదలవిని యోగంకొరకే ఆ డబ్బును ఈశ్వరుడు తమకు ఇచ్చేడనే నమ్మకంతో, వారిది వారికి ఇవ్వకపోతే తమ ధర్మాన్ని తాము నెరవేర్చినవారు కాకపోతామనే విశ్వాసంతో, అదొక బలవంతంగా, ఒక బాధగావించకుండా సంతోషంతో ఇతరులకు పంచడానికి సంసిద్ధపడాలని అతని ఆశయం. ఇందువల్ల హృదయంలో పుండు పడని మాయని మచ్చ ఏర్పడదని, ఇచ్చినవాడికి పుచ్చుకున్నవాడికి కూడా తృప్తిఉంటుందని, వారిరువురి మధ్య శత్రుసంబంధంకాక, మిత్రత్వం భ్రాతృత్వం ఏర్పడి, విశ్వమానవకల్యాణానికి దోవతీయగలదని అతని నమ్మకం.

దీనితోపాటు డబ్బు పేదవారిదగ్గర మరింత తగ్గి ధనికులవద్ద మరింత హెచ్చకుండా తనంత తానే స్వల్పవ్యత్యాసములతో ప్రజలందరి మధ్య సర్దుబాటు అయే విధానం వికేంద్రపరిశ్రమల విధానమే నని ఆయన నమ్మేడు, బోధించేడు. ఈ కార్యసాధనకు గ్రామపునరుద్ధరణ, గృహపరిశ్రమల ప్రోత్సాహం, మూలములని అతని విశ్వాసం.

### గృహపరిశ్రమలు

గృహపరిశ్రమలలో పెట్టుబడిదారుడు, కార్మికుడు, ఉత్పత్తిదారుడు, విక్రేతకూడా ఒకడే అవుతాడు. పెట్టుబడికి అవసరమయే మొత్తం సామాన్యమానవుని అందుపాటులో ఉండడం చేత ధనవంతుని ఆశ్రయించవలసిన పని లేదు. తన కున్న చిన్న ఆవరణలోనే పరిశ్రమ కొనసాగించవచ్చును గనుక విశాలప్రదేశాలకు, ఉన్నత భవనాలకు పెద్దమొత్తాలు ఖర్చుపెట్టనక్కరలేదు. పరిశ్రమ ఇంటిలోనో ఇంటిసమీపంలోనో నడుస్తుంది గనుక, కార్మికుడు తన ఇల్లు విడిచిపోనక్కరలేదు. తాను, తనభార్య తనపిల్లలు అందరు ఎవరికి వీలయినంత, ఎవరికి చేతనయినంత వారు ఆ పరిశ్రమలో తోడ్పడవచ్చును. భార్యాభర్తలు వేర్వేరు స్థలాలలో పని చేయవలసిన బాధ్యత, అవినీతికి అవకాశం. పిల్లలు అమాతృహస్తాలలో పెరిగి ప్రేమరహితమైన స్వభావాలను పొందే అవకాశం, 'గృహ' విచ్ఛిన్నం ఉండవు. ఉత్పత్తిదారుడు, కొనుగోలుదారుడు ఒక్కచోటనో, సమీపంలోనో ఉంటారు. ఒకరిభావాలు, ఒకరి అవసరాలు, ఒకరి ఇబ్బందులు, ఒకరి అభిరుచులు ఇంకొకరు తెలుసుకోవచ్చును. అవసరాన్ని బట్టి ఉత్పత్తి జరుగుతుంది. మధ్యవర్తులుండ నక్కరలేదు. ప్రకటనలు, పోస్టర్లు, దళారీలు, కమిషనుఏజంట్లు అక్కరలేదు. అనవసరమయిన అధికోత్పత్తి ఉండదు. సామ్రాజ్యతత్వానికి తోవతీయదు. పెట్టుబడిదారుడే ఉత్పత్తిదారుడు కావడంచేత కూలి, లాభంకూడా ఒకరికే చెందుతాయి. కష్టం ఒకరు, ఫలం ఇంకొకరు అనుభవించే అవకాశం ఉండదు. కనుక సమ్మెలకు, తిరుగుబాట్లకు అవకాశం ఏర్పడదు. డబ్బు తనంతట అదే సర్దుకుంటుంది. ఒకనిదగ్గర పూర్తిగా లేకుండాపోయి ఇంకొకరి దగ్గర కుళ్లుతూ ఉండగల అవకాశాలు తగ్గుతాయి. ఉత్పత్తిదారుని కార్మికుని మనోవికాసం హస్తనైపుణ్యం స్వేచ్ఛగా వృద్ధిపొందడానికి, కావ్యరూపం దాల్చడానికి అనుకూలం ఏర్పడుతుంది. కళ వృద్ధిపొందుతుంది. ఉన్న మానవశక్తి అంతా పూర్తిగా వినియోగించడానికి వీలవుతుంది. మనస్సులు చెడువృత్తులలోకి త్రోవ దీయడానికి అవకాశాలు తగ్గుతాయి. అధికోత్పత్తి జరుగుతుంది. అవసరవస్తువులకొరత తగ్గుతుంది. అందరికి అవసరాలు లభిస్తాయి. యుద్ధాల అవసరం ఉండదు. ప్రేమ అందరిమధ్య కలుగుతుంది. గ్రామాలు వృద్ధిపొందుతాయి. దేశంలో సౌఖ్యం విరివిగా వ్యాపిస్తుంది. ఇదే మహాత్ముడు కలలుగనుచుండిన రామరాజ్యం.

అయితే ఇది ఒకరాత్రిలో వచ్చే విధానం కాదు. ఒక కలంపోటుతోనో, ఒక కత్తిపోటుతోనో, ఒక గుండుదెబ్బతోనో సాధించగల కార్యం కాదు. ఒక్కరాత్రి శాసనసభలో తీరిపోయే వ్యాపారం కాదు. కొంతకాలం పడుతుంది. ఈలోగా కొందరు ఈ భావాలకి బలి అవాలి. కొందరు త్యాగం చెయ్యాలి. అంత వరకు, ఓర్పు, శాంతం, ప్రేమ, సేవ, త్యాగం అవసరం. ఈ ఓర్పు లేక వెంటనే మార్పు, తేజూచుట, సామ్యవాద, కమ్యూనిస్టు ప్రణాళికలు. కాని ఓర్చి, ప్రయత్నిస్తే కొంచెం ఆలస్యం అయినా శాశ్వతమైన ఫలితం లభిస్తుందని నమ్మినదే గాంధీతత్వం.

### మనదేశపు పూర్వస్థితి

"ఇట్టి స్థితి సాధ్యమా, అందులోను ఈ రోజులలో పురోగమిస్తున్న నాగరికతను వెనక్కి నెట్టడానికి పిచ్చిప్రయత్నం" అని అభిప్రాయాలు వెలిబుచ్చేవారు లేకపోలేదు; చాలామంది ఉన్నారు. కాని మనదేశపు పూర్వపరిస్థితులు ఒక పర్యాయం జ్ఞాపకం తెచ్చుకుంటే ఈ అనుమానాలు చాలాభాగం తగ్గుతాయి. మన భరతమాత సిరిసంపదలతో తూలతూగిన రోజులున్నాయి. "సుజలాం, సుఫలాం, సస్యశ్యామలాం"అయిన రోజు లున్నాయి. ఆనాడు మన దేశం గ్రామ జీవనదేశంగా ఉండేది. 7 లక్షల గ్రామాలు స్వయంసంపూర్ణంగా ఉండేవి. గ్రామంలో ప్రధానవృత్తి వ్యవసాయం. దానిచుట్టూ అల్లుకొని, దానికి దోహదమిస్తూ, దానివల్ల దోహదం పొందుతూ ఉండే ఉపవృత్తులు వడుకు, నేత, వడ్రంగము, కమ్మరము, కుమ్మరము, కంచరపని, చమారీపని (తోలుపరిశ్రమ) ఇలా ఎన్నో గ్రామంలో ఉండేవి. వ్యవసాయదార్లు తమకు తిండికి సరిపోగా మిగిలిన తమపంటను, ఇతర అవసరాలు తీర్చుకోడానికి ఈపైచెప్పిన వృత్తులవారికి ఇచ్చి, వారినుండి జీవితానికి అవసరమైన వస్తువులను, వ్యవసాయానికి అవసరంఅయిన సహాయాన్ని పొందుతూ ఉండేవారు. కనుక ఎవరికీ తిండికిలోపంగా ఉండేది కాదు. వ్యవసాయదార్లు తీరిక సమయాల్లోనూ, ఇతరవృత్తులవారు కూడా అవకాశం కలిగినపుడు నూలువడికేవారు. ఆ నూలును సాలీలు నేసి వారికి బట్టలు ఇచ్చేవారు. సాలీలకు వ్యవసాయదారునివల్ల, కుమ్మరివల్ల, కుండలు. కర్రసామాను, మగ్గం, దాని మరమ్మత్తులు వడ్రంగివల్ల లభించేవి. చాకలివల్ల బట్టలు శుభ్రపడేవి. ఇలా ఒకరికొకరు అవసరాలు తీర్చుకుంటూ, ఒకరి ఉత్పత్తిని ఇంకొకరికి మార్చుకుంటూ ఉండేవారు. ఎవరికీ కొరత లేదు. ఎవరికీ అసౌఖ్యం, ఇబ్బంది లేవు. వీరిలో అన్యోన్య ఆధారత్వం, అందువల్ల సన్నిహిత సంబంధం, ప్రేమ, ఒకరికొకరు సేవ, సౌభ్రాతృత్వం లభించేవి.

ఎక్కువగా తోట లున్నవారు, తాము అనుభవించగా మిగిలినవి గ్రామంలోనివారికి పంచేవారు. ఎక్కువ డబ్బున్నవారు సత్రములుకట్టించి చెరువులు త్రవ్వించి చలివేంద్రాలు వేయించి, సమారాధనలు జరిపించి, నిక్షేపాలు పాలించి, ఒకరి బలవంతం అవసరంలేకుండా తమ ధర్మమనే దృష్టితో ధనం ఇతరులకు సద్దుకొనే మార్గాలు అవలంబించేరు. కాశీమొదలు, రామేశ్వరం వరకు ఉన్న అనేకవేల సత్రాలు ఇలా స్వబుద్ధిచే ధనవంతులు కట్టించినవే. పాంథులకు, మార్గస్థులకు, అలసినవారికి, ఆతురులకు ఉచితముగా అన్నం పెట్టడానికి ఈ సత్రాలలో ఏర్పాటు లుండేవి. ఎన్నడు ఇబ్బంది లేకుండా అవిచ్ఛిన్నంగా సాగడానికి వీటికి శాశ్వత భూవసతులు కల్పించిన మహానుభావు లుండేవారు.

గ్రామపంచాయితీలో తగవులు తీర్చుకునేవారు. అసలు "రచ్చరాతి" వద్దకు వెళ్లడానికే సిగ్గుపడేవారు. అథవా కలహం వచ్చినా, ఆ తగవు "రచ్చరాయి" వద్దనే పరిష్కారం అయేది. గ్రామం దాటి బయటికి తగవు వెళ్లేది కాదు. న్యాయం చక్కగా దొరికేది. గ్రామవ్యవహారాలన్నీ పెద్దలే చక్కపెట్టేవారు. గ్రామస్వరాజ్యం పూర్తిగా అమలులో ఉండేది. ఇరుగుపొరుగు గ్రామాల సమాఖ్య లుండేవి. ప్లీడర్లు, వర్తకులు, వ్యాపారులు సౌధాలు నిర్మించుకోడానికి గ్రామస్థులు కష్టించి సంపాదించిన ధనం సమర్పించుకోవలసిన అవసరం, అవకాశం ఏర్పడేవి కావు.

పడమటిదిక్కునుండి స్వార్థదృష్టి దిగుమతి అయేదాకా ప్రతివారూ ఇతరులకు ఏదోవిధంగా సేవ చేయడానికే తాపత్రయపడుతూ ఉండేవారు. పాశ్చాత్యన్యాయవిధానం పడవలలోంచి దిగేదాకా అప్పుడు ఎగవేయజూచినవాడు లేడు. చనిపోతున్న సమయంలో కుమారులకు తాము చేసిన అప్పులనే ప్రథమంగా అప్పగించేవారు. "ఇక్కడ తీరుస్తావా - అక్కడ తీరుస్తావా" అని అడిగి అప్పు ఇచ్చేవారుండేవారు. "కాలదోష" సిద్ధాంతం దిగుమతి అయినతరువాతనుండే ఈ తగవులు, అప్పులు తీర్చక తిప్పలుపెట్టేభావాలు కోర్టులకు వెళ్లడాలు, ఇళ్లు వాకిళ్లు అమ్మి ప్లీడర్లకు సౌధాలు ఇచ్చి బిచ్చానికి త్రోవ తీయడాలు, ప్రారంభం అయేయి.

గాంధీజీ వాంఛించిన "రామరాజ్యం" ఈ దేశానికి క్రొత్తది కాదు. ఒకప్పుడు ఈదేశం పూర్తిగా అమలులో పెట్టినదే. బుద్ధుడు మొదలగు మహాపురుషులు, దేశదేశాలకు సందేశమిచ్చినదే. కాలవశంచేత దూళికప్పిన మాణిక్యం అది. ఆ ధూళిని తుడిచి మాణిక్యాన్ని పొందడం వెనక్కినడవడం అయితే అవుగాక. మంచిని, శ్రేయస్సును పొందగలిగితే వెనక్కి వెళ్తే నేమి? ముందుకు నడుస్తున్నామని భ్రమించి అణుశక్తిలో వినాశం అయేదానికన్న వెనక్కి నడిచి ప్రపంచశాంతికి మార్గం చూపడం అన్నివిధాల శ్రేయస్సే.

### 'నాగరికత'

"నాగరికత" అనబడే ఈనాటి విధానంలో ప్రపంచం చాలా ముందుకు పోయింది. క్షేమాన్ని మించి ముందుకుపోయింది. ప్రమాదస్థితి వచ్చే వరకూ ముందుకు పోయింది. ఇంకొక్కడుగు అదే మార్గంలో ముందుకువెళ్తే అగాధంలోపడే పరిస్థితులు కనబడుతున్నాయి. అట్టి పరిస్థితులలో మహాత్ముడు ప్రపంచానికి సౌఖ్యంచేకూర్చగల ఒక నూతన సందేశాన్ని ఇచ్చేడు. ఒక నూతన మార్గాన్ని చూపేడు. ఆ మార్గాన్ని అనుసరించి శాంతికి దారితీయడమా లేక పురోగమనం అనుకొని అణుశక్తివలని వినాశనానికి దారితీయడమా? ఏది మంచిది?


### నూతన విద్యావిధానం

ఈ మనోపరివర్తనం, ఈ సేవాతత్వం, ఈపర శ్రేయోదృష్టి ప్రజలలో తిరిగి కలిగించగల శక్తి తన నవీన విద్యావిధానంలో ఇమిడి ఉన్నది మహాత్ముడు ఆశించేడు. విద్యావిధానంలో ఒక క్రొత్తవిప్లవం తెచ్చేడు. కబుర్లరంగంలోనుంచి కార్యరంగంలోకి లాగేడు విద్యావిధానాన్ని. బాల్యంలోనే ఈ దృష్టులు అలవరిస్తే, ఆ బీజాలు మహావృక్షాలయి, ఫలాలను నీడను తిరిగి బీజాలను దేశం అంతటా, వెదజల్లుతాయని బోధించేడు. కాని ఈమార్పు కబుర్లవల్ల రాదు. ఈవిధానంలో నమ్మకం ఉన్న గురువులు, ఆదర్శప్రాయమైన జీవితం గడిపి, పూర్వపు గురుకులవాసంలోని ఆచార్యులవలె బాలురలో శారీరక, మానసిక, నైతిక, ఆధ్యాత్మికశక్తులను పెంపొందించాలి. అట్టి ఉపాధ్యాయులు ఏర్పడిననాడే మానవ జాతికి కల్యాణం. "రామరాజ్యం."

# వార్తాచిత్రాలు




జమ్మూ ప్రాంత భారత సేనాపతి మేజర్ జనరల్ ఆత్మసింగ్ ఈ నెల 22-న కారుప్రమాదంవల్ల మరణించారు. ఆయనశవాన్ని ఢిల్లీ తీసుకువచ్చి, సైనికమర్యాదలతో అంత్యక్రియలు జరిపారు. ఆత్మసింగు శవాన్ని చితిమీద పెడుతూండడం ఈ చిత్రంలో కానవగును.




కార్మికులు పనిపాటల్లోకి వెళ్లినప్పుడు వారి పిల్లలను కనిపెట్టి సంరక్షించటానికి బళ్లారి మహిళలు ఒక సంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రధాని కుమారస్వామిరాజా, విద్యామంత్రి సీతారామరెడ్డిగార్లు ఈ కేంద్రాన్ని దర్శించినప్పటి చిత్రం. మొదటివరస నుంచున్నవారు ఎడమనుంచి (1) ట్రైనింగు స్కూల్ ప్రధానోపాధ్యాయిని పద్మావతీదేవి, (2) సీతారామరెడ్డి, (3) లక్ష్మీదేవి, (4) రాయ్‌పతి, (5) కుమారస్వామిరాజా, (6) డా॥ యెకీనాసపతి, (7) మనోరమాబాయి, (8) పద్మావతి చెట్టిగార్లు.



చాంచ్‌రంగంలో యుద్ధవిరమణసరిహద్దునిర్ణయం: సమితిపరిశీలకులతో భారత పాకిస్తాన్ ప్రతినిధులు సరిహద్దుగీతను నిర్ధారణచేస్తున్నారు.



విజయవాడపట్టణప్రజలు ఏటికట్టపొడుగూనా వరదను చూచుట





విజయవాడలో కృష్ణవరదలలో మునిగిన ఇండ్లనుండి సామానులను పడవలమీద ఒడ్డుకుచేర వేసి ఏ చెట్టునీడనో చేరుకొంటున్నారు ప్రజలు.

Regd. No. M. 4479



Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1.